www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★




టెల్ అవీవ్‌లో రాత్రంతా లక్షమంది జాగారం 02
భారత్‌కు గొప్ప వైవిధ్యాన్ని ప్రతిబింబించే విద్యా వ్యవస్థ అవసరం 05
రిమాండ్ ఖైదీ మృతి.. బంధువుల ఆందోళన 03

సంపుటి 08, సంచిక: 312 | సోమవారం | 13-10-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



### అమ్మాయిలు రాత్రిపూట బయటకు వెళ్ళొద్దు

పశ్చిమ బెంగాల్ దుర్గాపూర్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీకి చెందిన ఒడిశా విద్యార్థిని శుక్రవారం రాత్రి స్నేహితుడితో కలిసి విందుకు బయటకు వెళ్లినప్పుడు సామూహిక అత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిగ్భ్రాంతికరమైన వ్యాఖ్యలు చేశారు. 05



### కర్రెగుట్టల్లో సిఆర్‌పిఎఫ్ శిక్షణ పాఠశాల

ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు వెంబడి ఉన్న కర్రెగుట్ట కొండలలో సైనికుల కోసం ఒక కమాండో శిక్షణ పాఠశాలను ఏర్పాటు చేయాలని సిఆర్‌పిఎఫ్ యోచిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్-మే మధ్య ఈ గుట్టలలో 31 మంది మావోయిస్టులను చంపిన అతిపెద్ద నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలలో ఒకటి. 05



### పథకం ప్రకారం ఆర్‌టిఐ హననం

మోదీ ప్రభుత్వం దేశంలో సమాచార హక్కు చట్టాన్ని (ఆర్‌టిఐ చట్టం) పథకం ప్రకారం బలహీనపరచి హననానికి పాల్పడు తోందని కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది. సమాచార హక్కు దేశంలో చట్టరూపం దాల్చి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ పైవిధంగా స్పందించింది. 05

## చీరాల బీచ్‌లో విషాదం

సముద్ర స్నానం చేస్తూ ఐదుగురు గల్లంతు

ఒడ్డుకు కొట్టుకువచ్చిన మూడు మృతదేహాలు

మరో ఇద్దరికోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

**చీరాల :** చీరాల మండలం వాడరేవులో విషాదం చోటు చేసుకుంది. ఐదుగురు విద్యార్థులు సముద్ర స్నానం కోసం వాడరేవు బీచ్‌కు వెళ్లి గల్లంతయ్యారు. నీటిలో మునిగి సముద్రంలోకి కొట్టుకుపోయారు. కొద్దిసేపటికి ముగ్గురు విద్యార్థుల మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మరో ఇద్దరు విద్యార్థుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. సెలవు రోజులు కావడంతో బీచ్‌లో సరదాగా గడిపేందుకు అమరావతిలోని విట్ యూనివర్సిటికి చెందిన కొందరు విద్యార్థులు వాడరేవు బీచ్‌కు వెళ్లారు. వారిలో సాకేత్, మణిదీప్, సాత్విక్, సోమేష్, గౌతమ్ అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. దీంతో ఆ ప్రాంతానికి చెందిన మత్స్యకారులు, గజ ఈతగాళ్లు వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గల్లంతైన కాసేపటికి సాకేత్, మణిదీప్, సాత్విక్ మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. సోమేష్, గౌతమ్‌ల ఆచూకీ ఇప్పటివరకూ లభ్యం కాలేదు. దీంతో ఈ ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## ఎస్ఆర్ఎస్‌పి-2 ప్రాజెక్టుకు ఆర్‌డిఆర్ పేరు

- 24 గంటల్లో జిఓ జారీ
- పార్టీ కోసం సర్వం ధారపోసిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుటుంబానికి రాజకీయంగా అవకాశం ఇస్తాం
- సంతాప సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన



ప్రజాపక్షం/సూర్యాపేట

నాలుగు దశాబ్దాలుగా ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కోసం మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రైతు బిడ్డగా పుట్టిన దామోదర్ రెడ్డి వారి కష్టసుఖాలను ఎరిగి అన్నదాతల సంక్షేమం కోసం శ్రీరాంసాగర్ రెండవ దశ ప్రాజెక్టు సాధనకు ఆయన చేసిన పోరాట ఫలితంగానే తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజక వర్గాలకు గోదావరి జలాలు కాల్వల్లో పారుతున్నాయని, దీంతో ఈ ప్రాంతం పచ్చని పంట పొలాలతో నేడు కలకలలాడుతుందన్నారు. నల్లగొండ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు శాసనసభ్యులందరి కోరిక మేరకు ఎస్ఆర్ ఎస్‌పి 2 ప్రాజెక్టుకు ఆర్‌డిఆర్ (రాంరెడ్డి దామోదర్ రెడ్డి) పేరుగా తరువాయి 12లో

### దొర అయినా ఏనాడు అలా వ్యవహరించలేదు

కూనంనేని సాంబశివరావు 12



## బిజెపి, బిఆర్ఎస్‌కు బిసిలు అక్కరలేదా?

- 42శాతం రిజర్వేషన్ల కోసం తెలంగాణ ఉద్యమ తరహాలో ఎందుకు కలిసిరావడంలేదు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నిలదీత
- రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు మాట్లాడదు? బిల్లును ఆమోదించదా? అని ప్రశ్న

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ఉద్యమం తరహా ' బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల' సాధన కోసం బిజెపి, బిఆర్ఎస్ ఎందుకు కలిసి రావడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. రిజర్వేషన్ల అమలుపైన రాహుల్ గాంధీ మాట్లాడడం లేదని ప్రశ్నిస్తున్న బిజెపి, రాహుల్ గాంధీ మాట్లాడకపోతే కేంద్ర ప్రభుత్వం మాట్లాడదా?, ఆ బిల్లులను ఆమోదించరా? అని నిలదీశారు. 'బిసి హక్కుల సాధన సమితి' రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి కూనంనేని సాంబశివ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'బిసి హక్కుల సాధన సమితి' అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు, గౌరవ అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, నాయకులు పాండురంగాచారి, పల్నాడు యాదయ్య, విజయుడు, ఎల్. శ్రవన్, ప్రమీల, సి.హెచ్ .కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు ప్రసంగిస్తూ శాసనసభ ఆమోదించిన 'బిసి రిజర్వేషన్ల బిల్లుల'ను కేంద్రంలోని అధికార బిజెపి ఆమోదిస్తే, ప్రస్తుతం తరువాయి 2లో

## కాషాయ పార్టీలో నరనరానా బిసి వ్యతిరేకతే

రెండు పార్టీలు కలిసి డ్రామాలాడుతున్నాయ్

బిసి కోటాపై వెనక్కి తగ్గేది లేదు

42 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తున్నాం

టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపి నరనరాన బిసి వ్యతిరేక పార్టీ అని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి డ్రామాలో బిఆర్ఎస్ కూడా తోడైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు పార్టీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టు కువెళ్తామన్నారు. బిసి కోటాపై వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు తరువాయి 2లో




## అంతరాలు పెరుగుతున్నాయ్

- విచ్ఛిన్నమవుతున్న కుటుంబ బంధాల సంఖ్య కూడా పైపైకి వెళుతోంది
- అన్యాయాలను ఎదిరించే అంశంలో మౌనంగా ఉండొద్దు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక
- ఘనంగా సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం 26వ వార్షికోత్సవం

ప్రజాపక్షం/హైదరాబాద్

చలి చీమ రెండు ముక్కలైనా కొట్లాడాలనే చూస్తుందని, అలాంటి చిన్న జీవికే అంత చైతన్యం ఉంటే, శక్తివంతమైన మనిషి తన చుట్టూ జరుగుతున్న అన్యాయాలను ఎదిరించే అంశంలో మౌనంగా ఉండకూడదనే ఉద్దేశంతోనే చండ్ర రాజేశ్వర్ రావు (సి.ఆర్) లాంటి ఎంతో మంది మహనీయులు రచయితలుగా, గాయకులుగా, కథనాలతో వివిధ రకాలుగా ప్రజలలో చైతన్యాన్ని నింపేందుకు కృషి చేశారని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక అన్నారు. సమాజంలో అంతరాలు పెరిగిపోతున్నాయని, విచ్ఛిన్నమవుతున్న కుటుంబ బంధాల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'చండ్ర రాజేశ్వర్‌రావు (సి.ఆర్) ఫౌండేషన్ 'వృద్ధాశ్రమం 26వ వార్షికోత్సవం' ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా సభాధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక, సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట రెడ్డి , సి.ఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కె.అజయ్ కుమార్, కార్యదర్శి పి.జె. చంద్రశేఖర్ రావు, హెల్త్ సెంటర్ డైరక్టర్ డాక్టర్ రజని, సి.ఆర్.ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు కె.రామ కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రరాజేశ్వర్ రావు,మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఇటీవల మరణించిన మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డితో పాటు వృద్ధాశ్రమంలో చనిపోయిన పలువురి మృతికి కొద్దిసేపు మౌనం పాటించి నివాళ్లు అర్పించారు. అంతకుముందు చండ్ర రాజేశ్వర్ రావు విగ్రహానికి పూల మాల తరువాయి 12లో

## బిసి జెఎసి ఆవిర్భావం

చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్‌గా జాజుల

వైస్ చైర్మన్‌గా నారగోని : 18న రాష్ట్ర బంద్



ప్రజాపక్షం/హైదరాబాద్

రిజర్వేషన్లను సాధించేందుకు వివిధ బిసి సంఘాలు ఏకతాటిపైకి వచ్చాయి. రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగానే వివిధ బిసి సంఘాలతో 'బిసి ఐక్య కార్యాచరణ కమిటీ'(బిసి జెఎసి) ఏర్పడింది. జెఎసి చైర్మన్‌గా ఎంపి ఆర్.కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా విజిఆర్ నారగోని, వర్కింగ్‌చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్‌గౌడ్, కో ఛైర్మన్లుగా దాసు సురేశ్, రాజారాం యాదవ్ ఎన్నికయ్యారు. ఈ నెల 13న తలపెట్టిన జాతీయ రహదారుల దిగ్బంధనం, 14న రాష్ట్ర బంద్ వాయిదా వేసి, ఈనెల 18వ తేదిన 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో రాష్ట్ర బంద్ చేపట్టాలని జెఎసి నిర్ణయించింది. బిసి జన సభ అధ్యక్షులు రాజారామ్ అధ్యక్షతన హైదరాబాద్ లక్డీకాపూల్ లోని అశోక్ హోటల్‌లో వివిధ తరువాయి 2లో

## చెరిసగం

- బిజెపి, జెడియులు చెరో 101 స్థానాల్లో పోటీ
- బిహార్‌లో సీట్ల పంపకాలు పూర్తి చేసిన ఎన్‌డిఎ

**న్యూఢిల్లీ :** బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, వివిధ పార్టీల్లో సీట్ల కేటాయింపుపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. తాజాగా ఎన్‌డిఎలో సీట్ల పంపకంపై నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. సీట్ల భాగస్వామ్యం ఖరారు చేసింది. మొత్తం 243 సీట్లపై ఒప్పందం కుదిరింది. బిజెపి, జెడియులు చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29 స్థానాల్లో బరిలో దిగనుంది. కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఎఎం)కు, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహా సారథ్యంలోని తరువాయి 2లో

## ట్రేడ్ వార్ ప్రారంభిస్తే పోరాడేందుకు సిద్ధం

**అమెరికాకు చైనా హెచ్చరిక**

- వాణిజ్య యుద్ధం విషయంలో మా వైఖరి స్థిరంగా, చెక్కుచెదరకుండా ఉంది
- యుద్ధ పరిస్థితులు రావాలని కోరుకోవడం లేదు



**బీజింగ్:** వాణిజ్య యుద్ధాన్ని తాము కోరుకోవడంలేదని, కానీ అమెరికా గనుక వాణిజ్య యుద్ధం ప్రారంభిస్తే ఎదుర్కొని పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, భయపడేది లేదని చైనా హెచ్చరించింది. ఈ విషయంలో చైనా వైఖరి చాలా స్థిరంగా చెక్కుచెదరకుండా ఉందని, వాణిజ్య యుద్ధ పరిస్థితి రావాలని కోరుకోవడంలేదని ఆ దేశ వాణిజ్య మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఒకరు ఆదివారం బీజింగ్‌లో స్పష్టం చేశారు. చైనా చట్టాలు, ఎగుమతి నిబంధనలకు అనుగుణంగా సాధారణ ప్రక్రియగా ఈ నియంత్రణలు విధించామని, ఒక బాధ్యతగల అతిపెద్ద దేశంగా, వాణిజ్య ఎగుమతుల దేశంగా చైనా ఎల్లప్పుడూ అంతిమంగా తమదేశ భద్రతను దృష్టిలో పెట్టుకునే చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. దేశీయ భద్రత, తరువాయి 2లో

## పాకిస్థాన్‌పై అఫ్గాన్ ప్రతీకార దాడి

ఆర్మీ కాల్పుల్లో 58 మంది పాక్ సైనికులు హతం

భారత్ ప్రోత్సాహంతోనే దాడులని పాక్ నిందలు : ఖండించిన కేంద్రం



**కాబూల్:** అఫ్గానిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దుల్లో శనివారం రాత్రి పొద్దుపోయాక సైనికులమధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 58 మంది పాకిస్థానీ సైనికులను హతమార్చినట్లు అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. అఫ్గానిస్థాన్ విదేశాంగమంత్రి న్యూఢిల్లీ పర్యటన పూర్వరంగంలో జరిగిన దాడులతో భారత ప్రభుత్వంపై పాకిస్థాన్ నిందలు వేసింది. ఈ వారం ఆరంభంలో పాకిస్థాన్ సైన్యం తమ గగనతలాన్ని ఉల్లంఘించి దాడులకు పాల్పడిందని, ఇందుకు ప్రతీకార దాడులు చేశామని, ఈ దాడుల్లో మరో 30 మంది పాకిస్థాన్ సైనికులు గాయపడ్డారని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. పాకిస్థాన్ కూడా ఆలస్యంగా ఒక ప్రకటన చేస్తూ, సరిహద్దుల్లో తాలిబన్ సైన్యం దాడుల్లో 23 మంది సైనికులు అమరులయ్యారని, అఫ్గానిస్థాన్‌వైపు సైనికులతోపాటు 200 ఉగ్రవాదులు మరణించారని పేర్కొంది. సరిహద్దుల్లో పాకిస్థానీ సైనిక కేంద్రాలపై అఫ్గానిస్థాన్ సైన్యం దాడులు చేసినట్లు రెండుదేశాల సైనికవర్గాలు ఒకేవిధమైన ప్రకటన చేశాయి. ఆదివారం ఉదయంనాటికి కాల్పులు ఆగిపోయినట్లు పాకిస్థాన్ పేర్కొంది. ఐతే ఖుర్రం ప్రాంతంలో ఇంకా అడపాదడపా కాల్పులు జరుగుతూనే ఉన్నాయని స్థానిక అధికారులు చెప్పారు. కానీ తమ సరిహద్దు కాల్పుల ఆపరేషన్ ఆదివారం తెల్లారకముందే ముగిసిందని తాలిబన్ ప్రభుత్వం పేర్కొంది. అఫ్గానిస్థాన్ గగనతలాన్ని పాకిస్థాన్ సైన్యం ఉల్లంఘించిందని, దీనికి ప్రతీకారంగా ఈ దాడులు చేశామని అఫ్గానిస్థాన్ రక్షణశాఖ అధికార ప్రతినిధి ఎనయతుల్లా ఖోవారజ్మీ చెప్పారు. తమ గగనతలాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే దానిని రక్షించుకోవడానికి సైన్యం సిద్ధంగా ఉంటుందని ఆయన చెప్పారు. అఫ్గానిస్థాన్‌లోని ఏ ప్రాంతంలో ఉన్న భూభాగానికి కూడా తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## ఈజిప్టులో నేడు శిఖరాగ్ర సదస్సు

### గాజా శాంతి ఒప్పందంపై సంతకాలు

**షర్మ్–ఎల్–షేక్:** గాజాలో శాంతి ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు వీలుగా 20 దేశాల నాయకులతో ఈజిప్టు ప్రభుత్వం సోమవారం ఒక శిఖరాగ్ర సదస్సు నిర్వహిస్తోంది. ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా పాల్గొంటున్నారు. ఈజిప్టు దేశాధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్–సిసి అధికార ప్రతినిధి ఈ విషయం చెప్పారు. గాజాలో శాంతి స్థాపనకు ఇజ్రాయెల్–హమాస్‌మధ్య ఒప్పందం కుదిరితే తుది పత్రాలపై సంతకాలు చేయడానికి తమ దేశానికి రావాలని ట్రంప్‌కు ఈజిప్టు అధ్యక్షుడు గతవారంలోనే ఆహ్వానం పలికారు. సోమవారం సదస్సులో శాంతి ఒప్పందం తుది ప్రతిపై నాయకులు సంతకాలు చేస్తారు. బ్రిటన్, స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్‌దేశాల ప్రధాన నాయకులు హాజరవుతారు. జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీ, ఖతార్, యునైటెడ్ అరబ్ నేషన్స్, జోర్డాన్, టర్కీ, సౌదీ అరేబియా, పాకిస్థాన్, ఇండోనేసియా దేశాలకు చెందిన విదేశాంగమంత్రులు సోమవారం శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటున్నారు.



## మడగాస్కర్‌లో అధికార పోరు

**అంటనానరివో:** ఆగ్నేయ ఆఫ్రికాతీరప్రాంత ద్వీపదేశం మడగాస్కర్‌లో సైన్యంలోని చీలికవర్గం దేశాధికారాన్ని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించింది. దీంతో ఆ దేశంలో సంక్షోభం తారాస్థాయికి చేరింది. దేశాధ్యక్షుడు ఆండ్రీ రాజోలినా ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు గుర్తుతెలియని శక్తులు కుట్ర చేస్తున్నాయని అధ్యక్ష భవనం ప్రకటన చేసిన కొద్ది గంటలకే సైన్యంలోని చీలికవర్గం దేశాధికారాన్ని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించింది. ఒకప్పుడు దేశాధ్యక్షుణ్ణి అధికారంలో నిలబెట్టేందుకు సహకరించిన సైన్యం ఇప్పుడు దేశంలో నిరసన ప్రదర్శకులతో చేతులు కలపడంతో చీలికవర్గం ఈ ప్రకటన చేసింది. సైన్యంలో త్రివిధ దళాలు తమ చెప్పుచేతల్లో ఉన్నాయని తెలిపింది. 2009లో కుట్రద్వారా రాజోలినాను సైన్యం అధికారంలో కూర్చోబెట్టింది. ఇప్పుడు ఆయనకు ఎదురు తిరిగింది. 2023లో రాజోలినా ఎన్నిక వివాదాస్పదమైనప్పటి నుండీ దేశంలో ప్రజాందోళన చెలరేగింది. కొద్దిరోజులుగా దేశంలో ప్రజలు ముఖ్యంగా యువకులు తమ ఆందోళనను ఉద్ధృతం చేశారు.

## ఆర్‌టిఐను చిత్తశుద్ధితో అమలు చేయాలి

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) అమలులో ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని పలువురు వక్తలు కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా.బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్ అధ్యక్షతన సమాచార హక్కు చట్టం దినోత్సవం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.జి.చిన్నారెడ్డి, మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ డా.జి.చంద్రయ్య, టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ హాజరై, మాట్లాడారు. సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదని పేర్కొన్నారు.

## చెరిసగం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్‌ఎల్‌ఎం)కు ఆరు చొప్పున సీట్లు కేటాయించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర సీనియర్ నాయకులు ఉన్న బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం తర్వాత సీట్ల కేటాయింపు విషయాన్ని కేంద్రమంత్రి, బిజెపి సీనియర్ నేత ధర్మేంద్ర ప్రధాన్ ఖరారు చేశారు. జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, ఉప ముఖ్యమంత్రి, బిజెపి నాయకుడు సామ్రాట్ చౌదరి, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ కూడా పోస్టులు పెట్టారు. లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 29 సీట్లలో పోటీ చేయనుంది. కనీసం 15 సీట్లు కావాలని పట్టుబట్టిన జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ అవామ్ మోర్చాకు ఆరు నియోజకవర్గాలు మాత్రమే దక్కాయి. మిగిలిన ఆరు అసెంబ్లీ విభాగాలు రాజ్యసభ ఎంపి ఉపేంద్ర కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చాకు వెళ్లాయి. గత కొన్ని రోజులుగా దేశ రాజధానిలో నాయకులంతా ఈ ఒప్పందం స్నేహపూర్వక వాతావరణంలో కుదిరిందని ఏకగ్రీవంగా ప్రకటించారు. గత ఎన్నికల్లో జెడియు 115 సీట్లలో పోటీ చేసింది. ఆ తర్వాత బిజెపి 110 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. హిందుస్తానీ అవామ్ మోర్చా ఏడు స్థానాల్లో బరిలో దిగనుంది. అప్పుడు లోక్ జనశక్తి పార్టీకి నాయకత్వం వహిస్తున్న పాస్వాన్ విడిగా పోటీ చేసి 135 సీట్లలో అభ్యర్థులను నిలబెట్టారు. 2020లో మరో ఎన్‌డిఎ భాగస్వామి, మాజీ రాష్ట్ర మంత్రి ముకేశ్ సహానీకి చెందిన వికాస్శీల్ ఇన్సాన్ పార్టీ, ప్రస్తుతం ఇండియా బ్లాక్‌లో ఉంది, నాలుగు సీట్లలో పోటీ చేసింది.

## బిసి వ్యతిరేకతే

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నకుట్రలకు తాము భయపడమని తేల్చిచెప్పారు. బిసి రిజర్వేషన్‌ల పెంపుపై తమ చిత్తశుద్ధి ప్రజలకు తెలుసు అన్నారు. బిల్లులు గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రధాని దగ్గరికి వెళ్లి బిజెపి నాయకులు ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. బిసి సంఘాలు బంద్‌కు పిలుపునిస్తే మద్దతు ఇస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బిసి సంఘాలు ధర్నా చేసినప్పుడు కేంద్ర మంత్రి బండి సంజయ్, ఈటల రాజేందర్ ఎక్కడ దాక్కున్నారని నిలదీశారు.

**ఆర్‌టిఐ చట్టానికి తూట్లు..**

కేంద్రంలో కాంగ్రెస్ తీసుకొచ్చిన గొప్ప చట్టాలకు ఎన్‌డిఏ ప్రభుత్వం తూట్లు పొడిచిందని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. యుపిఏ హయాంలో చారిత్రాత్మక చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. దూరదృష్టితో యుపిఏ ప్రభుత్వం సమాచార హక్కు చట్టం తీసుకొచ్చిందన్నారు. ప్రతి పౌరుడు ప్రశ్నించే హక్కును కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. కీలక చట్టాలను బిజెపి నిర్వీర్యం చేసిందని విమర్శించారు. అంబానీ, అదానీ కోసం ఆర్‌టిఐ చట్టానికి తూట్లు పొడుస్తోందని దుయ్యబట్టారు. ఆర్‌టిఐ చట్టానికి సవరణలు చేసి, దాని స్వతంత్రతను బలహీన పరిచారని విమర్శించారు. ఆర్‌టిఐని నీరు గార్చేందుకు కమిషనర్ పోస్టులను భర్తీ చేయడం లేదన్నారు. కేంద్రంలో 11 మంది ఆర్‌టిఐ కమిషనర్లు ఉండాల్సిన చోట ఇద్దరే ఉన్నారని తెలిపారు. ఆర్‌టిఐ తీసుకొచ్చి 25 ఏళ్లయిన సందర్భంగా దాని గొప్పతనం తెలియచేయాలని మహేశ్ కుమార్ గౌడ్ కోరా రు. కేంద్రంలోని బిజెపి సర్కార్ ప్రజలను వంచిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశా రు. కేంద్రంలోని ఫాసిస్టు బిజెపి ప్రభుత్వ అవినీతిని బహిర్గతం చేసే వ్యక్తులు రక్షణ లేకుండా దాడులు, వేధిం పులకు గురవుతున్నారని మహేశకుమార్ గౌడ్ అన్నారు.

# టెల్ అవీవ్‌లో రాత్రంతా లక్షమంది జాగారం

### ర్యాలీలో ట్రంప్ భజన చేసిన విట్‌కాఫ్
### గాజాలోకి వందల లారీల్లో మానవతా సహాయం

**కైరో:** గాజాలో శాంతిస్థాపన చర్యలు కీలకదశకు చేరుకున్నాయి. సోమ,మంగళవారాలలో జరిగే పరిణామాలు సజావుగా కొనసాగుతాయా? లేదా? అనే ఉత్కంఠతో ప్రపంచదేశాలు మధ్యప్రాచ్యంవైపే చూస్తున్నాయి. సోమవారం ఉదయం 4 గంటల నుండీ 6 గంటలలోపు బందీల విడుదల, గాజా స్ట్రిప్‌లో మానవతా సహాయ పంపిణీ ప్రారంభమవుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో అందరూ అటే దృష్టిసారించారు. గాజా స్ట్రిప్‌లోకి ఆదివారం నుండీ ఇక ప్రతిరోజూ 600 ట్రక్కుల్లో ఆహారం, దుప్పట్లు, దుస్తులు, తాత్కాలిక డేరాలు, చమురు ఇతర మానవతా సహాయ వస్తువులు ప్రవేశించడం ప్రారంభమైంది. రఫా సరిహద్దులను కూడా రాకపోకలకు తెరిచారు. పాలస్తినా ప్రజలు గాజాలోకి తరలి రావడానికి వీలుగా తాత్కాలికంగా శిథిలాలను బుల్‌డోజర్లతో తొలగించారు. ఆదివారంనాడు గాజాకు 400 లారీల్లో మానవతా సహాయం, ఆహారం పంపినట్లు ఈజిప్టు ప్రభుత్వం ప్రకటించింది. వందల లారీలు ఈజిప్టు నుండి రఫా క్రాసింగ్‌లోకి రావడం వీడియోలలో కనిపించింది. గాజాలోకి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల మానవతా సహాయం లారీల్లో ప్రవేశించేందుకు ఐక్యరాజ్యసమితికి ఇజ్రాయెల్ ప్రభుత్వం ఇప్పటికే తన సమ్మతి తెలియజేసింది. మరోవైపు బందీల విడుదలకు ముందే ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌లో హోస్టేజెస్ స్క్వేర్ వద్ద భారీ ర్యాలీలో లక్షమంది ప్రజలు పాల్గొన్నారు. నోబెల్ ప్రెసిడెంట్ ట్రంప్'' అంటూ హోస్టేజ్ స్క్వేర్ వద్ద పెద్ద పెద్దబ్యానర్లు ప్రదర్శించారు.

బందీల బంధువులు, స్నేహితులు,మిత్రులు ఈ హోస్టేజెస్ స్క్వేర్ వద్దనే ఆదివారం రాత్రంతా ఎదురుచూస్తూ జాగారం చేస్తామని ప్రకటించారు. రాత్రంతా అసాధారణమైన రీతిలో ఉత్సవాలు చేసుకుంటామని బంధువులు, మిత్రులు ప్రకటించారు. షర్మ్–ఎల్–షేక్‌లో గడచినవారంలో జరిగిన చర్చల్లో అమెరికా తరపున కీలకపాత్ర వహించిన మధ్యప్రాచ్య ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు కుషెర్న్ ఇజ్రాయెల్‌కు చేరుకుని ఈ భారీ ర్యాలీలో పాల్గొన్నారు. శాంతి, ఐక్యతలను ఆకాంక్షిస్తూ, తమ ప్రియతమ బంధువులు ఇంటికి తిరిగి వస్తున్నారన్న సంతోషంతో తాము ఈ ర్యాలీలో పాల్గొంటున్నామని, తమ గుండె ఉత్కంఠతో కొట్టుకుంటోందని ర్యాలీలో ప్రసంగించిన స్టీవ్ విట్‌కాఫ్ చెప్పారు. ఈ ఒప్పందం చేయడంలో అమెరికా కీలకపాత్ర వహించిందన్న విషయాన్ని ఇజ్రాయెల్ ప్రజలకు హత్తుకునేలా చెప్పి ప్రచారం చేయడంకోసమే విట్‌కాఫ్, కుష్నెర్ వచ్చారన్నట్టుగా ప్రవర్తించారు. పదే పదే వారు ట్రంప్ పేరు ప్రస్తావించారు. చర్చలకు సహకరించిన అరబ్ దేశాల నాయకులకు, సంఘీభావం ప్రకటించిన దేశాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రంప్ పేరు చెప్పినప్పుడల్లా ర్యాలీలో ప్రజలు నినాదాలతో హోరెత్తించారు. ఈ రాత్రి ఈ పరిణామంకోసం నేను ఎంతోకాలంగా ఎదురుచూశా, ఇది ఎంతో శక్తిమంతమైన సమయం, ఈ ర్యాలీలో లక్షమంది పాల్గొన్నారు అంటూ విట్‌కాఫ్ పదే పదే ట్రంప్‌ను ప్రశంసించారు. యూదులు, క్రైస్తవులు, ముస్లింలు ఐక్యంగా ఈ రాత్రంతా ఇక్కడే శాంతికోసం జపిస్తూ ఉంటున్నామన్నారు. బందీలు సురక్షితంగా ఇళ్ళకు తిరిగి రావాలని, దేవుడు వారిని ఆశీర్వదించాలంటూ విట్‌కాఫ్ తన ప్రసంగం ముగించారు.

ఇదిలా ఉండగా గాజాలో చాలామంది బందీల మృతదేహాలు లభ్యంకాలేదు. వారి జాడ తెలుసుకోవడానికి నాలుగు దేశాలతో ఒక అంతర్జాతీయ టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసి గాలింపు చేస్తున్నారు. సోమవారం నుండీ 20 మంది సజీవులైన బందీలను, 28 మంది నిర్జీవులైన బందీలను అప్పగించే ప్రక్రియ హమాస్ ప్రారంభించాలి. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా జీవితఖైదీలుగా ఉన్న 250 మంది పాలస్తీనియన్లతోపాటు 2000 మంది ఖైదీలను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. వీరిలో అతితీవ్రమైన నేరాలకు పాల్పడిన ఖైదీలను విడుదల చేసేందుకు నెతన్యాహూ ఇష్టపడలేదు.రెండేళ్ళ యుద్ధంలో 90 శాతం గాజా ప్రజలు నిరాశ్రయులయ్యారు. మరో 67వేలమంది పాలస్తీనియన్లు మరణించారు.




## కామెరూన్ అధ్యక్ష ఎన్నికలు

**యావుండే:** సెంట్రల్ ఆఫ్రికాలో నైజీరియా పొరుగు దేశం కామెరూన్‌లో అధ్యక్ష ఎన్నికలకు ఆదివారం పోలింగ్ ప్రక్రియ మొదలైంది. ఆ దేశంలో మొత్తం 80 లక్షలమంది ఓటర్లు ఉన్నారు. ప్రజలకు సన్నిహితంగా ఉండే దేశ నాయకులు తమకు కావాలని, తమ సమస్యలు విని పరిష్కరించే నాయకులు కావాలని పోలింగ్ కేంద్రాలవద్ద ఓటర్లు అంతర్జాతీయ మీడియా ప్రతినిధులకు చెప్పారు. ఐతే దేశంలో ఇంగ్లీషు మాట్లాడే ప్రాంతాలలో వేర్పాటువాదులు ఎన్నికల్లో పాల్గొనకుండా లాక్‌డౌన్ ప్రకటించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 92 సంవత్సరాలు వయసుగల దేశాధ్యక్షుడు పాల్ బియా తిరిగి విజయం సాధించేందుకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు 15 రోజులు పట్టే అవకాశం ఉంది. అధ్యక్షుడు గెలిస్తే ఏడుసంవత్సరాలపాటు అధికారంలో కొనసాగుతారు. 92 ఏళ్ళ వృద్ధుడైన దేశాధ్యక్షుడు పాల్ బియా 1980వ దశకం నుండీ అధికారంలో కొనసాగుతున్నారు. మరోసారి గెలిచేందుకు తహతహలాడుతున్నారు.



## 50.70 లక్షలమంది కస్టమర్ల డేటా లీక్

### ఆస్ట్రేలియా ఎయిర్‌లైన్ ప్రకటన



**సిడ్నీ:** ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 50.70 లక్షలమంది కస్టమర్ల డేటాను అతిపెద్ద సైబర్‌దాడుల్లో చోరీ చేశారని, ఈ డేటాను ఆన్‌లైన్‌లో షేర్ చేశారని ఆస్ట్రేలియా ఎయిర్‌లైన్స్ 'క్వాంటాస్' ఆదివారం ప్రకటించింది. డజన్లకొద్దీ సంస్థలను ప్రభావితం చేయడం కోసమే ఈ డేటా చోరీ లీకేజీ జరిగిందని తెలిపింది. డిస్నీ, గూగుల్, ఐకియా, టయోటా, మెక్‌డోనాల్డ్స్‌తోపాటు తోటి విమానయాన సంస్థలు ఫ్రాన్స్ ఎయిర్‌వేస్‌లకు చెందిన డేటాను సాఫ్ట్‌వేర్ సంస్థ సేల్స్‌ఫోర్స్‌ను లక్ష్యంగా చేసుకుని చోరీ చేసినట్లు పేర్కొంది.తమ కస్టమర్ల డేటా కేంద్రాలపై సైబర్ నేరగాళ్ళు కన్నువేశారని గడచిన జులైనెలలోనే క్వాంటాస్ సంస్థ ధృవీకరించింది. కస్టమర్ల ఈమెయిల్స్, సెల్‌ఫోన్ నెంబర్లు, పుట్టినరోజు తేదీలు వంటి కీలక సమాచారాన్ని సైబర్ నేరగాళ్ళు చోరీ చేశారని పేర్కొంది.

# ఆపరేషన్ బ్లూస్టార్ పెద్ద తప్పిదం

### ఇందిరాగాంధీ తన జీవితాన్ని మూల్యంగా చెల్లించారు
### భింద్రన్‌వాలేను ఇందిర సృష్టించలేదు
### కాంగ్రెస్ నేత చిదంబరం వెల్లడి



**సిమ్లా:** స్వర్ణదేవాలయంలో దాక్కున్న ఉగ్రవాదులను పట్టుకునేందుకు అనుసరించిన 'ఆపరేషన్ బ్లూ స్టార్' సరైన విధానం కాదని, ఈ కారణంగా 1984లో ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తన జీవితాన్నే మూల్యంగా చెల్లించారని కాంగ్రెస్ నాయకుడు పి.చిదంబరం అన్నారు. ''స్వర్ణదేవాలయంలో దాక్కుని ఉన్న ఉగ్రవాదులందరినీ పట్టుకునేందుకు,దార్లోకి తీసుకువచ్చేందుకు మార్గం ఉంది, కానీ 'ఆపరేషన్ బ్లూ స్టార్' చేపట్టడం ఒక తప్పుడు మార్గం, నేను అంగీకరిస్తున్నా, ఆ తప్పు చేయడంవల్ల ఇందిరాగాంధీ తన జీవితాన్ని పణంగా పెట్టాల్సి వచ్చింది, ఈ విషయంలో ఒక్క ఇందిరాగాంధీని మాత్రమే మనం తప్పుపట్టలేం, సైన్యం, ఇంటిలిజన్స్, పోలీసులు, పౌర రక్షణ వర్గాలు... ఇలా అందరూ కలిసి తీసుకున్న సంచిన నిర్ణయ ప్రభావం ఈ తప్పుకు దారితీసింది, ఈ తప్పు చేయడంవల్ల ఇందిరాగాంధీ తన జీవితాన్ని మూల్యంగా చెల్లించారు'' అని కేంద్ర మాజీ హోంమంత్రి చిదంబరం అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలీలో శనివారం జరిగిన కుష్వంత్‌సింగ్ సాహిత్యోత్సవం సందర్భంగా పై విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రముఖ మహిళా జర్నలిస్టు, రామ్‌నాథ్ గోయంకా అవార్డు, ప్రభదత్ అవార్డు వంటి ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలు అందుకున్న హరిందర్ బవేజా రాసిన ''దె విల్ షూట్ యు మేడమ్ః మై లైఫ్ త్రూ కాన్‌ఫ్లిక్ట్' అనే పుస్తకం ఆవిష్కరణలో జరిగిన చర్చ సందర్భంగా చిదంబరం ఆపరేషన్ బ్లూస్టార్ గురించి ప్రస్తావించారు. ఆపరేషన్ బ్లూస్టార్ సైనిక చర్య 1984 జూన్ ఒకటో తేదీ నుండి పదో తేదీ మధ్యకాలంలో జరిగింది. దందమీ తక్సల్ నాయకుడు జర్నైల్‌సింగ్ భింద్రన్‌వాలే, అతడి సహచర ఉగ్రవాదులు అమృత్‌సర్‌లోని సిక్కుల పవిత్ర దేవాలయం స్వర్ణదేవాలయంలో దాక్కున్నారు. వారిని అంతం చేసేందుకు ఇందిరాగాంధీ ప్రభుత్వం ఆనాడు ఆపరేషన్ బ్లూస్టార్ సైనిక చర్య చేపట్టింది. అదే సంవత్సరం అక్టోబరు 31వ తేదీన ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు. ఏ సేవలపట్లగానీ, సైనిక అధికారులపట్లగానీ తనకు ఎలాంటి అగౌరవం లేదని, కానీ ఆపరేషన్ బ్లూస్టార్ సైనిక చర్య చేపట్టడం మాత్రం పెద్ద తప్పిదని, అది సరైన చర్య కాదని ఉగ్రవాదులను పట్టుకోవడానికి, వారిని దార్లోకి తీసుకురావడానికి మార్గం ఉందని అన్నారు. తర్వాత మూడు నాలుగేళ్ళకు సూర్జిత్‌సింగ్ బర్నాలా ముఖ్యమంత్రిగా ఉండగా ఆపరేషన్ బ్లాక్ థండర్ ద్వారా సైన్యాన్ని తాము సరైన మార్గంలో నడిపించామన్నారు. 1986లో ఒకసారి, 1988లో మరోసారి ఉగ్రవాదులను స్వర్ణదేవాలయం నుండి బయటకు తీసుకురావడానికి చేపట్టారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత్రి బవేజా మాట్లాడుతూ, ఆపరేషన్ బ్లూస్టార్ కారణంగా పంజాబ్‌లో తదుపరి హింసాత్మక అధ్యాయానికి దారితీసిందన్నారు. ఇందిరాగాంధీ రాజకీయాలను, మతాన్ని ఏకం చేశారని, అకాలీలను అదుపు చేసేందుకు భింద్రన్‌వాలే సహాయం తీసుకున్నారని అన్నారు. ఇది అత్యున్నతమైన తప్పుడు ఆలోచనగా అభివర్ణించారు. ఐతే భింద్రన్‌వాలే పాత్రను ఇందిరాగాంధీయే సృష్టించారన్న రచయిత్రి, జర్నలిస్టు హరిందర్‌బవేజా అభిప్రాయాలను పి.చిదంబరం తీవ్రంగా వ్యతిరేకించారు. అదేవిధంగా కశ్మీరు సమస్యపై కూడా ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ఒక జర్నలిస్టుగా హరిందర్ బవేజా పంజాబ్‌లో, జమ్మూకశ్మీరులో పని చేసి అనేక వివాదాలకు సంబంధించిన వార్తలను సేకరించిన అనుభవజ్ఞురాలు. ఆమె తన అనుభవాలను అనేక పుస్తకాలలో నిక్షిప్తం చేశారు. ''కశ్మీరీ ప్రజలను పాకిస్థాన్ తన ప్రయోజనాలకోసం ఉపయోగించుకుందని మనం తొందరగానే అర్థం చేసుకున్నాం, కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం కశ్మీరులోయ ప్రజలలో ఉన్న అవిశ్వాసాన్ని తగ్గించేందుకు ఉన్న అవకాశాన్ని ఏనాడూ అందిపుచ్చుకోలేదు'' అని హరిందర్ బవేజా విమర్శించారు. దేశ ప్రజలపై సంఘర్షణలు చేసిన గాయాల గురించి మనం మాట్లాడుతున్నామన్నారు. ప్రతి సాయంత్రం టెలివిజన్‌లో కశ్మీరీ వార్తలను చూస్తామని, కానీ అందుకు భిన్నమైన కథ కశ్మీరులో ఉందని చిదంబరం అన్నారు.

## బిసిలు అక్కరలేదా?

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్ల సమస్య ఉత్పన్నమయ్యేదే కాదు కదా? అని ప్రశ్నించారు. రిజర్వేషన్ల విషయంలో బిజెపి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఒక వైపు అసెంబ్లీలో బిసి రిజర్వేషన్ల బిల్లుకు బిజెపి మద్దతు పలుకుతూనే, ఆ బిల్లు ఎలా పెండింగ్‌లో ఉండాలని ఆలోచిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వమే దేశ వ్యాప్తంగా కులగనణ చేపట్టి, వాటి ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలి కదా?, మిగతా రాష్ట్రాలలో కూడా బిసిలు ఓట్లు వేస్తేనే బిజెపి అధికారంలోనికి వచ్చిందని అన్నారు. బిపి మండల కమిషన్‌కు వ్యతిరేకంగా అప్పటి బిజెపి సీనియర్ నాయకుడు అద్వాని కమండల్ యాత్రను నిర్వహించారని కూనంనేని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడా సాధ్యం కాదని అనేక మంది చెప్పారని, కానీ అందరూ కలిసి ఉద్యమించారని, తద్వారానే రాష్ట్ర ఏర్పాటు జరిగింది, రిజర్వేషన్లు కూడా అలాగే చేస్తే సాధ్యమవుతుందని వివిధ రాజకీయ పార్టీలకు కూనంనేని సూచించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఖమ్మంలో ఉద్యమం లేదని చెబుతున్న సమయంలోనే తాను ఎంఎల్‌ఎగా పాదయాత్ర చేపట్టానని గుర్తుచేశారు. ఏ నినాదం వెనకాల ఎవరి ప్రయోజనాలు ఉంటాయో అర్థం చేసుకోవాలని, ఏ రాజకీయ పార్టీ నిర్ణయం ఎలా ఉన్నదోకూడా లోతుగా పరిశీలించాలని ఆయన సూచించారు. బిసి రిజర్వేషన్ల విషయంలో బిజెపి, బిఆర్‌ఎస్ కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా చిత్తశుద్ధితో కలిసి ముందుకు రావాలని కూనంనేని సూచించారు. వర్గ ప్రయోజనాలను కాపాడుకుంటూనే, వెనుకబాటుతనంలో ఉన్న కులాలను బయటికి తీసుకురావాలని 'బిసి హక్కుల సాధన సమితి' నాయకులకు సూచించారు. రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమించాలన్నారు. బిసి రిజర్వేషన్లను సాధించే దిశగా ఉద్యమ కార్యా చరణను రూపొందించాలని పిలుపు నిచ్చారు.

## పోరాడేందుకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ ఉమ్మడి భద్రత సర్వసాధారణమైన, న్యాయబద్ధమైన సూత్రబద్ధ వైఖరి అని తేల్చి చెప్పారు. దేశీయ భద్రతపై దీర్ఘకాలంగా అమెరికా ఆధిపత్య భావజాలం ప్రదర్శిస్తోందని, ఎగుమతి నియంత్రణలను దుర్వినియోగం చేస్తోందని సెమీ కండక్టర్లు, చిప్‌లు సహా వివిధ రకాల ఉత్పత్తులపై చైనాకు వ్యతిరేకంగా ఏకపక్ష టారిఫ్‌లతో వివక్షపూరిత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. గడచిన సెప్టెంబరునెలలో మాడ్రిడ్‌లో చైనా–అమెరికా మధ్య వాణిజ్య,ఆర్థిక చర్చలు ముగిసిన 20 రోజుల తర్వాత నుండీ చైనాపై అనేక నియంత్రణలను ట్రంప్ అమలు చేయడం ప్రారంభించారు. ఈ తప్పుడు విధానాలను సరిదిద్దుకోవాలని చైనా అనేకసార్లు విజ్ఞప్తి చేసింది. కార్లు, సెల్‌ఫోన్‌ల తయారీలో ఉపయోగించే అరుదైన ఖనిజాలను ప్రపంచదేశాలకు సరఫరా చేయడంలో ఆధిపత్యస్థానంలో ఉన్న చైనా ఈ ఖనిజాల ఎగుమతులపై అక్టోబరు 9వ తేదీన తాజాగా విధించిన నియంత్రణలను సమర్థించుకుంది. అరుదైన ఖనిజాల ఎగుమతి చేయడంపై చైనా కొత్త నియంత్రణలు విధించడంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనాపై 100 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్లు అక్టోబరు 10న ప్రకటించారు. చైనా అధ్యక్షుడితో ఈనెలలో దక్షిణ కొరియాలో జరిగే శిఖరాగ్ర సమావేశం జరుగుతుందన్న హామీ లేదని కూడా ట్రంప్ ప్రకటించారు. కానీ అరుదైన మూలకాలపై నియంత్రణలను సమర్థించుకున్న చైనా, డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లపై ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తున్నారని విమర్శించింది. చైనాతో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేటప్పుడు ఉద్దేశపూర్వకంగా భారీస్థాయిలో సుంకాలను విధించడం సరైన చర్యలు కావని, వ్యాపారానికి ఇది సరైన మార్గం కాదని కూడా హితవు చెప్పింది. గడచిన ఏప్రిల్ తర్వాత ట్రంప్ సుంకాలపై పేచీ మొదలుపెట్టడంతో మరోసారి స్టాక్‌మార్కెట్లు పతనమయ్యాయి. అమెరికాకు దిగుమతయ్యే కీలకమైన చైనా సాఫ్ట్‌వేర్‌లపై నియంత్రణలు నవంబరు 1వ తేదీ నుండీ అమలులోకి వస్తాయన్నారు. ''చైనా శత్రుత్వం ప్రదర్శిస్తోంది, ప్రపంచాన్ని బందీగా ఉంచాలని ప్రయత్నం చేస్తోంది'' అని సోషల్ మీడియాలో ట్రంప్ విమర్శించగా, రక్షణవాదం, గుత్తాధిపత్యం పోవాలని, బహుళపక్ష వాణిజ్యం, స్వేచ్ఛా వాణిజ్యాన్ని అన్నిదేశాలూ ప్రోత్సహించాలని దక్షిణాఫ్రికాలో జరిగిన జి–20 వాణిజ్య పెట్టుబడి మంత్రుల సమావేశంలో చైనా ప్రతినిధి పిలుపు ఇచ్చారు. హరిత పారిశ్రామికీకరణ, స్థిరమైన అభివృద్ధిని సాధించాలంటే బహుళపక్ష వాణిజ్యవ్యవస్థ అమలులోకి రావాలన్నారు.

## జెఎసి ఆవిర్భావం

(మొదటి పేజీ తరువాయి)

బిసి సంఘాల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రిజర్వేషన్ల అమలు, ఉద్యమ ఉధృతం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపైచర్చించారు. అనంతరం బిసి రిజర్వేషన్ల సాధనకు ఐక్య ఉద్యమాల నిమ్మితం ఈ సమావేశంలో 'బిసి ఐక్య కార్యాచరణ కమిటీ'(బిసి జెఎసి) ఏర్ప టు చేశారు. జెఎసి ఛైర్మన్‌గా ఎంపి ఆర్.కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా విజిఆర్ నారగోని, వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్‌గౌడ్, కో చైర్మన్లుగా దాసు సురేశ్, రాజారామ్ యాదవ్, మీడియా కోఆర్డినేటర్‌గా గుజ్జ కృష్ణ ఎన్నికయ్యారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిసిల్లోని ప్రతి కుల సంఘం నుంచి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. బిసి ఉద్యమం ఇంతటితో ఆగదని, బిసిలను చట్టసభల్లో కూర్చోబెట్టేవరకు పోరాడుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర బంద్ విజయవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని తమ వాటా దక్కే వరకు పోరాడుతామని చెప్పారు.జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసిలకు రావాల్సిన నోటి కాడిముద్దను పిడికెడు శాతం లేని, రిజర్వేషన్ల వ్యతిరేకులు అడ్డుకున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ వ్యతిరేకులకు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సెగ పుట్టించేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బిసి నేతలు గుజ్జ సత్యం, నీలం వెంకటేశ్, అనంతయ్య, నందగోపాల్, కుందారం గణేశ్‌చారి, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అఫ్గాన్ ప్రతీకార దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి ముప్పూ లేదని పరిపాలనావిభాగం అధికార ప్రతినిధి జబిహుల్లా ముజహిద్ చెప్పారు. పాకిస్థాన్ ఒక ప్రకటన చేస్తూ తాలిబన్ దాడులకు ప్రతిగా దాడులు చేశామని, ఆ దేశ సరిహద్దుల్లో ఉన్న 19 సైనిక కేంద్రాలను స్వాధీనం చేసుకున్నామని ప్రకటించింది. ఎలాంటి కవ్వింపు చర్యలూ లేకుండా అఫ్గానిస్థాన్ సైనికులు కాల్పులకు తెగబడ్డారని, వారి దుస్సాహసాన్ని విఫలం చేశామని, ఆ దేశ సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని, పలు సైనిక పోస్టులను స్వాధీనం చేసుకున్నామని పాకిస్థాన్ హోంమంత్రి మొహిసిన్ నక్వి ప్రకటించారు. తాలిబన్ ప్రభుత్వ సైన్యం తమ పౌరులపై కాల్పులు జరిపారన్నారు. అఫ్గానిస్థాన్‌కు చెందిన 19 సరిహద్దు సైనిక పోస్టులను స్వాధీనం చేసుకున్నట్లు పాకిస్థాన్ పిటీవీ న్యూస్ ఆదివారం మధ్యాహ్నం ప్రకటించింది. పాకిస్థాన్ సైన్యం విడుదల చేసిన వీడియో ఫూటేజీలను చూస్తే సరిహద్దుల్లో తుపాకీ కాల్పులు, రాత్రివేళ ఆకాశంలో మంటలను ప్రతిబింబించాయి. తమదేశంలో దాడులు చేస్తున్న తాలిబన్‌కు చెందిన అఫ్గానిస్థాన్ అధ్యక్షుడు ఈ సరిహద్దు కేంద్రాలపై జరిగిన దాడుల్లో మరణించగా, మిగిలిన ఉగ్రవాదులు ప్రాణభయంతో పారిపోయారని పాకిస్థాన్ ప్రకటించింది. మనోజ్‌బా క్యాంప్ బెటాలియన్ కేంద్ర కార్యాలయాన్ని పూర్తిగా ధ్వంసం చేశామని, జాన్‌దుస్తర్ పోస్ట్‌ను, తుర్క్‌మెంజై క్యాంప్,ఖార్‌జై ఫోర్ట్‌ను ధ్వంసం చేసినట్లు పాకిస్థాన్ భద్రతా దళాలను ఉటంకిస్తూ రేడియో పాకిస్థాన్ ప్రకటించింది. ఈ రెండు దేశాలమధ్యా 2,600 కి.మీ '(1600 మైళ్ళు) నిడివిగల సరిహద్దు ప్రాంతం ఉంది. ఈ దాడుల ఘటనకు కారణం, సైనికుల మరణాలపై తాలిబన్ ప్రకటనను ఖండిస్తూ పాకిస్థాన్ రక్షణశాఖ ఎలాంటి ప్రకటన చేయలేదు. అఫ్గానిస్థాన్ గగనతలాన్ని ఉల్లంఘించిన విషయాన్ని కూడా పాకిస్థాన్ ధృవీకరించలేదు. ఐతే పాకిస్థాన్ మాత్రం భారతదేశం ప్రోత్సాహంతోనే ఇదంతా జరుగుతోందని, పాకిస్థానీ తాలిబన్లకు అఫ్గానిస్థాన్ తన భూభాగంలో స్థావరం ఇచ్చి మద్దతు ఇస్తోందని, ఈ తాలిబన్లు పాకిస్థాన్‌పై దాడులు చేస్తున్నారని, ఇందులో భారత్ ప్రోత్సాహం ఉందని పాకిస్థాన్ ప్రభుత్వం ఆరోపించింది. తాలిబన్ తాత్కాలిక ప్రభుత్వ హయాంలో ఆ దేశ భూభాగం నుండి భారతదేశ మద్దతుతో పనిచేస్తున్న ఖావరిజ్ ఉగ్రవాదులు తరచు తమ దేశంపై దాడులు చేస్తున్నారని ఆసిఫ్ అలీ జర్దారీ ఆరోపించారు. అఫ్గానిస్థాన్ భూభాగం నుండి ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయని ఐక్యరాజ్యసమితి నివేదిక కూడా రుజువుచేసిందని ఆయన ఆరోపించారు. ఈ ఉగ్రవాద ముప్పు భారతదేశం ప్రోత్సహించినదేనన్నారు. పాకిస్థాన్ వ్యతిరేక ఉగ్రవాదులను అరికట్టేందుకు తనిఖీ చర్యలు తీసుకోవాలని కూడా ఆయన తాలిబన్ ప్రభుత్వాన్ని కోరారు. ఐతే ఈ ఆరోపణలను భారత ప్రభుత్వం ఖండించింది. పాకిస్థాన్ దేశ సార్వభౌమాధికారంతో రాజీపడే ప్రశ్నేలేదని అఫ్గానిస్థాన్‌తో సరిహద్దులను మూసివేశామని, అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ వెల్లడించినట్లు ఆ దేశ పత్రికలు ప్రకటించాయి. తెహ్రీక్ ఎ తాలిబన్ ఉగ్రవాద సంస్థ నాయకుడు నూర్‌వాలీ మెహ్‌సూద్ స్థావరాన్ని ధ్వంసం చేసేలక్ష్యంతో పాకిస్థాన్ విమానాలు గగనతల ఉల్లంఘనకు పాల్పడిందన్నది పత్రికలు చెబుతున్న కథనం. సరిహద్దుల్లో కవ్వింపు చర్యలను షరీఫ్ ఖండించారనీ, ఫీల్డ్ మార్షల్ అసిఫ్ మునీర్ నాయకత్వంలో పాకిస్థాన్ సైన్యం అఫ్గానిస్థాన్‌కు బలమైన ప్రతిఘటన ఇవ్వడమే కాకుండా ఆ దేశానికి చెందిన అనేక సైనిక పోస్టులను కూడా ధ్వంసం చేసిందని షెహబాజ్ షరీఫ్ చెప్పారని పేర్కొన్నాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS

ఆఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం న్యూఢిల్లీలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## గురుకుల ఉద్యోగుల సేవల పునరుద్ధరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

ఉద్యోగుల కష్టాన్ని గుర్తించిన ప్రజా ప్రభుత్వం : మంత్రి అడ్లూరి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 4,092 మంది ఉద్యోగుల సేవల కొనసాగింపునకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ గురుకుల విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధి ప్రశంసనీయమైందన్నారు. ఉద్యోగుల సేవలను గుర్తించి, వారికీ న్యాయం చేయాలనే మానవతా దృక్పథం ఈ ప్రభుత్వానికి ఉందన్నారు. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జి.ఓ. నెం.1533 ప్రకారం, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్ట్యూషన్స్ సొసైటీ (టిజిఎస్‌డబ్ల్యూఆర్ఈఎస్) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పద్ధతిలో 2 మంది, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 1,545 మంది, పార్ట్‌టైమ్ విధానంలో 2,102 మంది, హానరేరియం పద్ధతిలో 443 మంది, మొత్తం 4,092 మంది ఉద్యోగుల సేవలు మరో ఏడాది పాటు కొనసాగనున్నాయన్నారు. ఈ నిర్ణయం 2025 ఏప్రిల్ 1 నుండి 2026 మార్చి 31 వరకు అమల్లో ఉండనుందని మంత్రి తెలిపారు. గత కొన్నినెలలుగా కంటిన్యూషన్ ఆర్డర్లు లేకపోవడంతో వేతనాల చెల్లింపులో ఆటంకాలు ఏర్పడి, అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల సేవాభావాన్ని గుర్తించి జి.ఓ. 1533 జారీ చేయడం ద్వారా మానవతా దృక్పథాన్ని ప్రదర్శించిందన్నారు. ఉద్యోగులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ సేవలను కొనసాగించాలన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సమాజ అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. వారి సేవలు విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్లేందుకు భరోసానిస్తాయని మంత్రి అన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థ అభివృద్ధి, గురుకుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతోందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, వారి భవిష్యత్తును వెలిగించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇది కేవలం పరిపాలనా నిర్ణయం కాదని, ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపే ప్రజా సంకల్పమని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి టిజిఎస్‌డబ్ల్యూఆర్ఈఎస్ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

## కార్మిక శ్రమ దోపిడీకి పాల్పడుతున్న కేంద్రం




శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలి
ఎఐటియుసి ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్మించాలి
సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలోని శ్రామిక వర్గాన్ని విస్మరించి, వారి శ్రమను దోచి బడా కుబేరులకు అప్పగించే విధానాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పల్లా వెంకట్ రెడ్డి సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎంపికైన సందర్భంగా ఎఐటియుసి కార్యవర్గం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్నప్పటికీ అధికారంలో ఉన్న పార్టీలు వారి విన్నపాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త కార్మిక చట్టాలు బడా కుబేరుల ప్రయోజనాలకే అనుకూలంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక పరిశ్రమలలో కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, ప్రైవేట్ కంపెనీలకు అప్పగించాలనే కుట్ర సాగుతోందని పల్లా వెంకట్ రెడ్డి విమర్శించారు. 'హైరెండ్ ఫైర్' విధానం ద్వారా కార్మిక హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. దీన్ని అడ్డుకోవాలంటే కార్మిక వర్గం చైతన్యంతో ఐక్యంగా పోరాడాలన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బిజెపి, శ్రమదోపిడికి గురవుతున్న కార్మికులలో ఎక్కువమంది హిందువులేనన్న వాస్తవాన్ని ఎందుకు వెలుగులోకి తీసుకురావడం లేదని పల్లా వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. పెట్టుబడిదారులు, అధికార పార్టీ కలిసి పేద కార్మిక వర్గాన్ని మతం పేరుతో మోసగిస్తున్నారని దుయ్యబట్టారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో జరగబోయే అన్ని పోరాటాలకు సిపిఐ పూర్తి సంఘీభావం ప్రకటిస్తుందని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్ రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఉపాధ్యక్షుడు కె.ఏసురత్నం, కార్యదర్శులు బి.వెంకటేశం, ఎస్.విలాస్ సింగ్, నరసింహ రావు, పల్లా దేవేందర్‌రెడ్డి, ఓరుగంటి యాదయ్య, వై. భూమయ్య, మేకల శ్రీనివాస్, ఎం.డి.ఇమాన్ పాల్గొన్నారు.

## నాలుగు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పలు జిల్లాల్లో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దక్షిణ కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించిందన్నారు. ఆదివారం జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్ వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.

## ఎన్నికల కమిషన్ రద్దుకు పోరాడాలి

ఆర్థికవేత్త డా.పరకాల ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రప్రభుత్వ చేతిలో కీలుబొమ్మగా మారిన ఎన్నికల కమిషన్ రద్దుకు పోరాడాలని ఆర్థికవేత్త, ప్రఖ్యాత రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఓటు చోరీ ఆరోపణలు జరుగుతున్న నేపథ్యంలో ఎంపిలంతా తమ పదవులుకు రాజీనామా చేసి, నిష్పక్షపాత ఓటరు జాబితాతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు కొత్తగా ఎన్నికల్లో నిలబడాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జాగో నవ తెలంగాణ ఆధ్వర్యంలో జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన 'స్వేచ్ఛాయుత ఎన్నికలు – ఎన్నికల కమిషన్ పాత్ర' అనే అంశంపై సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి, మాట్లాడారు. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించడం లేదని విమర్శించారు. గత ఎన్నికల్లో 5 కోట్ల ఓట్లు అదనంగా పడ్డాయని ఓ సర్వేలో తేలిందన్నారు. 234 స్థానాలు ఎన్‌డిఎకు, 313 స్థానాలు వ్యతిరేక శక్తులకు రావాల్సి ఉండగా, ఓట్ల తారుమారుతో అనుకోని ఫలితాలు వెల్లడయ్యాయన్నారు. మొత్తం మీద 15 రాష్ట్రాల్లో 79స్థానాల్లో అక్రమ ఓటింగ్ జరిగిందని ఆరోపించారు. పక్షపాతి ఓటరు జాబితాలో ఒకే ఇంట్లో 60 ఓట్లు, 103 ఏళ్ల వృద్ధులు, భర్తల పేర్ల స్థానంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అంటూ నమోదు బహిర్గతం కావడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. 2019 ఓట్ల పోలింగ్‌లో అత్యల్ప వ్యత్యాసం ఉన్న ప్రాంతాల్లో బిజెపి ఎన్‌డిఎకు అత్యధిక సీట్లు వచ్చాయన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితేనే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ బిజెపి మత విద్వేషాలు రెచ్చగొడుతుందన్నారు. దేశవ్యాప్తంగా 6లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకొంటే కేంద్రప్రభుత్వానికి స్పందించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో సిపిఐ సీనియర్ నేత కందిమల్ల ప్రతాపరెడ్డి, ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్, వివిధ సంఘాల నేతలు అఫ్జల్ అజీజ్, ప్రొఫెసర్ వెంకటదాసు, ఏలేశ్వరం తదితరులు పాల్గొన్నారు.




## పెరిగిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు

మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత నెల సెప్టెంబర్‌లో తెలంగాణ రాష్ట్రంలో ఇళ్ల రిజిస్ట్రేషన్‌లో 35 శాతం పెరుగుదల ఉందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నారెడ్కో) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో నిర్వహిస్తున్న '15వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో'లో ఆయన ఆదివారం పాల్గొని మాట్లాడుతూ.. '2024–25లో రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవల రంగం 15.4 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 11.97 శాతం వృద్ధి రేటుతో నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80వేల కోట్లకు పైగా సమకూర్చింది. స్టేట్ సర్వీసెస్ జీఎస్ డీపీలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంది' అని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 'హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2024 సెప్టెంబర్‌లో రూ.2820 కోట్ల విలువైన 4903 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రూ.4804 కోట్ల విలువైన 6612 ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇది 35 శాతం అధికం. విలువలో వార్షిక వృద్ధి 70 శాతంగా నమోదయ్యింది. ఇవి కేవలం గణాంకాలు కాదు... రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలయ్యిందంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్న వారికి ధీటైన సమాధానాలు' అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 'ఈ సెప్టెంబర్‌లో రూ.కోటిపైన విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో 151 శాతం పెరుగుదల ఉంది. మొత్తం విక్రయాల్లో విలువ పరంగా వీటి వాటానే 53 శాతం' అని చెప్పారు. 'భారత్‌లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. అయితే... అభివృద్ధి చెందిన దేశాల జీడీపీలో స్థిరాస్తి రంగ వాటా సగటున 10 శాతం 15 శాతం కాగా... చైనాలో అత్యధికంగా 23 శాతం నుంచి 25 శాతం వరకుంది. మన దేశంలో ఇది 6 శాతం నుంచి 8 శాతమే. ఇది మరింత పెరగాల్సిన అవసరముంది' అని అభిప్రాయపడ్డారు. 'ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో ఫేజ్ – 2, భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్డు తదితర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు మారిపోనున్నాయి. డిసెంబర్ నాటికి 'ఫ్యూచర్ సిటీ'లో జోనలైజేషన్ ప్రక్రియను పట్టలెక్కించాలనే పట్టుదలతో ఉన్నాం. అక్కడే 200 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న ఏఐ సిటీకి రెండు, మూడు నెలల్లోనే భూమి పూజ చేయబోతున్నాం' అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నారెడ్కో తెలంగాణ ప్రతినిధులు విజయసాయి మేక, కాళీ ప్రసాద్ దామెర, డా.లయన్ కిరణ్, కె.శ్రీధర్ రెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## క్వారీ దక్కితే కోట్లే



కాసులు కురిపిస్తున్న ఇసుక
దందాల గుప్పెట్లో అధికారులు
వ్యాపారులంతా బడాబాబులే
పేరుకే గిరిజన సొసైటీలు
దళారులదే రాజ్యం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇసుక వ్యాపారం ఇప్పుడు కోట్లను తెచ్చిపెడుతుంది. ఒకప్పుడు ఇసుక గురించి పట్టించుకున్న వారు లేరు. రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలోనే అతి పెద్ద వ్యాపారంగా ఇసుక మారిపోయింది. గోదావరి పరివాహక ప్రాంతంతో పాటు అనేక నదులు, ఏరుల వద్ద ఇసుక లభ్యతను బట్టి క్వారీలను ఏర్పాటు చేశారు. ఏజెన్సీలోనైతే ఇసుక క్వారీలను గిరిజన సొసైటీలకు అప్పగించారు. మైదాన ప్రాంతంలో దండుకున్న వాడికి దండుకున్నంతా ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుండడంతో రాజకీయ నాయకులు మొదలు హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి ఇసుక వ్యాపారంపై కన్నేశారు. తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ రాష్ట్రంలోని వివిధ నదుల్లో ఇసుక లభ్యతను గుర్తించి అక్కడ ఇసుక తరలింపుకు అనుమతినిస్తుంది. ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుక లభ్యత ఉంది. ఒక్కో క్యూబిక్ మీటర్ ఖరీదు ఎంత అనే విషయాన్ని కూడా ఖనిజాభివృద్ధి సంస్థ నిర్ణయిస్తుంది. ఇసుక అవసరమైనటువంటి వారు ఖనిజాభివృద్ధి సంస్థ నుంచి ఆన్‌లైన్ ద్వారా తమకు కావాల్సిన ఇసుకకు సంబంధించి నగదు చెల్లించి రశీదు పొందవచ్చు. ఏ క్వారీ నుంచి ఇసుక కోరుకుంటున్నారో ఆ క్వారీ ద్వారా ఇసుక తరలించుకోవచ్చు. ఇక్కడే ఒక పెద్ద అక్రమం చోటు చేసుకుంటుంది. ట్రాక్టర్‌కు ఇన్ని క్యూబిక్ మీటర్లు, లారీ స్థాయిని బట్టి ఎన్ని క్యూబిక్ మీటర్లు తరలించవచ్చో అంతకు అనుమతి ఇవ్వాల్సి ఉంది. కానీ అనుమతి తీసుకున్న దాని కంటే ఎక్కువ ఇసుకను తరలించుకుపోతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి భారీ నష్టం వస్తుండగా క్వారీ నిర్వాహకులకు మాత్రం భారీ లాభాలను తెచ్చిపెడుతుంది. ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులు ఈ భారీ అక్రమం గురించి తెలిసినా ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. కొన్ని చోట్ల నకిలీ డిడిలతో ఇసుకను తరలించుకుపోతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అధికార యంత్రాంగానికి యధాశక్తి ముట్టజెప్పుతుండడంతో యధాశక్తి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పేరుకే గిరిజన సొసైటీలు :**
ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక రీచ్‌లను గిరిజన సొసైటీలకు అప్పగిస్తున్నారు. కానీ ఇది కేవలం పేపర్ మీద జరిగే చర్య మాత్రమే. వ్యాపారం చేసేదంతా గిరిజనేతరులు, గిరిజనులలో కోట్లకు పడగలెత్తిన వారే. గడిచిన ఐదారెండ్లలో ఇసుక రీచ్‌ల ద్వారా కోట్లకు పడగలెత్తారంటే ఇసుక వ్యాపారం ఏ స్థాయిలో లాభాలు కురిపిస్తుందో అవగతమవుతుంది. కొంతమంది ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తుంటే మరికొంతమంది ఏజెన్సీ చట్టాల మాటున దోచుకుంటున్నారు. గిరిజన సొసైటీలకు, గిరిజన ప్రజలకు ఒరిగింది ఏమి లేదు.

**రాజకీయ నాయకుల కన్ను :**
ఇప్పుడు ఇసుక వ్యాపారంపై రాజకీయ నాయకులు, బడా వ్యాపారుల కన్నుపడింది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఉంటున్నారు. వారి అనుచరులకు ఇసుక క్వారీలను అప్పగించడమో లేదా క్వారీలపై తమ అనుచరుల పెత్తనానికో పట్టుబడుతున్నారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే ఇసుక క్వారీలలో అక్రమాలు జరుగుతున్నాయని తద్వారా ప్రభుత్వ ఆదాయానికి తూట్లు పడుతున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. రక్తం మరిగిన పులిలా కొందరు ఇసుక లాభాలకు అలవాటు పడి దందాలు చేయడం, బెదిరింపులకు పాల్పడటం అవసరమైతే ఏ స్థాయికి వెళ్లేందుకైనా వెనుకాడడం లేదన్న ప్రచారం జరుగుతుంది. ప్రభుత్వమే ఇసుక వ్యాపారాన్ని నిర్వహిస్తున్నా అక్రమార్కులకు కోట్ల రూపాయలు పోగుపడుతున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించుకోవచ్చు. అటు గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల సొసైటీలకు దక్కుతున్నది ఏమి లేదు. ఇక్కడ, అక్కడ ఎక్కడైనా అంతా దళారులదే. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమ వ్యాపారులపైన దృష్టి సారించాల్సి ఉంది. మొత్తం ఇసుక వ్యాపారానికి సంబంధించి ప్రత్యామ్నాయ పద్ధతిని ఆలోచించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

## రిమాండ్ ఖైదీ మృతి.. బంధువుల ఆందోళన



**ప్రజాపక్షం/జనగామ :** జనగామ జిల్లా కేంద్రంలోని జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మల్లేష్ అనే వ్యక్తి మృతి చెందడంతో బంధువులు డిసిపి, కోర్టు ముందు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి వివరాలు పరిశీలిస్తే జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని సింగరాజుపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తి జనగామ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కాగా ఈ నెల 8న బ్లీచింగ్ పౌడర్ సేవించి ఆత్మహత్యాయత్నించగా వరంగల్‌లోని ఎంజిఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. బ్లీచింగ్ పౌడర్ సేవించి ఆత్మహత్యాయత్నానికి పలు కారణాలు ఉన్నట్లు బంధువులు ఆరోపించారు. సబ్ జైల్‌లో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో మల్లేష్ బ్లీచింగ్ పౌడర్ సేవించినట్లు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సరియైన వైద్యం అందించకపోవడం, ఖైదీల గొడవ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వలనే ఇది జరిగిందని ఆరోపించారు. అయితే ఈ విషయంలో డిసిపికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కుటుంబీకులు ఆరోపించారు. ముందుగా డిసిపి కార్యాలయం ముందు ఆందోళన చేసి అనంతరం సబ్ జైల్ ముందు ఆందోళన చేశారు. విచారణ జరిపిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో విరమించారు. కాగా ఈ సంఘటన గుట్టు చప్పుడు కాకుండా ముగుస్తుందని జైల్ అధికారులు ఆలోచించగా కుటుంబీకులు బయటకు వచ్చి ఆందోళన చేయడంతో జైల్ అధికారులు నిర్లక్ష్యం వలనే మల్లేష్ చనిపోయినట్లుగా తెలుస్తుంది. జైలులో భద్రంగా ఉంచాల్సిన బ్లీచింగ్ పౌడర్‌ను ఎందుకు బయట పెట్టారన్నది తెలియాల్సి ఉంది.

## మద్యం షాపులకు 5,663 దరఖాస్తులు

మిగిలింది వారం రోజులే..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో కొత్త మద్యం దుకాణ కోసం 5663 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ వెల్లడించారు. ఇంకా వారం రోజులు గడువు ఉందని చివరి రోజుల్లో భారీగా దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణలోని 2620 మద్యం షాపులకు దరఖాస్తుల జోష్ కొనసాగుతుందన్నారు. శనివారం నాటికి తెలంగాణలో 5663 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈనెల 18తో దరఖాస్తుల స్వీకరణ అంకం పూర్తి కానుంది. చివరి మూడు రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అంచనాలు ఉన్నాయని తెలిపారు. మద్యం షాపులకు రెండేళ్లకోసారి దరఖాస్తుల ఆహ్వానం ఎక్సైజ్ శాఖ ఆహ్వానిస్తుందని తెలిపారు. గత రెండేళ్ల క్రితం కూడా చివరి రెండు రోజుల్లో 45 వేల నుంచి 50వేల దరఖాస్తులు వచ్చాయని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా చివరి మూడు రోజుల్లో దరఖాస్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటాయని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 13నుంచి 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ వారం రోజుల్లో 13న సోమవారం సప్తమి మంచి రోజు, 15 న నవమి 16న దశమి 17న ఏకాదశి 18న ద్వాదశి ఈ ఐదు రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. 14వ తేదీ అష్టమి కావడంతో కొంత దరఖాస్తులు తగ్గే అవకాశాలు ఉంటాయని ఎక్సైజ్ అధికారులు అంచనాలు వేస్తున్నారు.

చివరి రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అంచనాలు ఉండడంతో ఎక్సైజ్ డివిజన్ల వారిగా, రంగారెడ్డి, హైదరాబాద్ డివిజన్లలోను, ఉమ్మడి జిల్లాల వారీగా అదనపు కౌంటర్లు ఏర్పాటుతో పాటు దరఖాస్తుదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నారు. గత రెండేళ్ల క్రితం మద్యం షాపులకు 1.32 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

ఈసారి దరఖాస్తులు గతంలో కంటే మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని ఎక్సైజ్ శాఖ అంచనాలు వేస్తున్నారు.



గతంలో లాగా ఈసారి కూడా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల నుంచి దరఖాస్తులు వేయడానికి మద్యం వ్యాపారులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తుంది.

ఇప్పటికే పలు రాష్ట్రాల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు గుర్తించారు.

మరోపక్క మద్యం షాపులకు కేటాయించిన రిజర్వేషన్లు గౌడ్, ఎస్సీ, ఎస్టీ మద్యం షాపులకు కూడా దరఖాస్తులు పోటాపోటీగా పడుతున్నాయి.

గౌడ షాపులకు 671 దరఖాస్తులు, ఎస్సి రిజర్వేషన్లు 202, ఎస్టి రిజర్వేషన్లు 84, జనరల్‌లో 4686 దరఖాస్తులు వచ్చాయి.

ఇదే రీతిలో ఉమ్మడి జిల్లాలోని అదిలాబాద్‌లో 142, హైదరాబాదులో 746, కరీంనగర్లో 392, ఖమ్మంలో 260, మహబూబ్ నగర్‌లో 278, నల్లగొండలో 568, మెదక్‌లో 411, నిజామాబాదులో 255, రంగారెడ్డిలో 2353, వరంగల్లో 258 దరఖాస్తులు వచ్చాయి.

## ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ఏర్పాటుకు కేంద్రం సానుకూలం

దామోదర రాజనర్సింహకు రాసిన లేఖను విడుదల చేసిన కేంద్ర మంత్రి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఆయుర్వేదం ఏర్పాటులో కేంద్రం వెనుకంజ వేస్తోందని, దక్షిణాది రాష్ట్రాలను నిర్లక్ష్యం చేస్తోందంటూ మీడియా వస్తున్న కథనాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఖండించారు. ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా ఇలాంటి సమాచారం లీకులిస్తూ కేంద్రంపై బురద చల్లేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాలూ, ప్రాంతాలు సమానమేనని స్పష్టం చేశారు. ఎయిమ్స్ తరహాలో తెలంగాణలోనూ ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదను స్థాపించాలని కోరుతూ ఇప్పటికే తాను కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సైతం సానుకూలంగా ఉందని, త్వరలోనే మంజూరయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదివారం మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సైతం సమాచారమిచ్చినట్లు పేర్కొన్నారు. ఆయుర్వేద ఇన్స్టిట్యూట్ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్ రాజ్ జాదవ్‌కు రాసిన లేఖను ఈ సంధర్బంగా మీడియాకు విడుదల చేశారు. అదే విధంగా కరీంనగర్‌లో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ దామోదర రాజనర్సింహకు తాను 4 నెలల క్రితమే లేఖ రాశానని, కానీ ఇప్పటి వరకు దీనిపై నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని తెలిపారు. ఇప్పటికీ రాష్ట్ర మంత్రి పేషీలోనే పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో సాంప్రదాయ ఆయుష్ వైద్యసేవలు, విద్యా అవకాశాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని, ఈ తరుణంలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ గందరగోళం సృష్టించవద్దని కోరారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రభుత్వ పాఠశాలల తనిఖీలకు ప్రత్యేక ప్యానల్ టీమ్ ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ, స్థానిక సంస్థలకు చెందిన పాఠశాలలో తనిఖీలు నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. దీనికి సంబంధించిన జిల్లాల వారిగా ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీములను ఏర్పాటు చేసింది. ప్రతి మూడు నెలలకు జిల్లాల్లోని వంద ప్రాథమిక, మరో 50 ఉన్నత పాఠశాలలను తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ప్రాథమిక పాఠశాల తనిఖీలకు ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ నోడల్ అధికారిగా వ్యవహారిస్తారు. మరో ఇద్దరు సెకండరీ గ్రేడ్ టీచర్లుగా ఉంటారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలోకు స్కూల్ అసిస్టెంట్ నోడల్ అధికారిగా, ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ , సెకండరీ గ్రేడ్ టీచర్ సభ్యులుగా ఉంటారు. ఉన్నత పాఠశాలల తనిఖీలకు గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్ 2 నోడల్ అధికారిగా వ్యవహారించగా, ఆయనతో పాటు ఏడవ తరగతి టీచర్, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) సభ్యులుగా ఉంటారు.

## మొక్కజొన్న, జొన్నలను కూడా పిఎస్‌ఎస్‌లో చేర్చాలి

### రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుతం పిఎస్‌ఎస్ కింద నువ్వులు,శనగలు, వేరుశనగ,సోయాబీన్, పెసల వంటి పంటల కొనుగోలుకు కేంద్రం విధించిన 25 శాతం సీలింగ్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. ఈ పరిమితిని తొలగించాలని, లేదా సడలించేందుకైనా కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. మొక్కజొన్న, జొన్నలను కూడా పిఎస్‌ఎస్‌లో చేర్చాలన్నారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌కు రాష్ట్ర మంత్రి తుమ్మల ఆదివారం లేఖ రాశారు. ఆ లేఖలో తెలంగాణ రాష్ట్ర రైతుల సమస్యలను వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో వర్షాధార పంటలైన మొక్కజొన్న, జొన్న పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ప్రకటించినప్పటికీ కేంద్రం కొనుగోలు చేయకపోవడంతో రాష్ట్రం తన నిధులతోనే రైతులను ఆదుకోవాల్సి వస్తోందని తుమ్మల వివరించారు. రైతులకు గిట్టుబాటు ధర భరోసా కల్పించాలంటే ఈ పంటలను కూడా పిఎస్‌ఎస్ పరిధిలోకి తక్షణం చేర్చాలని కోరారు. రై తు సంక్షోభ సమయాల్లో కేంద్రం ప్రకటించిన మద్దతు ధరను అమలు చేయడం రాష్ట్రాలకు కష్టమవుతోందని, అందుకే ఎంఎస్‌పి అమలు, మార్కెట్ జోక్యాల్లో కేంద్ర,రాష్ట్రాల మధ్య వ్యయభారం పంచుకునే విధానం తీసుకురావాలని ఆ లేఖలో కేంద్ర ప్రభుత్వానికి తుమ్మల సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ పామ్ పథకం విజయవంతంగా సాగుతోందని,1.08 లక్ష హెక్టార్లలో 73,744 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తుండగా, 202526 నాటికి మరో 50,000 హెక్టార్లలో విస్తరించే లక్ష్యం ఉందని వివరించారు. కేంద్ర కృడ్ పామ్ ఆయిల్‌పైన కస్టమ్స్ సుంకం 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించడంతో, దేశీయ ధరలు పడిపోయి రైతులు టన్నుకి రూ20వేల కంటే తక్కువ ధరకు ఎఫ్‌ఎఫ్‌బికి అమ్ముకోవాల్సి వస్తోందని వివరించారు. పత్తి విషయంలో సిసిఐ కొనుగోళ్లు 50–60 శాతం వరకు మాత్రమే పరిమితమవ్వడంతో కొనుగోలు ఆలస్యమై రైతులకు ఎంఎస్‌పి అందడం లేదని పేర్కొన్నారు.

## ఆరోగ్య తెలంగాణే లక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :**'ఆరోగ్య తెలంగాణ' ను నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో 'రన్ ఫర్ గ్రేస్, స్క్రీన్ ఫర్ లైఫ్' అనే థీమ్‌తో నిర్వహించిన 'గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ ఎనిమిదో ఎడిషన్' నుప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... లక్షలాది మందిని కబళిస్తున్న కాన్సర్ మహమ్మారిపై అవగాహన కల్పించాల్సిన సామాజిక బాధ్యత మనందరి పై ఉందన్నారు. ఆరోగ్యాన్ని మించిన సంపద ఏదీ లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. సమాజంలో క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు 'గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్' చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమాలు నిర్వహించేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఛైర్మన్ శివసేనారెడ్డి, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. చినబాబు సుంకవల్లి పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు అమృత చుక్కలతో కలకాలం రక్ష





### కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పల్స్ పోలియో కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, వెస్ట్ మారేడుపల్లిలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆరు జిల్లాలలో పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 05 సంవత్సరాల లోపు ఉన్న 17,32,171 మంది చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయడానికి 6,897 బూతులు ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ సంగీత సత్యనారాయణ మాట్లాడుతూ పోలియో బూతులలో మందు వేయడం జరుగుతుందని, ఇంకా 13, 14 తేదీలలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మందు వేయనున్నారని చెప్పారు. అలాగే హైదరాబాద్ జిల్లాలో 15వ తేదీన గృహ సందర్శనలు నిర్వహించి అన్ని పిల్లలకు పోలియో చుక్కల మందు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం 259 మొబైల్ టీములు, 138 ట్రాన్సిట్ పాయింట్లు, 576 రూట్ సూపర్వైజర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో 9,110 మహిళా ఆరోగ్య కార్యకర్తలు (ఎంపిహెచ్‌ఎఫ్), 6,705 ఆశా కార్యకర్తలు, 6,574 అంగన్వాడి కార్యకర్తలు పాల్గొంటున్నారని చెప్పారు. రాష్ట్రంలోని జిల్లాలకు 19,10,400 డోసుల పోలియో వ్యాక్సిన్ పంపిణీ చేశామని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బ్యానర్లు, ఆడియో మరియు వీడియో క్లిప్స్ పంపిణీ చేశామని తెలిపారు. వెస్ట్ మారేడుపల్లి ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో సుమారు 60 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలు పాల్గొన్నారు. కమిషనర్ స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కల మందు వేసి, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటి, సిహెచ్‌ఐ జాయింట్ డైరక్టర్ డాక్టర్ సుధీర్, డాక్టర్ సాయిబాబా, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ జయశ్రీ, డిఐహెచ్‌ఎ ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీకాళ, పిఓఎన్‌సిడి డాక్టర్ ఆశ్రిత రెడ్డి, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, డాక్టర్ విశాల్, గణాంక అధికారి పిటర్సన్, అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### నిండు జీవితానికి రెండు చుక్కలు రక్ష
### జిహెచ్‌ఎంసి వైద్యాధికారి డాక్టర్ పద్మజ

నిండు జీవితానికి రెండు చుక్కలు రక్ష అని జిహెచ్‌ఎంసి ముఖ్య వైద్యాధికారి డాక్టర్ పద్మజ అన్నారు. మేడ్చల్ జిల్లాలో ఆమే ఆదివారం ఆమే పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజ మాట్లాడుతూ రెండు చుక్కలు చిన్నారులకు ఇప్పించడం ద్వారా పోలియో మహమ్మరిని ప్రారదొల్చాన్నారు. తల్లితండ్రులందరూ తప్పనిసరిగా తమ చిన్నారులకు పోలియో చుక్కలు ఇప్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కారు కావాలో.. బుల్డోజర్ కావాలో తేల్చుకోండి : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలా, బుల్డోజర్ కావాలా నిర్ణయించుకోవాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. షేక్‌పేట డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు చెరుకు మహేశ్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కెటిఆర్ ఆయనకు గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. అన్ని అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని విమర్శించారు. ఈ రెండేళ్లుగా ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయిందని మండిపడ్డారు. ఒక్క ఇల్లు కట్టలేదని, ఒక్క ఇటుక పెట్టలేదని, కానీ 2.30లక్షల అప్పు మాత్రం చేసిందన్నారు. గరీబోళ్ల ఇండ్లు ఎక్కడుంటే అక్కడికి బుల్డోజర్లు పంపించి, హైదరాబాద్‌లో ఇళ్లు కూలగొట్టిస్తున్నాడన్నారు. బిసిల రిజర్వేషన్ల అంశంలో రేవంత్ రెడ్డి మోసం చేశాడని ఆరోపించారు. పార్లమెంట్‌లో చేయాల్సిన చట్టం అసెంబ్లీలో చేస్తే చెల్లదని తెలుసన్నారు. ఇచ్చిన జి.ఓను కోర్టు కొట్టేస్తుందని కూడా తెలిసి మరీ బిసి రిజర్వేషన్ల పేరుతో నాటకాలు ఆడి మోసం చేశాడన్నారు. అజారుద్దీన్‌కు ఇస్తామని చెప్పిన ఎమ్మెల్సీ కూడా ఆయనకు రాదని తెలుసు, కానీ ఆయనను కూడా రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు.

## ముంపు బాధితులందరికీ నష్టపరిహారం అందజేస్తాం

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్





**ప్రజాపక్షం /చెన్నూరు :**కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన అర్హులైన ముంపు బాధితులు అందరికీ పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. చట్టం ప్రకారం అర్హులైన బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. చెన్నూరు పట్టణంలోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో కోటపల్లి మండలం బబ్బెర చెలక, దేవులవాడ గ్రామాల రైతులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కంటే ముందు 36 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఈ ప్రాంతంలో 55 వేల ఎకరాల ఆయకట్టు భూమిలో రైతులు పంట సాగు చేసే అవకాశం కోల్పోయారని, భూములు కోల్పోయే పరిస్థితి ఉండేది కాదని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కారణంగా బ్యాక్ వాటర్‌తో పంట పొలాలు, నివాస ప్రాంతాలు ముంపుకు గురై ప్రజలు నష్టపోయారని, వారికి పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదని విమర్శించారు. ముంపు బాధితుల సంక్షేమంలో భాగంగా ఇప్పటి వరకు 10 కోట్ల రూపాయలు కేటాయించి అర్హులైన వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందుగా అసలైన పట్టేదారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అర్హులైన మిగతా వారికి సైతం పరిహారం అందిస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, రైతు బీమా వంటి అనేక ప్రజా ప్రయోజనకర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అర్హులైన ముంపు బాధితులందరికీ పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎలాంటి వివాదాలు లేని భూములకు అవార్డు జారీ చేయడం జరుగుతుందని, డిసెంబర్ 18, 19 తేదీలలో అర్హులైన వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. వివాదాలలో రాజీ అయిన వారికి నిబంధనల ప్రకారం చెల్లింపులు జరుగుతాయని, లేని పక్షంలో అవార్డు మొత్తమును సంబంధిత కోర్టులో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. 33 కోట్ల రూపాయలలో 5 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, మరో 5 కోట్ల రూపాయలు పిడి ఖాతాలో ఉన్నాయని తెలిపారు. బాధితులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అ న్నారు. మంచిర్యాల రాజస్వ మం డ ల అధికారి శ్రీనివాస్ రావు, కోటపల్లి మండల తహసిల్దా ర్ రాఘవేంద్ర తదితరులు హాజరయ్యారు.

### శబరిమల గోల్డ్ ప్లేటింగ్ స్పాన్సర్...
## ఉన్నికృష్ణన్‌కు శాశ్వత ఆదాయ వనరులు లేవు

### ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డ్ విచారణ నిర్ధారణ

**కొచ్చి :** శబరిమల శ్రీ కోవిల్ (గర్భగుడి) నుండి బంగారం పోయినదానిపై ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డ్ (టిడిబి) విజిలెన్స్ తన తుది నివేదికలో..ఆలయంలో అనేక బంగారం పూత పనులకు స్పాన్సర్ చేసిన బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త ఉన్నికృష్ణన్ పొట్టీ ఎలాంటి శాశ్వత ఆదాయ వనరులు కలిగి లేరని స్పష్టం చేసింది. ప్రాథమిక విచారణలో భాగంగా ఉన్నికృష్ణన్ పొట్టీ తన చార్టర్డ్ అకౌంటెంట్ ద్వారా సమర్పించిన 2017–2025కు సంబంధించిన ఆదాయ పన్ను రిటర్న్‌లను పరిశీలించింది. కేరళ హైకోర్టులో నివేదికను దాఖలు చేయడంతో ముందస్తు విచారణకు ఆదేశించింది. ఆ తర్వాత నివేదికను ఆధారంగా చేసుకుని కేరళ హైకోర్టు ఆదేశాల మేరకు ఒక స్పెషల్ ఇన్‌వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేసింది. అది విచారణను నిర్వహించింది. శాశ్వత ఆదాయం ఏదీ బహిర్గతం కాలేదు. 2025–2026ఆట రూ.10.85లక్షల 'అదర్ సోషల్ లేదా కమ్యూనిటీ సర్వీస్' కేటగిరీ కింద కామాక్షి ఎంటర్ ప్రైజెస్ నుండి అతడి బ్యాంక్ ఖాతాకు జమ చేయబడింది అని ఆ నివేదిక తెలిపింది. శబరిమలలో ఉన్నికృష్ణన్ పొట్టీ చేపట్టిన పనులపై సమగ్రవిచారణను కోరింది. శ్రీ కోవిల్ తలుపు మరమ్మతు, బంగారు పూత, ఉన్నికృష్ణన్ పొట్టీ ద్వారా స్పాన్సర్ చేయబడిందని వాస్తవానికి బళ్లారికి చెందిన గోవర్ధనన్ అనే వ్యాపారవేత్త దీని కోసం నిధులు సమర్పించాడని విజిలెన్స్ విచారణ కనుగొన్నది. అదే విధంగా శ్రీ కోవిల్ డోర్ ఫ్రేమ్ యొక్క బంగారుపూతను ఉన్నికృష్ణన్ పొట్టీకి ఆపాదించబడింది. అయితే బెంగళూరుకు చెందిన మరో వ్యాపారవేత్త అజికుమార్ స్పాన్సర్ చేసినట్లు నివేదిక పేర్కొంది. ఆలయానికి ఉన్నికృష్ణన్ పొట్టీ అనేక విరాళాలను సమకూర్చాడు. 2025 జనవరిలో అతను ఆలయంలో 18వ పవిత్ర మెట్ల వైపు వివిధ పూజలు, అలంకరణ పనులను స్పాన్సర్ చేశారు. అన్నదాన మండపం వద్ద లిఫ్ట్ కోసం రూ.10లక్షలు సహాయం చేశారు. అంతేకాకుండా అన్నదానం కోసం రూ.6లక్షలు (ఉచిత భోజన సేవ) కంట్రిబ్యూట్ చేశారు. అంతకుముందు 2017లో ఆలయానికి 17 టన్నులు, 30 టన్నుల కూరగాయలతో పాటు రూ.8.2లక్షలు విరాళంగా ఇచ్చినట్లు నివేదికలో పేర్కొంది. 2019లో పొట్టీకి ద్వారపాలకులు బంగారు పలకలను అందజేయడంలో తొమ్మిది మంది దేవస్థానం అధికారుల అవకతవకలను విజిలెన్స్ నివేదిక ఎత్తిచూపింది. అధికారులలో మాజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.మురారి బాబు, మాజీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.సుదీష్ కుమార్, మాజీ కార్యదర్శి ఎస్.జయశ్రీ, సహాయ ఇంజనీర్ కె.సునీల్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్. శ్రీకుమార్, మాజీ తిరువాభరణం కమిషనర్లు కె.ఎస్. బైజు, ఆర్.సె.రాధాకృష్ణన్, పూర్వ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.ఎస్.రాజేంద్రప్రసాద్, పూర్వ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.రాజేంద్రన్ నాయర్ ఉన్నారు. 2019 డిప్యూటీ దేవస్వం కమిషనర్ (ఫైనాన్స్, ఇన్‌స్పెక్షన్ వింగ్) నుండి కూడా టిడిబి విజిలెన్స్ లోపాలను గుర్తించింది. ఇదిలాఉండగా, శబరిమల బంగారం నష్టంపై విచారణకు కేరళ హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన దార్యప్తును ప్రారంభించింది.
సంబంధిత వర్గాల ప్రకారం.. క్రైమ్ బ్రాంచ్ శనివారం రెండు కేసులను నమోదు చేసిందని, ఆ తర్వాత వాటిని సిట్‌కు బదిలీ చేసిందన్నారు ఈ కేసులు ద్వారపాలక విగ్రహాలు, శ్రీ కోవిల్ తలుపు ఫ్రేముల నుండి బంగారం తప్పిపోవడానికి సంబంధించినవని వెల్లడించాయి.

## రేపటినుండీ ఐక్యరాజ్యసమితి శాంతిదళ సభ్యదేశ ముఖ్యుల సమావేశం

**న్యూఢిల్లీ:**ఐక్యరాజ్యసమితికి శాంతి దళాలను సమకూర్చే దేశాల(యుఎన్‌టిసిసి) ప్రధానాధిపతుల సమావేశం ఈనెల 14నుండి 16వతేదీవరకున్యూఢిల్లీలో జరుగుతుంది. భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్, యుఎస్‌జి, డిపిఓ (అండర్ సెక్రటరీ జనరల్ ఫర్ పీస్ ఆపరేషన్స్) జీన్ పియరీ లాక్రోయిక్స్ పాల్గొంటారని రక్షణమంత్రిత్వశాఖ ఆదివారం ప్రకటనలో తెలిపింది. మొత్తం 32 దేశాలకు చెందిన సీనియర్ సైనికన్యాయకత్వం ఆసమాలోచనల్లో పాల్గొంటుంది. ''వసుధైవ కుటుంబం'' అనే భావనకు ఈ సమాలోచన అద్దం పడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి శాంతి దళాలను పటిష్టం చేయడానికి ఇచ్చే శిక్షణ, సాంకేతిక పాత్ర, నిర్ణయాలు చేయ డం, దళాలను సమ్మిళితం చేసుకోవడం, ప రస్పర సమన్వయంతో దళాలను ముందుకు నడిపించడం, ఎదురయ్యే బెదిరింపులను, సవాళ్ళను, నిర్వహణా పరమైన సమస్యలను పరిష్కరించే కీలకమైన వేదికగా ఈ యుఎన్‌టిసిసి ముఖ్యపాత్ర పోషిస్తుంది. ''ఐక్యరాజ్యసమితికి శాంతి దళాలను సమకూర్చడంలో ప్రధానపాత్ర వహిస్తున్న భారతదేశం ఈ ఉన్నతస్థాయీ యుఎన్‌సిసి వేదిక సమావేశాలకు ఆతిథ్యం ఇస్తోంది. శాంతి దళాల నిర్వహణలోఉన్నసవాళ్ళు,బెదిరింపులు, భయాలు, ఉత్తమఅనుభవాలను పంచుకోవడం, ఉమ్మడిఆలోచనలనుఅభివృద్ధిచేయడం ద్వారా శాంతి దళాలను భవిష్యత్ నడిపించేందుకుతయారు చేయడం వంటి కీలక అంశాలలో ఈ వేదిక పాత్ర ప్రధానమైనది.

## విధినిర్వహణలో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న 95 బ్యాచ్ ఎస్‌ఐలు

### -పోలీసు అకాడమీలో ప్రత్యేక కార్యక్రమం




**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ పోలీసు శాఖలో విధినిర్వహణలో 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 1995 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలు ఆదివారం పోలీసు అకాడమీలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా వచ్చి న అప్పా మాజీ డైరెక్టర్ ఎంవి కృష్ణారావు 1995 ఎస్ఐ బ్యాచ్ సావనీర్‌ను విడుదల చేశబూరు. ఈ సందర్భంగా కృష్ణారావును వారు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. తన పర్యవేక్షణ లో అప్పా లో 1995 బ్యాచ్ ఎస్ ఐ లు ఎంతో నాడు కష్టపడి ,ఇష్టపడి శిక్షణ తీసుకున్న ందున నేడు ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని కొనియాడారు. ఇలానే ఆరోగ్యంగా మిగతా సర్వీస్ కూడా మంచిగా గడపాలని కోరారు. ఇంకా నాటి పరిస్థితులు గుర్తుచేసుకుని అకాడమీ డైరెక్టర్ లు పనిచేసిన గోపీనాథరెడ్డి,రతన్ ,మహంతి లాంటి అధికారుల కృషి వల్ల అకాడమీ అభివృద్ధి చెంది నేడు దేశంలో అత్యున్నతమైన శిక్షణా కేంద్రం గా ఐఎస్ఓ సర్టిఫికెట్స్ పొందటం శిక్షణ పొందిన ట్రైనీ ల వల్ల నే సాధ్యమైందని మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమం రాణిరుద్రమదేవి సమావేశ మందిరంలో రెండు రాష్ట్రాలనుండి ఆంధ్రా, తెలంగాణ లోని 1995 బ్యాచ్ ఎస్ ఐ లు వారు ఇన్స్పెక్టర్ లుగా, డి ఎస్ పి లు గా,అడిషనల్ ఎస్ పి లుగా,ఎస్‌పిలుగా ఉన్న దాదాపు 306 మంది లో 200 మంది అధికారులు హాజరైనారు. టిజిపిఎ డిప్యూటీ డైరెక్టర్ కవిత మాట్లాడుతూ..అకాడమీ డైరెక్టర్ మెసేజ్ ను ఈ 30 వసంతాల లో మీరు ఎదుర్కొన్న ఛాలెంజ్ ను అధిక మించి భవిష్యతరాలకు సూచనలు కనుగొనమని కోరారని తెలిపారు. దానిపై 7 జోన్ ల అధికారులు చర్చించారు.రీ యూనియన్ కమిటీ సభ్యులు డిఎస్‌పిలు నర్సింగరావు, బచ్చల రమేష్,శ్రీనాథ్రెడ్డి,జగన్మోహనరెడ్డి, మోహన్ రెడ్డి,తెలంగాణ పోలీస్ అకాడమీ నుండి ఆదూరి శ్రీనివాసరావు,దేవారెడ్డి,భాస్కర్,అమృతరెడ్డి,సందీప్రెడ్డి, ఆంధ్రా నుండి కాంతారావు,మహేంద్ర,భాజీ, తేజేశ్వరరావు, లతోపాటు ప్రతి జోన్ నుండి అధికారులు దాదాపు 200 మంది పాల్గొని విజయ వంతం చేశారు.

## నకిలీ ఎపికె ఫైళ్లపై అందరూ జాగ్రత్త

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సోషల్ మీడియా, వాట్సాప్ లాంటి ప్లాట్ఫామ్లతో పాటు నకిలీ వెబ్సైట్ల ద్వారా మోసగాళ్లు నకిలీ ఎపికె ఫైళ్లను పంపుతున్నారు. అవి 'ప్రభుత్వ బెనిఫిట్లు', 'బ్యాంక్ సేవలు' , 'పెట్టుబడుల అవకాశాలు' అని చెప్పి ప్రజలను నమ్మించి దోచుకుంటున్నారు. అవి డౌన్లోడ చేసి ఇన్‌స్టాల్ చేస్తే మీ వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ సమాచారం దొంగిలి ఆర్థిక నష్టం ఎదురవుతుందని సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. అన్నింటినీ జాగ్రత్తగా చూసి తెలియని ఎపికెలు డౌన్లోడ చేయకండి.

### ఎపికె మోసాల మోసగాళ్ల పని విధానం:

**దురుద్దేశపూరిత లింకుల పంపిణీ:** నకిలీ లింకులను ఎస్ఎంఎస్,వాట్సాప్‌యాప్, సోషల్ మీడియా లేదా ఈ మెయిల్ ద్వారా పంపుతూ ప్రభుత్వ లాభాలు, బ్యాంక్ అప్డేట్లు, ఉద్యోగ అవకాశాలు అని నమ్మిస్తారు. ఎపికె ఫైల్స్ డౌన్లోడ చేయమని ప్రోత్సాహించడం. గూగూల్ ప్లే స్టోరీ కాకుండా బయట నుంచే ఎపికె ఫైల్‌ను డౌన్లోడ చేయమని చెబుతారు.



**అనవసర అనుమతుల కోరడం:** యాప్ ఇన్స్టాల్ చేసే సమయంలో ఎస్ఎంఎస్,కంటాక్ట్స్, నోటిఫికేషన్స్,స్క్రీన్ షేరిం గ్ వంటి అనుమతులు కోరుతుంది.

లాగిన్ డేటా దొంగిలింపు: యాప్ ద్వారా బ్యాంక్ లాగిన్లు, ఒటిపిలు, వ్యక్తిగత సమాచారం వంటి సెన్సిటివ్ డేటా సేకరిస్తారు.

**-దూర నియంత్రణ సాధనాలు (ఆర్ఎటిలు):** కొన్ని యాప్లు మొబైల్ను పూర్తిగా నియంత్రించగల టూల్స్ను కలిగి ఉంటాయి, ఇవి మోసపూరిత లావాదేవీలకు ఉపయోగపడతాయి.

నమ్మకమైన సంస్థల రూపంలో మోసం: బ్యాంకులు, ప్రభుత్వ పథకాలు లేదా పేమెంట్ గేట్వేలుగా నటిస్తూ నకిలీ యాప్లు రూపుదిద్దుకుంటాయి.

**ఆర్థిక నష్టం మరియు డేటా దుర్వినియోగం:** చివరికి బాధితులు వారి ఖాతాల నుండి డబ్బు కోల్పోవడం లేదా వారి వ్యక్తిగత డేటా మళ్లీ మోసాలకు ఉపయోగపడేలా చేయడం జరుగుతుంది.

### ఎపికె మోసాలపై ప్రజలకు సూచనలు: సైబర్ క్రైమ్ డిసిపి కవిత

ఎస్ఎంఎస్, వాట్సాప్, టెలిగ్రామ్, ఈమెయిల్, సోషల్ మీడియా ద్వారా వచ్చిన ఎపికె యాప్లను ఇన్‌స్టాల్ చేయవద్దని సైబర్ క్రైమ్ డిసిపి కవిత ప్రజలకు సూచించారు. అధికారికంగా నిర్ధారించని లింకులు జాగ్రత్తగా చూడాలన్నారు. బ్యాంక్ అప్డేట్లు, క్యాష్బ్యాక్లు, కెవైసి వెరిఫికేషన్, లేదా ప్రభుత్వ ప్రయోజనాల పేరుతో వచ్చే లింకులు క్లిక్ చేయవద్దని తెలిపారు. యాప్ అనుమతులను పరిశీలించాలన్నారు. అనవసర అనుమతులు అడిగే యాప్లను జాగ్రత్తగా గమనించమని తెలిపారు. మొబైల్ మరియు యాంటీవైరస్ అప్డేట్ చేయాలన్నారు. మాల్వేర్ నుండి రక్షణ పొందేందుకు ఎప్పటికప్పుడు మొబైల్ OS మరియు సెక్యూరిటీ టూల్స్ను అప్డేట్ చేయాలని సూచించారు. ఒటిపిలు లేదా బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పవద్దని తెలిపారు. బ్యాంకులు లేదా ప్రభుత్వ సంస్థలు ఒటిపిలు లేదా పాస్వర్డ్స్ అడగవని స్పష్టం తెలిపారు. సైబర్ మోసాలను 1930 నంబర్కు కాల్ చేసి లేదా cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయవచ్చని డిసిపి కవిత తెలిపారు.




# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## జెడియు అభ్యర్థులు ఖరారు.. నలుగురు ఎమ్మెల్యేలకు ఉద్వాసన

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అన్ని స్థానాల్లోనూ ముఖ్య మంత్రి నితీష్ కుమార్ జనతాదళ్ (యునైటెడ్) అభ్యర్థులను ఖరారు చేసిందని, అయితే నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను తొలగించే అవకాశం ఉందని పార్టీ సీనియర్ నేత తెలిపారు. పోటీ చేయబోయే స్థానాలను జెడియు గుర్తించిందని, అభ్యర్థులను కూడా ఖరారు చేసిందని, పనితీరు సరిగా లేని నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానాల్లో కొత్త ముఖాలతో భర్తీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. గత వారం తమ పార్టీ ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ ఆర్‌జెడిలో చేరిన ఖగారియాలోని పర్బట్టా స్థానంలో కూడా కొత్త అభ్యర్థిని పోటీకి దింపుతామన్నారు. ఎన్నికల్లో పనితీరు సరిగా లేని ఎమ్మెల్యేలు తిరిగి పోటీ చేయకూడదని తమ కేంద్ర నాయకత్వం ఇప్పటికే స్పష్టం చేసిందన్నారు.

# రెండు, మూడు రోజుల్లో 'మహాఘట్బంధన్' అభ్యర్థుల ప్రకటన



## ఈ వారంలోనే సంయుక్త మేనిఫెస్టో విడుదల

**న్యూఢిల్లీ :** బిహార్‌లోని ప్రతిపక్ష 'మహాఘట్బంధన్' కూటమి ఒకటి రెండు రోజుల్లో సీట్ల పంపకాన్ని ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ వారంలో ఉమ్మడి మేనిఫెస్టోతో పాటు అభ్యర్థులను ప్రకటించనుంది. ఆర్‌జెడి,కాంగ్రెస్ మధ్య చర్చలు జరుగుతున్నాయని, ఆర్‌జెడికి చెందిన లాలూ ప్రసాద్, తేజస్వి యాదవ్ దేశ రాజధానిలోనే ఉన్నందున రెండు పార్టీలు సోమవారం సమావేశం కావచ్చని వర్గాలు తెలిపాయి. బిహార్‌లోని అన్ని సంకీర్ణ భాగస్వాములతో కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్, కొన్ని ఇతర పార్టీలు తాము బలంగా ఉన్నారని భావిస్తున్న కొన్ని స్థానాల్లో అభ్యర్థులను నిర్ణయించడం కోసం తుది చర్చ జరుగుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ తెలిపారు. ఆర్‌జెడి, కాంగ్రెస్ నాయకత్వాల మధ్య చర్చలు కూడా జరుగుతున్నాయని, సోమవారం నాటికి రెండు ప్రధాన పార్టీల నాయకులు కూడా సమావేశం కావచ్చని ఆయన అన్నారు. సీట్ల పంపకాల ప్రకటన ఆలస్యం కావడంపై రమేష్ మాట్లాడుతూ 'మహాఘట్బంధన్'లో కొంతమంది కొత్త భాగస్వాములను సర్దుబాటు చేసుకోవాల్సి ఉందని, సీట్ల పంపకంలో వారికి స్థానం కల్పించాల్సి ఉందన్నారు. రెండు, మూడు రోజుల్లో సీట్లను ఖరారు చేసి ప్రస్తామని ఆశిస్తున్నానన్నారు. కాంగ్రెస్ ఈసారి ఎన్ని సీట్లలో పోటీ చేస్తుందనే ప్రశ్నకు 50 నుంచి 100 మధ్య ఎన్నినా కావచ్చన్నారు. అయితే, కాంగ్రెస్ గతసారి బిహార్ ఎన్నికల్లో పోటీ చేసిన 50 కంటే ఎక్కువ కానీ 70 కంటే తక్కువ సీట్లలో పోటీ చేయవచ్చని వర్గాలు తెలిపాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మరికొన్ని స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయడానికి సోమవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో అగ్ర కాంగ్రెస్ నాయకులు సమావేశం కానున్నారని వారు తెలిపారు. కాంగ్రెస్ గౌరవప్రదమైన, ఆమోదయోగ్యమైన సంఖ్యలో సీట్లు పొందే అవకాశం ఉందని రమేష్ అన్నారు. బిహార్‌లో ప్రతిపక్ష 'మహాఘట్బంధన్' ఎన్నికల అవకాశాల గురించి రమేష్ మాట్లాడుతూ బిహార్‌లో మార్పు కావాలని ప్రజల్లో బలంగా ఉందని, విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌కు చాలా మంచి స్పందన వస్తుందన్నారు. ఆర్‌జెడి పాలనకు వ్యతిరేకంగా బిజెపి చేస్తున్న 'జంగల్‌రాజ్' కథనంపై, 'ప్రజలు నేటి గురించి ఆందోళన చెందుతున్నారని, 20 సంవత్సరాల క్రితం ఏమి జరిగిందో అనే దానిపై కాదన్నారు. నితీష్ కుమార్ నియంత్రణలో లేరని, ఆయన ఇప్పుడు ఒక ముఖం మాత్రమేనని ప్రజలు గ్రహించి తెలుసుకుంటున్నారన్నారు. ఆయన తిరిగి ముఖ్యమంత్రిగా కాబోరని, 20 సంవత్సరాల క్రితం ఉన్న వ్యక్తిలా లేరని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. బిహార్‌లో కూడా బిజెపి విభజన రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రస్తుతం బిహార్ ప్రభుత్వాన్ని అధికార యంత్రాంగం నడుపుతోందని, నితీష్ కుమార్ ఉన్నారు కానీ ఆయన నియంత్రణలో లేరనే బలమైన భావన ఉందని ఆయన అన్నారు. ఓటు చోరీ ప్రచారంతో పాటు, కాంగ్రెస్ చాలా వెనుకబడిన తరగతులపై దృష్టి సారించిందని జైరామ్ రమేష్ చెప్పారు. మైబెహెన్ మాన్ యోజనను ప్రకటించిందని, దీని కింద రూ. 2,500 నిరుపేద మహిళల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయబడుతుందని, మరికొన్ని ప్రతిపాదనలు పనిలో ఉన్నాయని ఆయన అన్నారు.

## అమ్మాయిలు రాత్రిపూట బయటకు వెళ్లొద్దు

### వైద్య విద్యార్థిని అత్యాచార ఘటనపై సిఎం మమతా బెనర్జీ దిగ్భ్రాంతికర వ్యాఖ్యలు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ దుర్గాపూర్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీకి చెందిన ఒడిశా విద్యార్థిని శుక్రవారం రాత్రి స్నేహితుడితో కలిసి విందుకు బయటకు వెళ్లినప్పుడు సామూహిక అత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. ఘటనపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిగ్భ్రాంతికరమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం వెలుపల నుండి వచ్చిన మహిళా బోర్డింగ్ విద్యార్థులు హాస్టల్ నియమాలను పాటించాలని, రాత్రి ఆలస్యంగా బయటకు వెళ్లకూడదన్నారు. 'హాస్టళ్లలో ఉండే విద్యార్థులు, ముఖ్యంగా రాష్ట్రం వెలుపల నుండి చదువుకోవడానికి పశ్చిమ బెంగాల్‌కు వచ్చిన విద్యార్థులు హాస్టళ్ల నియమాలను పాటించాలి. వారు ఎక్కడికైనా వెళ్లే ప్రాథమిక హక్కు ఉన్నప్పటికీ, అర్ధరాత్రి బయటకు వెళ్లకుండా ఉండాలి. ప్రతి వ్యక్తి కదలికను పర్యవేక్షించడంలో పోలీసులకు కొన్ని లాజిస్టికల్ పరిమితులు ఉన్నాయి. రాత్రిపూట ఎవరు ఇంటి నుండి బయటకు వెళ్తున్నారో అధికారులకు తెలియదు, ప్రతి ఇంటి వెలుపల కాపలాగా ఉండలేరు' అని ఆమె వ్యాఖ్యానించారు. ప్రకృతి విపత్తుతో అతలాకుతలమైన ఉత్తర బెంగాల్‌కు సహాయ, పునరావాస పనులను సమీక్షించడానికి బయలుదేరే ముందు ఆమె నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. వైద్య విద్యార్థిని అత్యాచార ఘటన దిగ్భ్రాంతికరమైనదని, నిందితులను వదిలిపెట్టబోమని చెప్పారు. తమ ప్రభుత్వం ఇటువంటి ఘటనలను సహించదన్నారు. ఆ మహిళ చదువుతున్న విద్యాసంస్థ కూడా ఘటనకు బాధ్యత వహిస్తుందన్నారు. ప్రైవేట్ కళాశాలలు తమ క్యాంపస్‌ల లోపల, చుట్టుపక్కల భద్రతను పటిష్టం చేసుకోవాలన్నారు.

### ముగ్గురు అరెస్టు

అత్యాచారం కేసులో ఆదివారం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో అతని పాత్ర ఉందని అనుమానిస్తున్న మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన ఆ ముగ్గురు నిందితులు ఎవరు అనేది పోలీసులు ఇంకా వెల్లడించలేదు. వారిని ప్రశ్నిస్తున్నామని, ఇది చాలా సున్నితమైన కేసు, త్వరలో మరిన్ని వివరాలను వెల్లడిస్తామని పోలీసుఅధికారిపిటిఐకి తెలిపారు.నిందితుల మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఆదివారం, పరానాగంజ్ కాళీ బారి శ్మశాన వాటికకు ఆనుకుని ఉన్న అడవిలో నేరం జరిగిన ప్రదేశాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. దుర్గాపూర్‌లోని ప్రైవేట్ మెడికల్ కాలేజీ, చుట్టుపక్కల గ్రామాల్లో శోధన నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతంలోని అడవుల్లో శోధనలు నిర్వహించడానికి డ్రోన్‌లను కూడా ఉపయోగించామని అధికారి తెలిపారు. కాగా, బాధితురాలు చదువుతున్న ప్రైవేట్ కళాశాల, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నదని, ఆమ్ ఆరోగ్యం 'మెరుగవుతోందని అధికారి తెలిపారు.ఆమె తన వాంగ్మూలాన్ని అధికారులకు అందించింది. కాగా, మొబైల్ ఫోన్ టవర్ డంపింగ్ పద్ధతి ద్వారా ముగ్గురు నిందితులను గుర్తించారు. మరికొంత మంది కూడా ఇందులో పాల్గొనే అవకాశముందని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు. నిందితులు బాధితురాలికి తెలిసిన వారా లేదా కళాశాల వెలుపల వెళ్లిన ఆమె స్నేహితుడికి తెలిసినవారా అని కూడా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.నిందితులను శిక్షించడానికి చర్యలు తీసుకోవాలని బాధితురాలి తండ్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

### అంబులెన్స్‌లకు ఒక ఫ్రేమ్‌వర్క్ తయారీ, అమలుకు ఆదేశాలు జారీ పిటిషన్‌పై..

# కేంద్రం, ఇతరుల స్పందన కోరిన 'సుప్రీం'

### స్వతంత్ర కమిటీ ఏర్పాటుకు ఆదేశాలు జారీ అభ్యర్థన వినడానికి అంగీకారం



**న్యూఢిల్లీ :** అంబులెన్స్‌లలో ఎల్లవేళలా తగినంత లైఫ్ సపోర్టు సౌకర్యాలు నిర్వహించబడుతున్నాయని నిర్ధారించడానికి ఒక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, అమలు చేయడానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలు చేసిన ఒక పిటిషన్ విషయంలో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, ఇతరుల స్పందనను కోరింది. గ్రౌండ్ రియాలిటీ, ప్రస్తుత ప్రామాణిక ఆపరేటింగ్ విధానాల మధ్య అంతరాన్ని గుర్తించడానికి అంబులెన్స్‌ల ఆపరేషన్, నిర్వహణ, నియంత్రణ యొక్క ప్రస్తుత వాస్తవ స్థితిని సమీక్షించడానికి, ఒక స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలనే ఆదేశాలు జారీచేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను వినడానికి అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. 'నోటీస్ జారీచేయండి. నాలుగు వారాలలో తిరిగి ఇవ్వబడుతుంది' అని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం తన అక్టోబర్ 10నాటి ఆదేశంలో చెప్పింది. ఆ పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వం, ఆరోగ్య మంత్రిత్వ శాఖ, కుటుంబ సంక్షేమం, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖను ప్రతివాదులుగా ఉంచింది. సీనియర్ న్యాయవాది పెర్సివల్ బిల్లిమోరియా, న్యాయవాది జాస్మి దామ్‌కేవాలా పిటిషనర్లు సాయిన్నా పనంగిపల్లి, ప్రియా సర్కార్‌ల తరపున వాదించారు. పనంగిపల్లి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మాజీ డైరెక్టర్‌గా పనిచేసిన ప్రముఖ కార్డియోథొరాయిక్ సర్జన్ డాక్టర్ పి.వేణుగోపాల్ కుమార్తె. సర్కార్ వేణుగోపాల్ భార్య. 'అంబులెన్స్‌లలో సరిపోను అత్యవసర లైఫ్ సపోర్ట్ సదుపాయాలు లేకపోవడం వల్ల డాక్టర్ పి.వేణుగోపాల్ స్వయంగా పేషెంట్‌ను ఆసుపత్రి అత్యవసర గదికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. ఆక్సిజన్ అందకపోవడంతో అంబులెన్స్‌లలో అత్యవసర సౌకర్యాల కొరతను పిటిషనర్లు గ్రహించారు' అని పిటిషనర్ పేర్కొన్నారు. పిటిషనర్లు ప్రతికూల వ్యాజ్యాలలో పాల్గొనడానికి ఇష్టపడటం లేదని, అయితే అమలు చేయగల నియంత్రణ లేకపోవడం వల్ల భారతదేశం వ్యాప్తంగా అంబులెన్స్‌లలో తగినంత అత్యవసర వనరులు లేకపోవడం పెద్ద ఆందోళన కలిగిస్తుందని కనుగొన్నారని పిటిషన్ పేర్కొంది. చాలా మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని ఆ పిటిషన్ తెలియజేసింది. అవసరమైన ప్రాణాలను రక్షించే సౌకర్యాల కొరత కారణంగా, ఆసుపత్రులలో అత్యవసరమైన సేవలను అంబులెన్స్‌లు అందించలేకపోయినందున అనవసరంగా నష్టపోయారని వివరించింది.'అంబులెన్స్‌లలో అన్ని సమయాలలో తగిన లైఫ్ సపోర్టు సౌకర్యాలు ఉండేలా ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయడానికి, అవసరమైన పరికరాలు, సామగ్రి, అత్యవసర మందులతో సహా సౌకర్యాలు ఉండేలాచూడాలి' అని సంబంధిత అధికారులకు ఆదేశాలు కోరింది. ఇతర ప్రార్థనలతో పాటు అంబులెన్స్‌లలో సరిపోని, సరికాని సౌకర్యాలు, అధిక చార్జీలు, ర్యాష్ డ్రైవింగ్, రాకలో ఆలస్యం, ఇతర లోపాలను నివేదించడం వంటి ఫిర్యాదులను ప్రజలు నివేదించడానికి టెలిఫోన్ లేదా ఆన్‌లైన్ హెల్ప్‌లైన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడానికి లేదా కొనసాగించడానికి అధికారులను ఆదేశించాలని పిటిషన్ సుప్రీంకోర్టును కోరింది.

## భారత్‌కు గొప్ప వైవిధ్యాన్ని ప్రతిబింబించే విద్యా వ్యవస్థ అవసరం



**న్యూఢిల్లీ :** భారతదేశానికి దేశంలోని గొప్ప వైవిధ్యాన్ని ప్రతిబింబించే విద్యా వ్యవస్థ అవసరమని, అది 'కొంతమందికి ప్రత్యేక హక్కు' గా మారకూడదని, అదే స్వేచ్ఛకు పునాది అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. భారతదేశం ప్రత్యామ్నాయ తయా రీ వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంద ని, అమెరికా లేదా పెరూతో భాగస్వామ్యం ముందుకు సాగడానికి మార్గం కావచ్చని కూడా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. పెరూలోని పోంటిఫికల్ కాథలిక్ విశ్వవిద్యాలయం, చిలీ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో కాంగ్రెస్ నాయకుడు విద్య, ప్రజాస్వామ్యం, భౌగోళిక రాజకీయాలపై దృష్టి సారించిన 'అంతర్ దృష్టితో కూడిన సంభాషణ' నిర్వహించారు. కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో గాంధీని ఉటంకిస్తూ, దక్షిణ అమెరికాలోని విద్యార్థులతో ఆయన సంభాషణ వీడియోను షేర్ చేసింది. విద్య విషయానికి వస్తే, అది ఉత్సుకతతో, బహిరంగంగా ఆలోచించే స్వేచ్ఛతో ప్రారంభమవుతుందని, ఎటువంటి భయం లేదా అడ్డంకులు లేకుండా రాజకీయ లేదా సామాజికంగా ప్రశ్నలు అడగాలన్నారు. విద్య కొంతమందికి మాత్రమే ప్రత్యేక హక్కుగా మారకూడదని, ఎందుకంటే అది స్వేచ్ఛకు పునాది అని అన్నారు. భారతదేశానికి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే, విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహించే, మన దేశం గొప్ప వైవిధ్యాన్ని ప్రతిబింబించే విద్యావ్యవస్థఅవసరంఅనిఅన్నారు. రాహుల్‌గాంధీ వారం రోజుల పాటు కొలంబియా, బ్రెజిల్, పెరూ, చిలీ దేశాలకు పర్యటనలో ఉన్నారు.

## మాతృశ్రీకి మరోసారి రాజ్‌థాక్రే

**ముంబయి :** మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ థాకరే ఆదివారం తన సోదరుడు, శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రేను ముంబయిలోని ఆయన నివాసం 'మాతోశ్రీ'లో కలిశారు. వారిద్దరు కలుసుకోవడం ఈ వారంలో ఇది రెండవసారి. ఈ భేటీపై విలేకరులు అడిగిన ప్రశ్నకు, రాజ్ మాట్లాడుతూ 'నా తల్లి నాతో ఉంది' అని, ఇది కుటుంబ సమావేశం అని అన్నారు.రాజ్ భార్యషర్మిలకూడాఈ భేటీకి హాజరయ్యారు. అయితే, బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌కు అత్యంత ముఖ్యమైన ఎన్నికల్లో సోదరులిద్దరు కులిసి పోటీ చేస్తారనే ఊహాగానాల మధ్య ఈ భేటీ జరగడం గమనార్హం. జూలై 5న మహారాష్ట్ర ప్రభుత్వం హిందీని 'తప్పనిసరి' చేయడం, 1 5 తరగతుల విద్యార్థులకు మూడు భాషల సూత్రాన్ని అమలు చేయడంపై రెండు వివాదాస్పద జిఆర్‌లను ఉపసంహరించుకున్న నేపథ్యంలో విజయ ర్యాలీని జరుపుకోవడానికి థాక్రేలిద్దరూ ఒకే వేదికపైకి వచ్చారు.

## సీట్ల పంపకాలలో అడ్డంకుల్లేవ్ : ఖేరా

**రాంచి :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలలో ఎలాం టి అడ్డంకులు లేవని, మహాఘట్‌బంధన్ భాగస్వాములు కలి సే పోటీ చేస్తారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా స్పష్టం చేశారు. ప్రతి పార్టీకి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే హక్కు ఉందన్నారు. బిహార్ ఎన్నికలకు సీట్ల పంపకాలపై అక్టోబర్ 14 నాటికి నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే పార్టీ సొంతంగా నిర్ణయం తీసుకుంటుందని జార్ఖండ ముక్తి మోర్చా (జెఎంఎం) ఇండియా కూటమిని కోరిన మరుసటి ఖేరా పై విధంగా స్పందించారు. బిజెపి ఆశించినట్లుగా మహాఘట్‌బంధన్‌లో సీట్ల పంపకాలలో ఎలాంటి అడ్డంకులు లేవని, ప్రతిపార్టీకి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే హక్కు ఉందన్నారు. తాము కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగ అధిపతి ఖేరా రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయంలో విలేకరులతో అన్నారు. ఖేరాసెయింట్‌జేవియర్స్ కళాశాలలో 'రాజ్యాంగంలో గిరిజన హక్కులు వర్సెస్ గ్రౌండ్ రియాలిటీ' అనే అంశంపై జరిగే చర్చలో పాల్గొనడానికి రాంచికి వచ్చారు. కాగా, ఈ నెల 14 నాటికి ఇండియా కూటమి పార్టీకి గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు కేటాయించకపోతే బిహార్ అసెంబ్లీ ఎన్నికలపై పార్టీ స్వంత నిర్ణయం తీసుకుంటుందని జెఎంఎం కేంద్ర ప్రధాన కార్యదర్శి, ప్రతినిధి సుప్రియో భట్టాచార్య శనివారం హెచ్చరించారు.

# కర్రెగుట్టల్లో సిఆర్‌పిఎఫ్ శిక్షణ పాఠశాల




**న్యూఢిల్లీ/బిజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌–తెలంగాణ సరిహద్దు వెంబడి ఉన్న కర్రెగుట్ట కొండలలో సైనికుల కోసం ఒక కమాండో శిక్షణ పాఠశాలను ఏర్పాటు చేయాలని సిఆర్‌పిఎఫ్ యోచిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్–మే మధ్య ఈ గుట్టలలో 31 మంది మావోయిస్టులను చంపిన అతిపెద్ద నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలలో ఒకటి. 60 కి.మీ పొడవు, 520 కి.మీ వెడల్పు ఉన్న తేనెటీగలు, గబ్బిలాలు, ఎలుగుబంట్లు వివిధ రకాల కీటకాలతో పాటు గుహలు, బంకర్లతో నిండిన ప్రకృతి దృశ్యంలో తగిన ప్రదేశాన్ని కనుగొనడానికి ఒక సర్వే జరుగుతోందని అధికారిక వర్గాలు పిటిఐకి తెలిపాయి. కరేగుట్ట కొండలు అని కూడా పిలువబడే కొర్గోటలు కొండలు (కెజిహెచ్) వద్ద సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), దాని జంగిల్ వార్‌ఫేర్ కమాండో యూనిట్ కోబ్రా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు మూడు వారాల పాటు 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'ను చేపట్టి 31 మంది మావోయిస్టులను హతమార్చారు. ఏప్రిల్, మే మధ్య భారీ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కెజిహెచ్ ఆపరేషన్ ముగిసిన తర్వాత, కొండపై దాచిన ఐఇడిలు (అధునాతన పేలుడు పరికరాలు), బాంబులను తటస్థీకరించడానికి విస్తృతమైన శానిటైజేషన్ ప్రక్రియ జరిగింది. ఆ పని దాదాపు పూర్తయిందని, ఇప్పుడు కొండ ప్రశాంతంగాఉండేలాఇక్కడసిఆర్‌పిఎఫ్‌నిర్వహించే శిక్షణా పాఠశాలను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. పారామిలిటరీ దళం, ఛత్తీస్‌గఢ్ పోలీసుల నుండి తీసుకోబడిన అధికారుల బృందం లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల అంశాలను పరిశీలిస్తోంది. తద్వారా కెజిహెచ్‌లో కమాండోలకు శిక్షణ ఇవ్వడానికి శాశ్వత స్థావరాన్ని సృష్టించవచ్చు అని మరో అధికారి తెలిపారు.వేసవిలో 45 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు,నీరు,విద్యుత్తుకు సంబంధించిన సమస్యలు ఉంటాయని అధికారులన్నారు. ఈ ప్రాథమిక సమస్యలు పరిష్కరించబడిన తర్వాత తుది ప్రణాళిక అమలులోకి వస్తుందన్నారు.ఆపరేషన్ బ్లాక్‌ఫారెస్ట్‌సమయంలో దళాలు కొండల మీదుగా వెళ్లడానికి మార్గాలను సృష్టించాయని, అయితే, భూభాగంచాలా కష్టంగా,సవాలుగా ఉందని చెప్పారు. కెజిహెచ్‌లో కొన్ని ప్రాంతాలను పర్యాటకుల కోసం తెరవడానికి కూడా ప్రణాళిక ఉందని, భద్రతా స్థావరం ఉండటం ఈ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లడానికి కూడా సహాయపడుతుందని వారు చెప్పారు. 1,200 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న కెజిహెచ్ అంతటా జరిగిన ఆపరేషన్‌లో సిఆర్‌పిఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసుబృందాలు సంయుక్తంగా 450ఐఇడిలు, 35 అధిక నాణ్యత ఆయుధాలు, 2 టన్నుల పేలుడుపదార్థాలను స్వాధీనంచేసుకున్నాయి. 250 గుహ లు, 214 బంకర్లను ధ్వంసం చేశాయి. కమాండోలు దాడి చేయడానికి దాదాపు 2.5 సంవత్సరాల ముందు అత్యంత హింసాత్మకమావోయిస్టుయూనిట్ పిఎల్‌జిఎ బెటాలియన్ నంబర్1, తెలంగాణ రాష్ట్ర కమిటీ (టిఎస్‌సి) టాప్ కమాండర్లతో సహా 350మంది నక్సల్స్, కొన్ని ఇతర విభాగాలు కొండలపై ఉన్నాయని భద్రతా దళాలు తెలిపాయి. కెజిహెచ్‌లో ఆయుధ తయారీ యూనిట్ ప్రధాన కార్యాలయం ఉండగా, మావోయిస్టుల ఆయుధశాలగా పనిచేసింది.

## జమ్ముకశ్మీర్ రాజ్యసభ పోల్స్‌కు కాంగ్రెస్ దూరం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని నాలుగు రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 24న జరగనున్న ఎన్నికలకు దూరంగాఉండాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ విషయాన్ని జమ్ముకశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి)అధ్యక్షుడు తారిక్ హమీద్ కర్రా ఆదివారంప్రకటించారు. అలెయెన్స్ అగ్రిమెంట్ ప్రకా రం 'సేఫ్ సీట్' కేటాయించ లేమని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సి) తేల్చిచెప్పడంతో పోటీకి దూరంగా ఉండాలని తమ పార్టీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుందని తెలిపారు. నాలుగు రాజ్యసభ సీట్లలో మొదటి రెండింట్లో ఒక స్థానంలో పోటీ చేయాలని కాంగ్రెస్ ఆశించినప్పటికీ రాజ్యసభకు పోటీ చేసేముగ్గురుఅభ్యర్థుల పేర్లను నేషనల్ కాన్ఫరెన్స్ ఇప్పటికే ప్రకటించింది.నాలుగో సీటుకు తమ అభ్యర్థిని నిలపరాదని కాంగ్రెస్ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుందని కర్రా తెలిపారు. తమ భాగస్వామ్య పార్టీకే ఆ సీటునువదలివేస్తున్నట్టు చెప్పారు.కాగా, నేషనల్ కాన్ఫరెన్స్అసెంబ్లీలోతమకున్న బలంఆధారంగాభాగస్వామ్యపార్టీలమద్దతు లేకున్నా సునాయాసంగా 3 సీట్లు గెలుచుకోగలుగుతుంది.నాలుగో సీటు గెలుచుకోవాలంటే బిజెపి వ్యతిరేక ఓటును తమవైపు తిప్పుకోవాల్సి ఉంది.

# పథకం ప్రకారం సమాచార హక్కు చట్టం హననం

### రెండేళ్ళుగా కమిషనర్ల పోస్టులు భర్తీ చేయలేదు
### మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శ



**న్యూఢిల్లీ:** మోదీ ప్రభుత్వం దేశంలో సమాచార హక్కు చట్టాన్ని (ఆర్‌టిఐ చట్టం) పథకం ప్రకారం బలహీనపరచి హననానికి పాల్పడుతోందని కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది. సమాచార హక్కు దేశంలో చట్టరూపం దాల్చి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ పైవిధంగా స్పందించింది. ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనాన్ని, బాహాటత్వ పద్ధతులను అమలు చేసే లక్ష్యంతో ఇరవైయేళ్ళక్రితం యుపిఎ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని, కానీ బిజెపి పాలకులు దేశంలో ఆర్ టి ఐ ని భయపెట్టే హక్కు(రైట్ టూ ఇంటిమిడేట్)గా మార్చేశారని, మృత చట్టంగా మార్చారన్నారు. ఏడుగురు సమాచార కమిషనర్‌ల పోస్టులను దీర్ఘకాలంగా భర్తీ చేయకుండా ఖాళీగా ఉంచేసి కేంద్ర సమాచార కమిషన్‌ను అధికారాలు లేని విగత వ్యవస్థగా చేశారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేశ్ విమర్శించారు. సమాచార హక్కు చట్టం 2005 అక్టోబరు 12వ తేదీన దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. న్యూఢిల్లీలో ఆదివారం జైరామ్ రమేశ్ పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ, పాలనావ్యవస్థలో దాపరికం లేకుండాచేసే ఈ చట్టం వెనుక ఉన్న విప్లవాత్మకమైన ప్రయోజనాలను బిజెపి పాలకులు నీరుగార్చారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం 2019లో సమాచార హక్కు చట్టానికి సవరణలు తీసుకువచ్చి బలహీన పరచిందని, కేంద్ర సమాచార కమిషన్‌ను కోరలులేని వ్యవస్థగా మార్చేసి చాలా సమర్థవంతంగా నాశనం చేసిందన్నారు. ఆర్‌టిఐ చట్టంలోని నిబంధనలను సవరించేందుకు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టాన్ని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఆర్‌టిఐని విచ్ఛిన్నం చేయడానికే ఈ చట్టాన్ని తెచ్చిందని అన్నారు. కేంద్ర సమాచార కమిషన్‌ను కేవలం ఇద్దరు సభ్యులతో మాత్రమే నడుపుతున్నారని, వీరిలో ఒకరు ప్రధాన సమాచార కమిషనర్ కాగా, మరో ఏడు ఇతర కమిషనర్ల పోస్టులు రెండు సంవత్సరాలుగా భర్తీచేయకుండా ఖాళీగా పెట్టి ఉంచారన్నారు. కేంద్ర సమాచార కమిషనర్ ప్రధాన కార్యాలయం ఒక భూతాల ఇల్లులా నిర్మానుష్యంగా మారిపోయిందని, మోదీ ప్రభుత్వం ఆర్‌టిఐ పై తీవ్ర వ్యతిరేకత, అసహ్యం పెంచుకుందని విమర్శించారు. ఆర్ టి ఐ చట్టాన్ని బలహీన పరచి, దానిని విగత చట్టంగా మార్చారన్నారు.


### ఆ ఐదు కారణాలవల్లే ఆర్‌టిఐ విగత వ్యవస్థగా మారింది

సమాచార హక్కు చట్టాన్ని ఎందుకూ పనికిరాకుండా చేయడానికి బిజెపికి ఐదు కారణాలున్నాయని జైరామ్ రమేశ్ చెప్పారు. ఇందులో ప్రధానమైనది నరేంద్రమోదీ ఎం.ఎ డిగ్రీలో "ఆయన రాజనీతి శాస్త్రం' కు సంబంధించిన సమాచారం సమకూర్చాలని ఆర్‌టిఐ ద్వారా అడిగారన్నారు. ఇక రెండో కారణం కూడా దేశంలో కోట్ల సంఖ్యలో నకిలీ రేషన్ కార్డులు ఉన్నాయని ప్రధానమంత్రి చెప్పినప్పుడు ఆయన మాటలు తప్పు అని చెప్పేందుకు ఈ చట్టం ద్వారా సమాచారం సమకూర్చిందన్నారు. మోదీ అన్నీ ఈ విషయంలో అసత్యాలే చెప్పారని ఆర్‌టిఐ చట్టం ద్వారా బహిర్గతమైందన్నారు. ఇక మూడో కారణం కూడా పెద్ద నోట్ల రద్దుపై ఆయన తీసుకున్న నిర్ణయానికి సంబంధించినదేనన్నారు. పెద్ద నోట్ల ఉపసంహరణవల్ల నకిలీ కరెన్సీ నోట్లనుగానీ, లెక్కల్లో చూపించకుండా రహస్యంగా దాచిన బ్లాక్‌మనీని గానీ వెలికి తీయడానికి అవకాశం ఉండదని నరేంద్రమోదీ తన నిర్ణయాన్ని ప్రకటించడానికి నాలుగు గంటల ముందుగానే రిజర్వు బ్యాంకు స్పష్టం చేసిందని, ఈ విషయం ఆర్ టి ఐ చట్టం ద్వారా బహిర్గమైందని చెప్పారు. ఇక నాలుగో కారణం కూడా దేశంలో ఉద్దేశపూర్వకంగా బ్యాంకులకు రుణాలు చెల్లించకుండా ఎగవేసిన 20 మంది ప్రముఖుల పేర్ల జాబితా వెల్లడించాలని ఆర్ టి ఐ చట్టం ద్వారా కొందరు సమాచారం అడిగారని, ఆనాటి రిజర్వుబ్యాంకు గవర్నర్ ఈ జాబితాను ప్రధానమంత్రి కార్యాలయానికి సమర్పించారని కేంద్ర సమాచార కమిషన్ వారికి తెలియజేసిందని రమేశ్ చెప్పారు. విదేశాల్లో దాచిన నల్లధనాన్ని దేశానికి రప్పిస్తానని 2014లో లోక్‌సభ ఎన్నికలకు ముందుగా నరేంద్ర మోదీ ప్రచారం చేశారని, కానీ నల్లధనం దేశానికి తిరిగి రాలేదన్న విషయం ఈ సమాచార హక్కు చట్టం ద్వారానే బహిర్గతమైందన్నది ఐదో అంశమని ఈ ఐదు కారణాలవల్ల నరేంద్రమోదీ ప్రభుత్వం ఆర్ టి ఐని ఎలాంటి అధికార కోరలూ లేని విగతచట్టంగా మార్చేసిందని విమర్శించారు. అదేవిధంగా డిజిటల్ ప్రొటెక్షన్ చటద్టాన్ని ఇప్పుడున్న రూపంలో యథాతథంగా అమలు చేసినట్లయితే సమాచార హక్కు చట్టానికి ఇక అంతిమ ఘడియలు సమీపించాయని రుజువు అవుతుందని జైరామ్ రమేశ్ హెచ్చరించారు. డిజిటల్ ప్రొటెక్షన్ చట్టంలోని 44(3) వ సెక్షన్ కింద ఆర్‌టిఐ చట్టం ద్వారా ఏ వ్యక్తి వ్యక్తిగత సమాచారం కూడా ఎవరికీ అందుబాటులో ఉండే అవకాశం ఉండదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రజా జీవన కార్యకలాపాలలో నిమగ్నమైన వ్యక్తులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం దీనివల్ల లభ్యమయ్యే పరిస్థితులు ఉండవన్నారు. ఈ ముసుగు ఉండటంవల్ల బహిరంగ కార్యకలాపాల్లో నిమగ్నమై తప్పులు చేసే వారిని అరెస్టు చేసే అవకాశం ఉండదన్నారు. ప్రజాజీవితంలో ఉన్నవారికి వ్యక్తిగత జీవితమంటూ ఉండదన్నారు. వ్యక్తిగత సమాచారం పేరుతో ప్రజా జీవితంలో ఉన్నవారి సమాచారాన్ని ఇవ్వడం కుదరదని తిరస్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో యుపిఎ ప్రభుత్వం ఎన్నో పరివర్తన పూర్వక చట్టాలను తీసుకువచ్చిందని, అందులో ఆర్‌టిఐ ఒకటి కాగా, 2006లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 2009లో సమాచార హక్కు చట్టం, 2013లో ఆహార భద్రతా చట్టం, భూసేకరణ చట్టాలున్నాయని గుర్తుచేశారు. ఆర్‌టిఐ చట్టానికి 2019లో చేసిన సవరణలను తాను సుప్రీంకోర్టులో సవాలు చేశానని, ఆరేళ్ళ తర్వాత ఇప్పటికీ ఈ కేసు ఇంకా పెండింగ్‌లోనే ఉండిపోయిందని జైరామ్ రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# సాహితీ విహారి

## ‘లైట్ రీడింగ్’పై క్రాస్నాహోర్కాయ్ తిరుగుబాటు

హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నాహోర్కాయ్‌కి నోబెల్ పురస్కారం లభించడాన్ని ఒక సాంస్కృతిక ప్రకటనగా పేర్కోవచ్చు. ఈ బహుమతి ద్వారా అకాడమీ, ఈ శబ్దాల, వేగాల, టెక్నాలజీ మత్తులో మునిగిపోయిన ప్రపంచానికి, నెమ్మదిగా చదవడం కూడా అవసరమేనని ఒక సూచన చేసింది. హడావుడిగా చదివితే అర్థంకాని శైలిలో రచనలు చేస్తాడు కాబట్టి, క్రాస్నాహోర్కాయ్‌ని అర్థం చేసుకోవాలంటే ఎంతో ఓపిక అవసరం. నింపాదిగా చదవడం అనే కొత్త విప్లవానికి అతను పునాదులు వేస్తున్నాడు. నోబెల్ కమిటీ సాధారణంగా మానవ అనుభవంని విస్తృతంగా, కొత్త కోణంలో చూపిన రచయితలకు బహుమతి ఇస్తుంది. ఈ సూత్రానికి విస్తరణగానే క్రాస్నాహోర్కాయ్‌కి లభించిన గౌరవాన్ని చూడాలి. అతని రచనల్లో ఎక్కువగా మానవ సమస్యలు, పెరిగిపోతున్న అసహనం, నిరాశ, ఆత్మపరిశీలన వంటి అంశాలు ప్రముఖంగా కనిపిస్తాయి. అతని పాత్రలు, పాతబడిన సమాజాల చివరి శబ్దాలు. అయితే, నిశితంగా ఆలకిస్తే, ఆ శబ్దాలలోనే వర్తమాన కాల ప్రతిధ్వని కూడా వినిపిస్తుంది. సాహిత్యం అనేది ఆకర్షణీయమైన కథలు చెప్పడమే కాదు,, అది మన అజ్ఞానాన్ని బహిర్గతం చేయడం కూడా అని నిరూపించిన వారిలో క్రాస్నాహోర్కాయ్ ముందు వరుసలో ఉంటాడు. తూర్పు యూరోప్ సాహిత్యం చాలా కాలం పాటు పాశ్చాత్య సాహిత్య వేదికల్లో నిర్లక్ష్యానికి గురై, పక్కన పడిపోయింది. ఇప్పుడు హంగేరియన్‌కు నోబెల్ లభించడం ఆసక్తిని రేపుతున్నది. ఈ పురస్కారంతో, సమాజంలోని లోతైన నిరాశ, నిర్బంధం, దృఢమైన ఆత్మస్థితి యావత్ ప్రపంచానికి బలంగా వినిపించనున్నాయి. అతని గురించి తెలియనివారు కూడా ఇప్పుడు అన్వేషణ ప్రారంభిస్తానరడం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. ఈ నోబెల్ పురస్కారం ఆయనకు వ్యక్తిగతం కంటే, యావత్ తూర్పు ఐరోపా సాహిత్య సంప్రదాయానికి లభించిన ధ్రువపత్రంగానే పేర్కోవాలి. నేటి ప్రపంచంలో చాలా సాహిత్యం ఎక్కువగా ‘చదవటానికి సులభం’ అనే వ్యాపార సూత్రంపై నడుస్తోంది. క్రాస్నాహోర్కాయ్ ఆ సూత్రాన్ని ధ్వంసం చేస్తాడు. ఆయన వాక్యాలు ఆర్థికంగా లాభదాయకం కావు.. కానీ ఆత్మకు మాత్రం విలువైనవి. నోబెల్ కమిటీ నిర్ణయం ఇది ‘లైట్ రీడింగ్’ సంస్కృతికి ఒక దెబ్బ. ఎవరూ ఊహించని తిరుగుబాటు. మనిషి మళ్లీ ఆలోచించాలనే ఆలోచనకు ఆహ్వానం. నిరాశను సాహిత్యంగా గుర్తించడం చాలా అరుదు. కానీ, క్రాస్నాహోర్కాయ్‌కి దక్కిన గౌరవం, ఈ అభిప్రాయాన్ని మటుమాయం చేస్తుంది. ఎందుకంటే అతను ప్రపంచాన్ని ఆశావహ దృక్పథంతో చూడడు. నిరాశే అతని రచనలోని సౌందర్యం. జీవితం క్షీణిస్తున్నదనే భావన ప్రతి పేజీలో ఉంది. కానీ ఆ నిరాశలోనే అతను కవిత్వాన్ని కనుగొంటాడు. ఈ రచనా విధానం, నేటి సమాజానికి సంబంధించిన ఒక లోతైన సూచన. అభివృద్ధి, టెక్నాలజీ, సమాచార మత్తులో జోగుతున్న మనిషి లోపలి ఖాళీ అలాగే నిలిచిపోతున్నది. దానిని భర్తీ చేయడానికి సాధనాలు దాదాపుగా లేవు. అలాంటి పరిస్థితుల్లో క్రాస్నాహోర్కాయ్ రచనలు ఆధునిక సాహిత్య ప్రస్థానానికి కొత్త మార్గాన్ని చూపింది. నోబెల్ కమిటీ దీనిని గుర్తించడం ద్వారా, ప్రపంచ నిష్కపట నిరాశను సాహిత్యంగా గౌరవించింది. హంగేరీ ప్రస్తుతం రాజకీయంగా ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, అభిప్రాయ స్వేచ్ఛ, కళాత్మక స్వతంత్రతపై అనేక చర్చలు జరుగుతున్నాయి. అందుకే, క్రాస్నాహోర్కాయ్ రచనల్లో ఉన్న ప్రతి ఘటన, నిరాకరణ, సామాజిక క్షీణతపై సున్నిత విమర్శ మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఈ బహుమతి హంగేరీ ప్రభుత్వానికి గర్వకారణం కాకపోవచ్చు, కానీ హంగేరీ సంస్కృతికి మాత్రం గౌరవ చిహ్నం. సాహిత్యానికి ‘సులభంగా చదువునేదిలా ఉండాలి’ లేదా ‘త్వరగా పూర్తయ్యేలా ఉండాలి’ అనే పరుధులు గీయడం సమంజసం కాదని నోబెల్ కమిటీ భావిస్తుందనడానికి క్రాస్నాహోర్కాయ్‌కి దక్కిన పురస్కారమే నిదర్శనం. రచనలను సులభత, వేగం, వినోదం తదితర పరిమితుల్లో బంధించకూడదన్న సూత్రాన్ని నోబెల్ కమిటీ చెప్పకనే చెప్పింది. కారణం.. క్రాస్నాహోర్కాయ్ రచన చదవడం అంటే మనసులో నెమ్మదిగా కరిగిపోవడం. అతని వాక్యాలు గజిబిజిగా ఉన్న ప్రపంచాన్ని మన ముందుంచుతాయి, కానీ అదే గజిబిజీలో మన ఆత్మ ప్రతిబింబాన్ని ఆవిష్కరిస్తాయి. అతను మానవ జాతి పతనం గురించి రాసినప్పుడు కూడా, అది నిరాశ కాదని, ఒక రకమైన ధ్యానమని వాటిని చదివినప్పుడు పాఠకుడికి అర్థమవుతుంది.



> మాస్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్ (2015), ‘ఫార్మెంటర్ లిటరేజర్ ప్రైజ్’ వంటి పలు అవార్డులు, రివార్డులు పొందిన క్రాస్నాహోర్కాయ్ గ్రామీణ సమాజాలను ఎక్కువగా తన రచనల్లో పొందుపరిచా డు. అదే విధంగా మానవ మనస్తత్వాలను నిశితంగా పరిశీలించాడు. మనిషి బాహ్య శక్తుల ద్వారా ఎలా నియంత్రించబడుతాడో, స్వేచ్ఛా ఆశలు ఎంతటి పరిమితులవుతాయో చెప్పాడు. వ్యవస్థలు విరిగిపో తున్నట్టు, బంధాలు ధ్వంసమవుతున్నట్టు అతని రచనలు సాగుతాయి. అనిశ్చితి, విమర్శన, సామాజిక విభేదాల మధ్య జీవిస్తున్న నేటి తరానికి అతని కథలు, వాక్యాల నిర్మాణం కొత్తగా కనిపించవచ్చేమోగానీ, అందులోని అంశాలు కావు. క్రాస్నాహోర్కాయ్ రచనలు సాధారణ పాఠకులకు అవరోధంగా మారవచ్చేమోగా నీ, సాహిత్య ప్రక్రియను ఇష్టపడేవారికి మాత్రం అనంతమైన ఆనందాన్ని, అదనపు సంతృప్తిని ఇస్తా యి. భవిష్యత్తులో అతని రచనలపై భారీగా పరిశోధన లు జరగవచ్చు. సాహిత్య కోర్సుల భాగంగా మారవ చ్చు. అనువాద, సినిమాటిక్ రూపంలో దర్శనమీయవచ్చు.

తత్త్వం, వాస్తవం, కవిత్వం, తర్కం వంటి లక్షణాలు అతని వాక్యాలలో కలిసిపోతాయి. ఇతర నోబెల్ విజేతలు మానవ అనుభవాన్ని క్రమబద్ధీకరించడంపై దృష్టిపెడితే, క్రాస్నాహోర్కాయ్ మాత్రం దానిని విచ్ఛిన్నం చేయడానికి ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపిస్తుంది. కానీ, లోతుగా గమనిస్తే, ఆ ప్రయత్నం వెనుక రచయిత అంతర్మథనం, సమాజం పట్ల ఉన్న ప్రేమ, ప్రస్తుత పరిస్థితులపై ఆవేదన వంటి అంశాలు అర్థమవుతాయి. క్రాస్నాహోర్కాయ్‌కి నోబెల్ బహుమతి రావడమంటే, ప్రపంచం మళ్లీ నిశ్శబ్దమైన, గాఢమైన ఆలోచనలను వినడం ప్రారంభించడమే. మానవ సహనానికి, పాఠకుడి ఓర్పుకూ, భాష యొక్క అంతులేని లోతుకీ ఇచ్చిన గౌరవమే. కాదనడానికి వీల్లేదు.

హంగేరీలోని ‘గులు’ అనే చిన్న పల్లెలో, 1954 జనవరి 5న జన్మించిన క్రాస్నాహోర్కాయ్‌ది విద్యావంతుల కుటుంబం. తల్లి జూలియా పలిక్కాస్ సామాజిక భద్రతా విభాగ అధికారిణి. తండ్రి గియరీ ఓ న్యాయవాది. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తొలుత న్యాయశాస్త్రం చదివాడు. అయితే, సాహిత్యంపై మక్కువ ఉన్న కారణంగా హంగేరియన్ భాషా, సాహిత్య అధ్యయనాలు కూడా చేశాడు. చదువు పూర్తయిన తర్వాత ప్రచురణ సంస్థల్లో ‘ఫ్రీలాన్సర్’గా పనిచేసాడు. అనంతరం పూర్తిగా రచయితగా మారాడు. అతని రచనలు చాలా విచిత్రంగా కనిపిస్తాయి. కొత్తవారికి ఓ పట్టాన అర్థంకావు. లోతైన తాత్విక చింతన, సమాజంలో పేరుకుపోయిన అసహం, అలసిపోయిన జీవితాలు అతని రచనల్లో దర్శనమిస్తాయి. కొన్నిసార్లు ఒకదానికి ఒకటి సంబంధం లేకుండా పేజీలకు పేజీల వివరణలు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నాయి కాబట్టే చాలా మంది క్రాస్నాహోర్కాయ్‌ను పోస్ట్‌మోడర్నిస్ట్‌గా పేర్కొంటారు. అతని అత్యధిక రచనల్లో వాక్య నిర్మాణం చాలా విస్తృతంగా ఉంటుంది. ఒక వాక్యం లో అనేక ఉపవాక్యాలు, విభిన్న కాలాలు, భావాల మధ్య తేలిదనం లేకుండా మార్పులు ఉంటాయి. ఇది చదవడం కొందరికి ఆహ్లాదకరంగా ఉంటుంది. సహనం లేకుండా హడావుడిగా చదివే వారికి మాత్రం అత్యంత కష్టమైనదిగా తోస్తుంది. రచనల్లోని అంశాలు కూడా విచిత్రంగానూ, విషమంగానూ ఉంటాయి. సామాజంలో పేరుకుపోయిన నిర్లప్తత, వేళ్లానుకుంటున్న నిరాశ, పరుగుల కాలంలో ఎదురయ్యే వైఫల్యం, ఆత్మీయులు దూరమయ్యే మానసిక సంక్షోభం, భవిష్యత్తుపై కనిపించని ఆసక్తి వంటి లక్షణాలను అతని రచనలు ప్రతిబింబిస్తాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తుండగా, పుస్తకాలు చదవడం గగనంగా మారింది. అలాంటిది సంక్లిష్టమైన శైలిలో రచనలు చేసిన క్రాస్నాహోర్కాయ్ సాహసాన్ని మెచ్చుకొని తీరాలి. సాహిత్యం అంటే విజ్ఞానం పంచేదిగానో... ఆనందానుభూతులను కలిగించేదిగానో ఉండాలన్న సూత్రాలకు అతను ఏనాడూ లొంగలేదు. భావోద్వేగానికి, వాస్తవ పరిస్థితులకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చాడు. ‘అంతా సవ్యంగానే ఉంది’ అంటూ ఆత్మవంచన చేసుకునేవారిపై నిజాల కొరడా ఝుళిపించాడు. అకాల వానల్లాగా అతని రచనలు హఠాత్తుగా వాతావరణాన్ని పూర్తిగా మార్చేస్తాయి. పాతకాలపు విలీన సామాజిక వ్యవస్థలు, నిర్బంధం, అదృశ్యమైన శక్తులు నిర్మించిన అసమానతల రాతిగోడల వెనుక మగ్గిపోతున్న జీవితాలు, పెరుగుతున్న నిరాశ, బాధ, ఉదాశీసనతతో కూడిన నిజమైన ప్రపంచాన్ని పాఠకుడికి పరిచయం చేస్తాయి. ఇలాంటి విలక్షణాలు ఉన్నప్పటికీ, క్రాస్నాహోర్కాయ్ రచనలు మానవ సహనాన్ని పరీక్షిస్తాయి. ఎందుకంటే అతని వాక్యాలు, అతని లయ, అతని దృష్టి తదితరాలు సాధారణ రచయితలకన్నా భిన్నమైన ఒక నిరంతర ప్రవాహం సాగుతాయి. అతని వాక్యాలు సగటున పేజీల కొద్దీ సాగుతాయి. ఒక్క వాక్యంలోనే పది, ఇరవై ఉపవాక్యాలు కలిపి రాస్తాడు. కాగితం మీద ఆగకుండా పరుగులు తీసే ఆలోచనల శ్రేణిలా ఉంటాయి. ఈ శైలికి మూలం అతని ప్రపంచ దృష్టి. అతని కథల్లోని పాత్రలు ఎప్పుడూ నిలకడగా ఉండవు. అవి ఆలోచనల తుఫానులో తిరుగుతూనే ఉంటాయి. వాక్య నిర్మాణం కూడా అదే లయలో ఉంటుంది. ‘సటాంటాగో’ నవలలో ఒక్కో వాక్యం రెండు మూడు పేజీల వరకు సాగుతుంది. వాటిని చదివేసరికి పాఠకుడికి ముచ్చెమటలు పడతాయి. కానీ, ఆ కష్టంలోనే అతని శైలిలో దాగిన సౌందర్యం అర్థమవుతుంది. అతని ఆలోచనల ధారలో సమాధానాల కన్నా ప్రశ్నలే ఎక్కువ. మనిషి మనసులో జరిగే గందరగోళాన్ని నేరుగా రాయడు. బదులుగా, ఆ గందరగోళం ఎలా వాక్యాలలోకి, వాక్యాల మధ్య ఖాళీలలోకి జారిపోతుందో చూపిస్తాడు.

క్రాస్నాహోర్కాయ్ కథల్లో ఏది ప్రధాన సంఘటన అనే స్పష్టత ఉండదు. అన్ని విషయాలు సమాన ప్రాధాన్యంతో, ఒకే వేగంతో ప్రవహిస్తాయి. అతని శైలి పాఠకులను నిరంతరం ఒక అనిశ్చిత స్థితిలో ఉంచుతుంది. ఎక్కడ ప్రారంభమవుతుందో, ఎక్కడ ముగుస్తుందో తెలియని ఆలోచనల వలయంలో చిక్కుకోవడం పాఠకుల వంతు. అతని రచనల్లో వాక్యాలు తరచుగా పునరావృతమవుతాయి. అదే భావం, అదే వాక్య నిర్మాణం కొంచెం మార్పుతో తిరిగి వస్తుంది. మొదటికి ఇది విసుగుగా అనిపిస్తుంది, కానీ కొంత తర్వాత అది ఒక రకమైన మంత్రంలా మారుతుంది. వాస్తవానికి ఈ రచనా శైలి మానవ ఆలోచనల చక్రాన్ని ప్రతిబింబిస్తుంది. మనిషి ఒకే ఆలోచన చుట్టూ ఎలా తిరుగుతుంటాతో, అతని పాత్రలు కూడా అదే విధంగా ఒకే స్వభావాన్ని వ్యక్తీకరిస్తుంటాయి. భాష విషయానికి వస్తే, క్రాస్నాహోర్కాయ్ భాష సజావుగా ఉండదు. ప్రారంభంలో పాఠకుడిని ఏమాత్రం ఆకట్టుకోదు. వాక్యాల నడక మందగిస్తుంది. పాఠకుడి ఊపిరి కూడా ఓ లయగా మారుతుంది. వాక్యాలు మనలో ఓపికను, ఏకాగ్రతను కోరుకుంటాయి. చదువుతున్న కొద్దీ వస్తువులు, గాలి, కాంతి, వర్షం, మట్టి, పశువులు, రోడ్లపై బురద... ఇలా ప్రతిదీ అతని వాక్యాలలో జీవం పొందిన విషయాన్ని పాఠకుడు గ్రహిస్తాడు. వాటిలోని భావ సౌందర్యం, వాస్తవాల ప్రతిబింబాలు అర్థమవుతాయి. అప్పుడే పాఠకుడికి ఏదో ఒక అజ్ఞాత దార్శనికుడితో సంభాషణ జరుగుతున్న భావన కలుగుతుంది. క్రాస్నాహోర్కాయ్ వర్ణన ఒక చలనచిత్ర దర్శకుడు వివరించే దృశ్యంలా ఉంటుంది. ప్రతి అంశాన్ని నిదానంగా, సున్నితంగా వివరిస్తాడు. సమాజం క్షీణిస్తోంది, ఆశలు తరిగిపోతున్నాయి, విలువలు చెదిరిపోతున్నాయి అనే భావం అతని రచనల్లో కనిపిస్తుంది. మనుష ల జీవితాలు నిరాశతో నిండిపోయి ఉంటాయని అతను పదే పదే గుర్తుచేస్తాడు. ఆ కోణంలో జాగ్రత్తగా చూస్తే, నిరాశాజనకమైన ఆ చీకటిలో కూడా ఒక సౌందర్యం అలరిస్తుంది. అది ఒక వికారమైన అందం కావచ్చు. కానీ, మ నిషి చివరికి పతనం అవుతున్నాడనే సత్యాన్ని ప్రశాంతం గా అంగీకరించే అందం. క్రాస్నాహోర్కాయ్ రచనల్లో కా లం నేరుగా కదలదు. భూతం, వర్తమానం, భవిష్యత్తు అన్నీ ఒకేసారి ఉన్నట్టుగా అనిపిస్తాయి. స్థలం కూడా అ స్పష్టంగా ఉంటుంది. అది ఒక గ్రామమా, ఒక దేశమా, లేక మనస్సు లోపలున్న భ్రమా అనేది చెప్పడం కష్టం. ఈ అస్పష్టతే అతని రచనలకు ఒక మాయాజాల భావనా లేపనాన్ని అద్దుతుంది. మనసును తడిపే నిరాడంబరతే అతని భాషా గమ్యం. క్రాస్నాహోర్కాయ్ అద్భుతమైన వాక్యాలు రాస్తాడుగానీ అవి అలంకారప్రియమైనవి కావు. పెద్ద పదజాలం, అతి శబ్దం, ఆర్భాటం అతనికి ఇష్టం ఉండదు. అ తని భాష సున్నితమైనదైనప్పటికీ, గట్టి భావాన్ని కలిగిస్తుంది. అది ఒక విషాద సంగీతంలా ఉంటుంది. చదివే వారికి కొంచెం బాధ.. కొంచెం ప్రశాంతత. స్థూలంగా చెప్పాలంటే, క్రాస్నాహోర్కాయ్ రచన శైలి నిరంతర ప్రవాహం. మానవ దౌర్భాగ్యంపై కురిపించే భావోద్వేగం. ధ్యానంలా అనుభూతి కలిగించే సెలయేటి ప్రవాహం. అతని రచన చదవడం అనేది కథను అనుసరించడంకాదు.. మనసును ఒక అంధకార గుహలోకి తీసుకెళ్లి, అక్కడ మన సొం త ప్రతిబింబాన్ని చూపించే అనుభవాన్ని పొంద డం. క్రా స్నాహోర్కాయ్ వాక్యాల మెలకువలో మునిగిపోయే పాఠకుడు తన ఆలోచనల ఆవరణ నుంచి బయటకు రావడం కష్టం. కానీ అక్కడే అతని మాయ ఉంది. వాక్యాల పొడ వు మనలను తిప్పేస్తుంది, కానీ ఆతిరుగులోనే మనం ప్ర పంచాన్ని కొంచెం కొత్తగా చూడటం నేర్చుకుంటాడు. అ తని భాష.. భావం.. అనుభూతి చాలా విలక్షణమైనవి. ఆ ప్రత్యేక సాహిత్యానికి అనువైన గౌరవం దక్కడం సముచితం.

**– సత్యశ్రీ**

---

## కాలాతీత రచన

(అక్టోబర్ 14న జాలాది వర్ధంతి)

జాలాదిగా అభిమానులకు సుపరచితుడైన జాలాది రాజారావు పేరు వినగానే జానపద సాహిత్యం గుర్తుకొస్తుంది. సినిమా పాటల్లోనూ జానపద తత్వాన్ని, విశిష్టను జోడించిన ఘనత జాలాదికి దక్కుతుంది. కొసరాజు మాదిరే జాలాది కూడా జనపాదలకు.. జానపదుల కు ప్రాధాన్యం ఇచ్చాడు. ‘ప్రాణం ఖరీదు’ సినిమా కోసం జాలాది రాసిన ‘యాతమేసి తోడినా ఏరు ఎండదు’ పాట అతని కీర్తిని చిరస్థాయిగా నిలిపింది. కాలాతీత రచనగా పేర్కొనదగిన పాట ఇది..

**‘యాతమేసి తోడినా ఏరు ఎండదు**
**పొగిలి పొగిలి ఏడ్సినా పొంత నిండదూ**
**దేవుడి గుడిలోదైనా పూరి గుడిశ లోదైనా**
**గాలి ఇసిరి కొడితే...**

**ఆ దీపముండదు**’ అంటూ జీవిత సత్యాలను వివరిస్తాడు రచయిత. సన్నివేశ పరంగా పాత్రల కష్టాలను, అక్కడ నెలకొన్న పరిస్థితులను వివరించేదిగా ఉన్నప్పటికీ, వాస్తవ జీవితంలోనూ దీనిని అన్వయించుకోవచ్చు. మహిళల దుస్థితిని చూసినప్పుడు అతనిలో ఆర్తి తర్వాతి చరణాల్లో దర్శనమిస్తుంది.

**‘పలుపు తాడు మెడకేస్తే పాడి ఆవురా...**
**పసుపు తాడు ముడులేస్తే ఆడదాయె రా...**
**కుడితి నీళ్ళు పోసినా...అది పాలు కుడుపుతాదీ...**
**కడుపు కోత కోసినా...అది మనిషికే జన్మ ఇత్తాదీ’**

అంటాడు. అంతేకాదు..

**‘బొడ్డు పేగు తెగిపడ్డా రోజు తలుసుకో...**
**గొడ్డు కాదు ఆడదనే నిజం తెలు–సుకో’** అంటూ మహిలలను బానిసలుగా, ఆట బొమ్మలుగా చూసే వారి చంప ఛళ్లుమనిపిస్తాడు. అదే సమయంలో..



**‘అందరూ నడిసొచ్చిన తోవ**
**ఒక్కటే**
**సీము నెత్తురులు పారే తూము**
**ఒక్కటే**
**మేడ మిద్దెలో ఉన్నా... సెట్టునీడ తొంగున్నా**
**నిదర ముదర పడినాకా...**
**పాడె ఒక్కటే వల్లకాడు ఒక్కటే’** అంటూ సర్వమానవ సమానత్వాన్ని కూడా అద్భుతంగా ఆవిష్కరిస్తాడు. ఈ క్రమంలోనే, సమాజంలో నెలకొన్న వర్గ బేధాలను సైతం విడిచిపెట్ట లేదు.

**‘కూత నేర్సినోడీ కులం కోకిలంట రా..**
**ఆకలేసి అరిసినోళ్ళు కాకులంట రా’** అని ఒక్క సూక్ష్మంగానే, విశ్వమంత విస్తారమైన, నమ్మడాకి మనం ఇష్టపడని అత్యంత నిష్ఠూరమైన నిజాన్ని వివరిస్తాడు. జాలాదిని ఒక శ్రీశ్రీ... ఒక ఆరుద్ర సరసన నిలబెట్టడానికి ఈ పంక్తులు చాలు.

---


## చదవాల్సిన పుస్తకం

### చారిత్రక నవలా సాహిత్యాన్ని మలుపుతిప్పిన ‘ఛంఘిజ్‌ఖాన్’




అక్టోబర్ 16 తెన్నేటి సూరి వర్ధంతి

తెన్నేటి సూరి తలచుకుంటే ‘ఛంఘిజ్‌ఖాన్’ నవల గుర్తుకొస్తుంది. ఆ పేరుకు మారుపేరుగా నిలుస్తాడు సూరి. ఆయన పండితుడు.. విద్వాంసుడు, అభ్యుదయ రచయిత, కథారచయిత, నవలాకారుడు, నాటకకర్త.. ఒక్క మాటలో చెప్పాలంటే బహుముఖంగా విస్తరించిన ప్రజ్ఞ అతనిది. ‘ఛంఘిజ్‌ఖాన్’ నవల ఆయనలోని సాహితీకారుడిని, పరిశోధకుడిని పరిచయం చేస్తుంది. ఈ నవల 13వ శతాబ్దం మంగోల్ సామ్రాజ్య నేపథ్యంలో సాగుతుంది. ఈ నవలలో ఛంఘీజ్‌ఖాన్‌ను ఆసియా ఖండ చరిత్రలో గొప్ప విజయవంతుడిగాను, పరిపాలనా శక్తిరీత్యా, రాజకీయ నేర్పరి, నేర్పరి యోధుడిగా చిత్రీకరించాడు. ఛంఘీజ్‌ఖాన్ వ్యక్తిత్వాన్ని, ఆయన నాయకత్వ లక్షణాలను, రెండు పెద్ద సామ్రాజ్యాల మధ్య వచ్చే ఘర్షణలు, వ్యూహాలు, సామాజికరాజకీయ ప్రభావాలను వివరించడంలో తెన్నేటి సూరి అసాధారణ ప్రతిభ కనబరిచారు. స్వయం పరిశోధనతోపాటు, పాశ్చాత్య గ్రంథాల నుంచి ఆధారాలు కూడా సేకరించి, ప్రాచ్య చారిత్రక ఆధారలను పరిశీలించి, కథను సమర్థంగా నడిపాంచాడు. కథానాయకుడి రాజకీయాధికారం, ఆయుధశక్తి, సమర్థనాయకత్వం, ఆదరణ, ప్రేమ తదితర మానవీయ కోణాలను లోతుగా వివరించాడు. ఇందులో చారిత్రక అంశాలను, ప్రామాణిక ఆధారాలను అద్భుతంగా మేళవిస్తూ, గత శతాబ్దాలలో జరిగిన సంఘటనలను, సామాజిక రాజకీయ మార్పులను ప్రతిబింబించే కథనం ఉంది. రచయిత పాత్రల చిత్రణ, మాటల తీరు, కథా కాలం ప్రకారం సంస్కృతి, సంప్రదాయాలు, యుద్ధ వ్యూహాలు, సామాజిక పరిణామాలు వంటి అంశాలన్నీ నవలలో ఆవిష్కృతమవుతాయి. ఈ నవల తెలుగు చారిత్రక నవలా సాహిత్యంలో పెను సంచలనం సృష్టించింది. ఛంఘీజ్‌ఖాన్ పాత్రను పరిశోధనా ధోరణితో, కళాత్మకతతో మిళితం చేసి, చరిత్రను కథగా పరస్పరంగా మిళితం చేశాడు. కథనం ప్రకారం, పాఠకుడు మంగోల్ సామ్రాజ్య యువరాజు కంటే, సమకాలీన సమాజ మార్పును, ఆధునిక యుద్ధ వ్యూహాలను, రాజ్యంలోని వ్యక్తిగతసామాజిక లక్షణాలను లోతుగా పరిశీలించగలుగుతాడు. సూరి నిశిత పరిశోధనా పటిమ, చారిత్రక విజ్ఞానం, సంప్రదాయక వైవిధ్యం స్పష్టంగా ఈ నవలలో స్పష్టమవుతుంది. చంఘిజ్ఖాన్ వంటి చారిత్రక నవలలో పాశ్చాత్య, ప్రాచ్య, ప్రామాణిక గ్రంథాల అధ్యయనంతో యథార్థతను రచయిత నిక్షిప్తం చేసిన విధానం అనన్య సామాన్యం. చరిత్రను కేవలం వివరించడమే కాకుండా, పాత్రలకు జీవాన్ని చేకూరుస్తూ, రాజకీయ సందర్భాల తుది తాత్త్వికాంశాల వరకూ రచయిత చొచ్చుకుపోతాడు. ఇది చారిత్రక నవల అయినప్పటికీ, సామాన్య పాఠకులకు సైతం అర్థమయ్యే ప్రకృతి, లక్షణాలు కనిపిస్తాయి. సందర్భానుసారంగా గంభీరమైన, అలంకారికమైన వాక్య నిర్మాణం, యుద్ధ, వ్యవస్థాపన, సామాజిక సంక్లిష్టతల చిత్రణలో నైపుణ్యం సమ్మిళితమై ఉంటాయి. పాత్రలు మాట్లాడే పద్ధతి, వారి భావోద్వేగాల విశ్లేషణలో కూడా హృదయాన్ని హత్తుకునే శైలిని అనుసరించారు. ముఖ్యంగా ఆయన వచనంలోని స్వచ్ఛందత, సంఘటనల వర్ణన పాఠకులను ఆకట్టుకుంటుంది. అధ్యయన పరమైన వివరాలు, కథాగతంలోని సోపానవిధానం, కళాత్మకత, సామాజికమైన మానవీయ స్పర్శ, వివిధ ప్రయోగాలు ఈ నవలలో పలుకరిస్తాయి. ‘ఛంఘిజ్‌ఖాన్’ చదువరులకు గంభీరమైన పాత్రల పరిచయం, యుద్ధ వ్యూహాలు, మానవీయ సంక్షోభాలను వివరిస్తూ, కొన్ని చోట్ల ఆద్యంతం సోపానవిధానాన్ని, మరి కొన్ని సందర్భాల్లో సంఘటిత సంఘటనలను పేర్కొంటూ కథనాన్ని నడిపిస్తాడు సూరి.



చరిత్రను నూతన పంథా లో మలచే క్రమంలో, కథలోని త రచూ మారేవారి పాత్రలు, రాజకీయ వ్యూహం, విషా దం, మానవీయ విలయాన్ని కూడా చూపిస్తాడు. ఛంఘిజ్‌ఖాన్ నవలలో శైలి చారిత్రక నవలా ప్రక్రియకు అనువుగా ఉంటుంది. నవలల్లో కథ, పాత్ర లు, సంఘటనలు వాస్తవికత, ఊహ ఆధారంగా నడుస్తాయి. ఆ సంవిధానంలో రచయిత సందర్భానికి అనుగుణంగా తన రచనా శైలిని మార్చడం ఈ నవలకు కొత్త అందాన్ని తెచ్చింది. ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకున్న ఛంఘిజ్‌ఖాన్ నవలను తప్పక చదవాల్సిన పుస్తకాల జాబితాలో చేర్చింది.

**నవల పేరు**

ఛంఘిజ్‌ఖాన్
రచన: తెన్నేటి సూరి
వెల: రూ. 300

**ప్రతులకు:** నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జీఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

---

## బర్రె తల్లీ...!

బర్రె తల్లీ...! నీది ఆకాశానిది
బొడ్డు పేగుబంధమేమో
ఎల్లకాలం మందికోసమే మీ తనువు తండ్లాటంతా
నీది తల్లి మనససొంటి మనసు
ఏనాడు ఆకలని నీ కాడికొచ్చినా
లేదనకుంటా నీలోపల ఎంతుంటే అంత
పాలిచ్చి తొలినావ్

నీ పిల్ల మూతి గట్టి పాలన్నీ దోసుకున్నా
ఏనాడు నోరు తెరిచి పల్లెత్తు మాటనలే
కట్టమచ్చి నీ బిడ్డనమ్ముకున్న
కంట నీరు తీసి ఊకున్నవ్ గాని
కసిరిచ్చి దూరంబెట్టలే బర్రె తల్లి

నీవు మా బహుజన గూడెపు చిన్నమ్మవు
మమ్ములెత్తుకుని సాదలేగావచ్చు గానీ
నీ పాలిచ్చి పెద్ద చేసినవ్
అమ్మ పాలకంటే నీ పాలుతాగి పెరిగిందే ఎక్కువ
నీకు గడ్డి పెట్టిన్నో, గరకపెట్టిన్నో
కుడిది బోసిన్నో, కుండల నీళ్లు పోసిన్నో
ఎండకెండి,వానకు తడిసి, సలికి వణికినా

లోపలేమనుకున్నవో ఎరుకలే గానీ
తెల్లారగట్ల నాయినొచ్చి నీ పొదుగు పట్టుకుంటే చాలు



పట పటానీ మమతల పాలన్నీ ఒలుకబోత్తువు తల్లీ...
కామధేనువు కామధేనువు అంటే కథలల్ల ఇన్నదే కానీ
మా బతుకుల్ల అదేనాడు లేదు మా బతుకుల్ల ఇంత
సళ్ళబొట్టేసే నీవే అసలైన కామధేనువు

నీకు నాగలి కడితే మా భూములంతా దున్ని
సేద చేసినవ్ నువు సచ్చినా నా కాలి చెప్పువైనవ్,
నా గుండె డప్పైనవ్ ఇప్పుడు చెప్పు నీవు కదా!
కామధేనువంటే...
నీ రంగు రూపు గెలిచేసేటోళ్ల మెడలు వంచాలంటే
నీ కొమ్ములు తెచ్చి ఈ ఇండియా గేట్ మీద
అలంకరించాలిప్పుడు! నీ రంగును గేలి చేసే జాతికి
తెలిసేలా ఈ దేశానికి నీ తోలు కప్పి ఊరేగింపు
చెయ్యాలి తల్లీ...
ఈ దేశపు మూలవాసుల అసలు రూపు నీవు
నిన్నీదేశ అధికార చిహ్నంగా ప్రకటించాలిపుడు!!

**– దిలీప్ వనపాకాల**

---

## బహుముఖ ప్రజ్ఞ ‘విశ్వనాథుడి’ సొంతం

(అక్టోబర్ 18 విశ్వనాథ వర్ధంతి)

తెలుగు సాహితీ వనాన్ని సుసంపన్నం చేసిన రచయితలు చాలా మందే ఉంటారు. కానీ, దాదాపు అన్ని రకాల సాహితీ ప్రక్రియలు చేసిన వారు చాలా అరుదు. అలాంటి అరుదైన సాహితీవేత్తల్లో అగ్రగణ్యుడు విశ్వనాథ సత్యనారాయణ. 1891 సెప్టెంబర్ 10న జన్మించి, 1976 అక్టోబర్ 18న తుదిశ్వాస విడిచిన విశ్వనాథ అసాధారణ ప్రతిభావంతుడు. రామాయణ కల్పవృక్షం (జ్ఞానపీఠ అవార్డు పొందిన రచన) వంటి గ్రంథాల నుంచి కిన్నెరసాని పాటల వరకూ ఆయన చేపట్టని ప్రక్రియ లేదు. 1916 లో ‘విశ్వేశ్వర శతకము’తో ప్రారంభమైన విశ్వనాథ రచనా ప్రస్థానం, అనంత గంగా ఝరిలో పరుగులు తీసింది. 25 పైచిలుకు కావ్యాలు, 6 శతకాలు, 13 గేయకావ్యాలు, 15 నాటకాలు, 58 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శన గ్రంథాలు, మరెన్నో వ్యాసాలు, ఉపన్యాసాలు... ఇలా ఎన్నో రచనలు ఆయనను విలక్షణ సాహితీకారుడిగా నిలిపాయి. ఆయన రచనలను కొన్ని ఇతర భాషలలోకి అనువాదమయ్యాయి. 1920 నాటికే తెలుగులో ప్రసిద్ధ కవిగా గుర్తింపు తెచ్చుకున్న విశ్వనాథ 1961లో కరీంనగర్ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాలుగా పదవీ విరమణ చేసిన తరువాత పూర్తి స్థాయిలో తన సమయాన్ని సాహితీ వ్యాసాంగానికి కేటాయించారు. ప్రముఖ బెంగాలీకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మాదిరి తన రచనలను కొన్నింటినైనా ఆంగ్లంలోకి తర్జుమా చేసుకొంటే, అతను అంతర్జాతీయ ఖ్యాతినార్జించి ఉండేవాడని అతను అభిమానులు అంటుంటారు. అయితే విశ్వనాథ రచనలను విశ్లేషించే విమర్శకుడు అతను తాత్విక స్థాయిని అర్థం చేసుకొంటేగాని సహేతుకమైన అనువాదం సృష్టించడం సాధ్యం కాదు. విశ్వనాథ రచనలలో అతని పాండిత్యమే కాక, రచనా శిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన అద్భుతంగా కనిపిస్తుంటాయి. తమిళనాడులోని మదురై ప్రాంతం నేపథ్యంలో వచ్చిన నవల ‘ఏకవీర’ నవలను పుట్టపర్తి నారాయణాచార్యులు మళయాళంలోనికి, అంబటిపూటి హనుమయ్య తమిళంలోనికి అనువదించారు. ఎన్‌టి రామారావు నాయకుడిగా వచ్చిన ‘ఏకవీర’ సినిమాకు డాక్టర్ సి. నారాయణరెడ్డి మాటలు, పాటలు సమకూర్చాడు. ‘వేయిపడగలు’ నవలను భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు ‘సహస్రఫణ్’ పేరుతో హిందీలోకి అనువదించారు. భారత దేశ చరిత్రను వివరిస్తూ ఆయన ‘పురాణవైర గ్రంథమాల’ కింద 12 నవలలు రాశారు. ప్రతి నవలా ఉత్సుకతతో నిండిన కథ, అనితరమైన అతను శైలి, విశేషమైన పాత్రలతో పాఠకులను ఆకట్టుకొంటాయి. విశిష్టమైన రచయితగా పేరు సంపాదించుకున్న విశ్వనాథను ఎన్నో అవార్డులు, పురస్కారాలు వరించాయి. ఆయనకు గుడివాడలో గజారోహణ సన్మానం జరిగింది. ‘వేయిపడగలు’ నవలకు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు బహుమతి లభించింది. 935 డిసెంబరు 20న బందరు పౌర సన్మానంలో ఆయనకు ‘కవిసమ్రాట్’ బిరుదు లనించింది. .1956 లో విజయవాడ, గుడివాడ, కరీంనగర్ లలో సాహితీప్రియులు ఆయనకు షష్టి పూర్తి సన్మానం చేసారు. 1957 లో ఢిల్లీ ఆంధ్ర సంఘం సన్మానం, పురస్కారం లభించాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ఉపాధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యుడిగా విశ్వనాథ సేవలు అందించాడు. 1963లో కలకత్తా వంగ సాహిత్య పరిషత్తు కిరీటం పెట్టి సత్కరించింది. 1965లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ‘కళాప్రపూర్ణ’ బిరుదుతో సన్మానించింది. ఇలా ఎన్నో సన్మానాలు, పురస్కారాలు, బిరుదులు అందుకున్న విశ్వనాథ ప్రత్యేక తపాలా బిళ్లను 2017 ఏప్రిల్‌లో విడుదలైంది. సాహిత్యంలో ఉన్న దాదాపు అన్ని విభాగాల్లోనూ రచనలు చేసిన ఏకైక వ్యక్తిగా విశ్వనాథ చిరంజీవిగా నిలిచిపోతాడు.



## గుట్కాలు అమ్ముతున్న వారిపై కేసులు



ప్రజాపక్షం/షాబాద్: మండలంలోని షాబాద్, నాగర్‌గూడ, హైతాబాద్‌లో అక్రమంగా ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను అమ్ముతున్న షాపులపై ఆదివారం షాబాద్ సిఐ కాంతారెడ్డి , ఎస్సై సతీష్ తన సిబ్బందితో కలిసి అకస్మీక తనిఖీలు చేశారు. గుట్కాలను అమ్ముతున్న అబ్దుల్, ఖలీమ్, సత్తార్, ఖుర్మన్, ఎస్‌కె సల్మాన్, ఎస్‌కె మోసిన్‌లపై కేసులు నమోదు చేసిన్నట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ కాంతారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు అమ్మిన వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: ఆదివారం మహతి ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో నాంపల్లి పోట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో సంగీత నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో అకట్టుకున్నాయి. షాద్‌నగర్ పట్టణానికి చెందిన ప్రభోదయ డాన్స, మ్యూజిక్ మాస్టర్ రంజు ప్రవీణ శిష్యురాలు అక్షయ చేరి యశోదకు శిశువితాగు గానంపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, అభినయ ఆహాబావాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. చిన్నారులు సిద్ధి వినాయక, పుష్పాంజలి, రామ రామ, ముద్దుగారే యశోద గానాలపై హితిక, మోక్ష, ఉషశ్రీ, ధృవిక, నిఖితలు ఇచ్చిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అభిమానులను ఎంతగానో అకట్టుకున్నాయి. చిన్నతనం నుండి నృత్య కలపై ఆసక్తి కలపరుస్తూ ఉన్న చిన్నారులను అభినందిస్తూ ప్రముఖ నాట్య గురువు సజని వల్లభనేని చేతుల మీదుగా మెమొంటోలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

## కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/కొత్తూరు: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో బుడోఖాన్ కరాటే విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం పట్టణంలోని రంగనాయక ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో షాద్‌నగర్‌కు చెందిన యాదవ బూడోఖాన్ కరాటే క్లబ్ ఇంటర్నేషనల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. షాద్‌నగర్, సిద్దాపూర్, కడియాలకుంట తండా, మామిడిపల్లి క్లబ్‌లకు చెందిన విద్యార్థులు పాల్గొని వివిధ కేటగిరిల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. కటాస్, కుమితే, వెప్పెన్ విభాగాల్లో పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలను విద్యార్థులు సాధించారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు మలేషియా దేశానికి చెందిన సీనియర్ కరాటే మాస్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేసి అభినంధించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులతోపాటు బుడోఖాన్ కరాటే క్లబ్ డిప్యూటి గ్రాండ్ మాస్టర్ సాయినాథ్, సీనియర్ మాస్టర్ నరేందర్ నాయక్, ఉత్తేజ్, గోపినాయక్, పిరు నాయక్, వినయ్, రాహుల్‌లు పాల్గొన్నారు.

## గ్రూప్-1 ఉద్యోగం సాధించిన పాత్లావత్ రాజేష్‌కు సన్మానం



ప్రజాపక్షం/షాద్‌నగర్: విద్యకు పేదరికం అడ్డుకారదని నిరూపించి పాత్లావత్ రాజేష్‌ను స్థానిక జర్నలిస్టు మల్లిఖార్జున్ నాయక్ ఘనంగా సత్కరించారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం భీమారం గ్రామానికి చెందిన పాత్లావత్ రాజేష్ ఫతేపూర్ అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో స్థానిక గిరిజన నేతలు పూలమాలలు, శాలుంవాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు మల్లిఖార్జున్ నాయక్ మాట్లాడుతూ విద్యతో పేదరికాన్ని జయించి ఉన్నతమైన స్థానాన్ని పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన యువ నాయకుడు శ్రీనివాస్ నాయక్, ఎల్‌హెచ్‌పిఎస్ నేతలు శంకర్‌నాయక్, అరవింద్ రాథోడ్, వెంకట్, విజయ్, గణేష్, ప్రవీణ్, రమేష్‌లు పాల్గొన్నారు.

## కార్తీక మాస కరపత్రం ఆవిష్కరణ



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నవర క్షేత్రం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో కార్తీక మాస సామూహిక స్వామి వారి వ్రతములు జరుగుతాయని ఆలయ ఛైర్మన్ దేవరం లింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులతో కలిసి కార్తీక మాస కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం లింగారెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ఆక్టోబర్ 22 నుండి నవంబర్ 20 వరకు కార్తీక మాస సామూహిక వ్రతాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి వక్కలంక శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి భాషపాక సంతోష్, సలహాదారులు పూర నరసింహగుప్త, మాజీ చైర్మన్ వసంత్ మనోహర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో వలంటీర్లకు భోజనాల అందజేత



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి ఆరోగ్య కేంద్రం పరిధీలో పని చేస్తున్న వలంటీర్‌లకు లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్, హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆల్పహారంతో పాటు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు అందజేశామని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రంలో వలంటీర్‌లకు ఆల్పహారం, మధ్యాహ్న భోజనం అందజేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మర్రి భాస్కర్, లయన్స్ క్లబ్ సభ్యులు బర్క మల్లేష్ యాదవ్, మారం ప్రసాద్, సింఘుదాసరి రాజశేఖర్, వడ్ల విష్ణుమూర్తి, పీటర్ పాల్గొన్నారు.

## ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం



ప్రజాపక్షం/కొందుర్గు: అన్నదాతలకు ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని బిజెపి కొందుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొందుర్గులో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతోనే పిఎం ధనధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను పెంచడంతో పాటు పంటల్లో వైవిద్య, పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాలు అమలు చేయడం, రైతులకు సాగునీటి సౌకర్యం, నిల్వ రుణాలు, మౌళిక వసతుల అభివృద్ధి, ఔత్సహిక రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందుబాటు, రైతులకు వ్యవసాయ సంబంద ముడి పదార్థాలు, మార్కెట్ రాబడి మెరుగు పర్చుట వంటి అనేక సౌకర్యాలు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. సమావేశంలో తూంపల్లి సత్యనారాయణరెడ్డి, పత్తి శ్రీనివాస్, యాదయ్య, మధు, రైతులు గట్టేపల్లి గోపాల్, ఎల్లయ్య, అంతయ్య పాల్గొన్నారు.

# నగర వ్యాప్తంగా ముమ్మరంగా రోడ్ల మరమ్మతులు





ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ నగర వ్యాప్తంగా ట్రాఫిక్ జామ్‌లు లేకుండా, నగర పౌరుల ప్రయాణం సజావుగా జరిగేలా చూసేందుకు ఉద్దేశించిన రోడ్డు సేఫ్టీ డ్రైవ్ ముమ్మరంగా సాగుతుంది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో జిహెచ్‌ఎంసి రోడ్డు సేఫ్టీ డ్రైవ్ మరింత వేగవంతం చేసింది. జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ వంద శాతం గుంతలు పూడ్చడంపై ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డు భద్రత చర్యలలో భాగంగా గుంతల పూడ్చివేత పనులు, క్యాచ్ పిట్ రిపేర్‌లు, రోడ్ల మరమ్మత్తు పనులు, ప్యాచ్ వర్క్ పనులు, కవర్ రీప్లేస్‌మెంట్‌లు, సెంట్రల్ మీడియన్ మరమ్మతులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. నగర కమిషనర్ కర్ణన్ ఆదేశాల మేరకు జిహెచ్‌ఎంసి చీఫ్ ఇంజనీర్(నిర్వహణ) సహదేవ్ రత్నాకర్ క్షేత్రస్థాయిలో రోడ్డు సేఫ్టీ డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్నారు. నగరంలో మొత్తం 16,541 గుంతలను అధికారులు గుర్తించడం జరిగింది. వాటిలో 14,112 గుంతలకు మరమ్మతులు చేశారు. ఇప్పటి వరకు 771 క్యాచ్ పిట్స్ రిపేర్‌లు, 367 కవర్ రీప్లేస్‌మెంట్‌లు, 18 సెంట్రల్ మీడియన్ మరమ్మతులు పూర్తి అయ్యాయి.

## రైతులకు న్యాయం చేస్తా

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : పరిశ్రమలలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయంచేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఎల్మినేడు గ్రామంలో వివిధ పరిశ్రమలలో భూములు కోల్పోయిన రైతులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి నష్టపరిహారం అందించేటట్లు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి గ్రామంలో నిజనిర్ధారణ కమిటీ అధికారులతో ప్రజల సమక్షంలో సమగ్ర సర్వే నిర్వహించి అర్హులైన రైతులకు నష్ట పరిహారం అందేటట్లు కృషి చేస్తానన్నారు. గ్రామంలో సర్వే నిర్వహించే అధికారులకు సహకరించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మంఖాల శేఖర్‌రెడ్డి, భిరప్ప, గోపాల్, బాల్‌రాజు, శివశంకర్, భిక్షపతి, యాదగిరి రైతులు పాల్గొన్నారు.

## మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకే డిసిసి అధ్యక్షుడి ఎంపిక

ఎఐసిసి రంగారెడ్డి జిల్లా పరిశీలకుడు, ఎంపి సి.రాబర్ట్ బ్రూస్



ప్రజాపక్షం/రంగారెడ్డి: మెజార్టీ సభ్యుల అభిప్రాయం ప్రకారమే జిల్లా కాంగ్రెస్ పార్టీ(డిసిసి) అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందని ఎఐసిసి రంగారెడ్డి జిల్లా పరిశీలకుడు, ఎంపి సి.రాబర్ట్ బ్రూస్ అన్నారు. రంగారెడ్డి డిసిసి ఎన్నికల పరిశీకునిగా నియమితులైన ఆయన ఆదివారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహ్మారెడ్డితో కలిసి గాంధీభవన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండదండగా నిలిచిన, అందరికి ఆమోద యోగ్యుడైన సమర్థుడినే జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడిగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇందుకోసం జిల్లాలోని ఎంపి, ఎంఎల్‌ఎ, సహ నామినేటెడ్ పోస్టుల చైర్‌మెన్‌లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, నియోజకవర్గం, బ్లాక్, మండల స్థాయి అధ్యక్షుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. మెజార్టీ సభ్యుల అభిప్రాయం ప్రకారమే పూర్తి పారదర్శకంగా, ప్రజాస్వామ్య బద్ధంగా డిసిసి అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

**నేడు చేవెళ్ల పార్లమెంట్ నేతలతో...** అక్టోబర్ 13 సోమవారం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధి నేతలతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని రాబర్ట్ బ్రూస్ తెలిపారు. చేవెళ్లలో సమావేశం నిర్వహించి శంకర్‌పల్లి నాయకులతో సమావేశమై, వారి అభిప్రాయాలను తీసుకోవడం జరుగుతుందని రాబర్ట్ బ్రూస్ తెలిపారు. అదేవిధంగా ఈ నెల16న శేరిలింగంపల్లి నియోజకవర్గం నేతలతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలను సేకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఎఐసిసి పరిశీలకులు రాబర్ట్ బ్రూస్‌తోపాటు సభ్యులు అద్దంకి దయాకర్, వినయ్ కుమార్‌రెడ్డి, కోత్వాల్ విజయ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు తమ దరఖాస్తులను స్వయంగా అందజేయవచ్చని తెలిపారు. ఈ నెల 19 వరకు జిల్లాలోని పార్టీ నేతల అభిప్రాయాలను సేకరించి తుది జాబితాను ఎఐసిసికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో టిపిసిసి ఉపాధ్యక్షులు, జిల్లా పరిశీలకుల బృందం సభ్యుడు వినయ్‌రెడ్డి, కర్నే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి





మాజీమంత్రులు హరీష్‌రావు, సబితా

ప్రజాపక్షం/హయత్‌నగర్ : సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు టి.హరీష్ రావు, పి.సబితాఇంద్రారెడ్డిలు తెలిపారు. ఆదివారం హయత్ నగర్ డివిజన్ పరిధిలోని దసరా గుడి ప్రాంగణంలో జరుగుతున్న బొడ్రాయి విగ్రహా ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, స్థానిక ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం విజయవంతంగా నిర్వహించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి, కొప్పుల విఠల్ రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, సాగర్ రెడ్డి. సీనియర్ నాయకులు భాస్కర్ సాగర్, మల్లీశ్వరి రెడ్డి, జక్కిడి రఘువీర్ రెడ్డి, స్కైలాబ్, పారంద రమేష్, సాయిచంటి మరియు బొడ్రాయి ఉత్సవ సమితి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో పలువురికి గాయాలు

ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో బైక్‌ను ఢీకొని పలువురికి గాయాలై సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ఇబ్రహీంపట్నం నుంచి ఎండి. ఫయాజ్ అతడి స్నేహితురాలు బైక్‌పై వస్తున్నారు. గుర్రంగుడ సమీపంలోని యుటర్న్ వద్ద వెనుక నుంచి వస్తున్న కారు అతివేగంతో బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్నేహితురాలను సికింద్రాబాద్‌లోని యశోద, అక్కడి నుంచి ఆర్‌విఎం అసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఫయాజ్‌ను మలక్‌పేట్‌లోని యశోదకు తరలించారు. థార్ కారులో ప్రయణిస్తున్న వారికి గాయాలు కావడంతో బిఎన్ రెడ్డి నగర్‌లోని భృంగి అసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈమేరకు వనస్థలిపురం పోలీసులు సెక్టార్ ఎస్ఐ. జటావత్ రవి నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఇటుకతో భర్తను కొట్టిచంపిన భార్య

ప్రజాపక్షం/కేశంపేట: ఇటుకతో భర్తను భార్య కొట్టిచంపిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కేశంపేట గ్రామానికి చెందిన కొప్పు కుమార్(35) భార్య మాధవితో మద్యం తాగివచ్చి నిత్యం గొడవ పడుతుండేవాడు. శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన నిద్రిస్తున్న సమయంలో సిమెంట్ ఇటుకతో భర్త తలపై మోది చంపి, మృతదేహాన్ని ఇంటి ముందు ఉన్న పంపు గుంతలో పడేసింది. మృతుడి సోదరుడు జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం







ప్రజాపక్షం/షాద్‌నగర్ : పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ చిన్నారులకు సరైన సమయంలో పోలియో చుక్కలు వేయించకుంటే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయని, ఈ విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలని పేర్కొన్నారు. చిన్నారుల బంగారు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఐదు ఏళ్ళ లోపు చిన్నారులకు విధిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి , హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు, స్థానిక నాయకులు చెన్నయ్య, బస్వం, చెంది తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, కొప్పునురి ప్రవీణ్, నక్క బాల్‌రాజ్, యాదగిరి యాదవ్, మాధవులు, ముబారక్ అలీఖాన్, ఖదీర్, ప్రకాష్, రవితేజ, సీతారాములు, లింగారెడ్డిగూడ అశోక్ పాల్గొన్నారు.

**హయత్ నగర్:** మన్సూరాబాద్ డివిజన్‌లో గల మన్సూరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి హాజరై చిన్నారులకు పోలీయో చుక్కల కార్యాక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పోలియో రహిత సమాజం నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల విఠల్ రెడ్డి, ఆనంతుల రాజిరెడ్డి, జక్కిడి రఘువీర్ రెడ్డి, జగదీష్ యాదవ్, రుద్ర యాదగిరి నేత, విజయ్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**శంకర్ పల్లి:** పోలియో మహమ్మారిని నిర్మూలించడానికి తల్లిదండ్రులు తమ పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పిలుపునిచ్చారు. ఆదివారం చేవెళ్ల పట్టణంలో, శంకర్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలియో సెంటర్లో మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూర్త గోవిందమ్మ గోపాల్ రెడ్డి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కా శెట్టి చంద్ర మోహన్, నాయకులు చేగుంట గోపాల్ రెడ్డి వ్యవసాయ కమిటీ డైరెక్టర్లు, ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రేవతి రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**సరూర్‌నగర్ :** నిండు జీవితానికి రెండు చుక్కలు ఎంతో అవసరం అని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్‌కెపురం డివిజన్ పరిధిలోని రామకృష్ణపురం కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పల్స్ పోలీయో చుక్కల కార్యక్రమాన్ని ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పోలీయో చుక్కలను వేయించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోసైటీ పెద్దలు రాజశ్రీరామారావు, పాండు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్ :** చిన్న పిల్లలలో రోగ నిరోధక శక్తి పెరుగుదలకు పోలియో చుక్కలు వేయించాలని బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాల, ఎస్‌కేడి నగర్ డిపిఎస్ స్కూల్, టీచర్స్ కాలనీ వినాయక మండపంలో ప్రభుత్వం చేపట్టిన చిన్నారులను పోలియో చుక్కలు కార్యక్రమంలో పాల్గొని చిన్న పిల్లలకు పోలియో వేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మౌనిక, లేకశ్రీ, అక్సా పాల్, కాలనీ వాసులు కొత్ర శివ కుమార్, పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి, మహేష్ గౌడ్, సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు

**గండిపేట:** పోలియో రహిత సమాజం కోసం అందరం కృషి చేద్దామని ఎర్రోళ్ల వేణు కుమార్ అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపల్ పరిధిలోని నేక్నంపూర్ బస్తి దువాఖానలో పోలియో చుక్కల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు పోలీయో చుక్కలు వేయించాల్సిన బాధ్యత ప్రతి తల్లి తండ్రి పైన ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ పూజ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు









## బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** వీపనగండ్ల మండలంలోని బొల్లారం చౌరస్తా నుండి యన్మన్ బెట్ల క్రాస్ రోడ్ వరకు రెండు కిలోమీటర్ల మేర బ్లాక్‌టాప్ (బీటీ) రోడ్డు పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ మార్గంలో రోజూ ప్రయాణించే వాహనదారులకు ఇది ఎంతో ఊరటనిచ్చే అంశంగా నిలిచింది. ఇప్పటివరకు మట్టి రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉండడంతో, వర్షాకాలంలో మరింత కష్టాలు తలెత్తేవి. అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో ప్రయాణం నరకంగా మారింది. ప్రస్తుతం జరుగుతున్న బీటీ రోడ్డు పనులు పూర్తయితే కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, శ్రీశైలం, నాయినోనిపల్లి మైసమ్మ వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు దూర భారం తగ్గుతుందే కాదు, ఇంధన వ్యయాన్ని కూడా తగ్గించే అవకాశ ముంది. ఈ ప్రాంత వాణిజ్య కార్యకలాపాల వేగం పెరిగే అవకాశం కూడా ఉన్నది. పనులు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు, వాహనదా రులు అధికారులపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిరకాలంగా ఎదురుచూ సిన ఈ రోడ్డు నిర్మాణం ఎట్టకేలకు మొదలవడంతో వాహనదారులు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## టిపిఆర్‌పిలోకి రిటైర్డ్ ఐఎఎస్ కూనపరెడ్డి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** అనేక రాష్ట్రాల్లో ఐఎఎస్ అధికారిగా సేవలందిం చిన ప్రస్తుత రిటైర్డ్ ఐఎఎస్ కూనపరెడ్డి హరిప్రసాద్ తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ (టిపిఆర్‌పి)లో చేరారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్ పార్టీ రాష్ట్రకార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు జలకం రవికుమార్ ఆయనకు కండు వాను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ విధివిధానాలు నచ్చి, పార్టీలో చేరా నని తెలిపారు. రానున్న స్థానిక సంస్థలు, హైదరాబాద్ మున్సిపాల్టీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా తమ పార్టీ పాలనను రాష్ట్రానికి చూపిస్తామని తెలిపారు.

## క్రీడా రంగంలో సత్తా చాటిన కూకట్‌పల్లి బతుకమ్మకుంట స్కేటింగ్ రింక్..



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** తెలంగాణ రోల్లర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన స్కేటింగ్ క్రీడా పోటీలో కూ కట్‌పల్లికు చెందిన బతుకమ్మకుంట స్కేటింగ్ రింక్ కోచ్ బాషాకు చెందిన బహబూబ్‌నగర్ స్టూడెంట్స్ విజయం సాధించారు. ఇందులో 18మంది స్టేట్ లెవెల్, 5మంది నేషనల్ లెవెల్‌కి సెలెక్ట్ కావడం జరిగింది. స్టేట్ లెవెల్ కాంపి టేషన్‌లో బహుమతి సాధించిన వారిలో దేవాన్ష్ 1 గోల్డ్, 1 సిల్వర్, బ్రాహ్మి ని 3 సిల్వర్, అనిరుద్ 1 గోల్డ్, 1 సిల్వర్, సంన్విత 2 గోల్డ్, 1 సిల్వర్, ఇషిత 2 బ్రోంజ్, 1 సిల్వర్, తనిషి 1 సిల్వర్ మెడల్స్ పొందారు. కోచ్ బాషా మా ట్లా డుతూ ప్రతి సారి 8 సంవత్సారాలలోపు 8 నుండి 10మంది బతుకమ్మకుంట స్కేటింగ్ రింక్ నుంచి నేషనల్‌కి సెలెక్ట్ కావడం ఆనందంగా ఉందన్నారు.

## సిసి కెమెరాలతోనే నేర నియంత్రణ



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, నింధితుల ను గుర్తించ డానికి సీసీ కెమెరాలు ఉపయోగప డుతా యనీ మోమిన్ పేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. వెంకట్ అన్నారు. ఆదివారం ఆయన ఓ ప్రక టనలో మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో సీసీ కెమోరాలు అందుబాటులోని వస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నేరాల ను నియంత్రించేందుకు, అసాంఘిక కార్యకలాపా లు జరగకుండా ప్రశాంత మైన వాతవరణం కల్పించడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కు కృషి చేయాలనీ అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించి వ్యాపారస్తులు బ్యాంకులు, పెట్రోల్ బంకులు, దుకాణాలు, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, వీధులు, కాలనీ వద్ద సీసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసి కెమె రాలు నేటి కాలంలో నేర నియంత్రణలో అత్యంత సమర్థవంతమైన ఆయు ధంగా పని చేస్తుందన్నారు. దీనివలన నేరాలు జరిగే అవకాశం తగ్గుతుంది. నిందితులను త్వరగా గుర్తించేందుకు సహాయపడుతుం ది. ప్రజల్లో భద్రత పెరుగుతుంది. అంతేకాకుండా పోలీస్ విచారణకు విలువైన ఆధారాలు లభి స్తాయి. గ్రామ ప్రజలు సంబంధిత ఎస్సైలు బీట్ అధికారులు ప్రజలకు మా ర్గదర్శకత్వం అందిస్తారు. అవసరమైతే పోలీస్ శాఖ సాంకేతిక బృందం సల హా ఇస్తుంది. అందువలన ప్రతి పౌరుడు తన ప్రాంత భద్రత కోసం ముం దుకు వచ్చి గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు.

## నిండు జీవితాలకు రెండు పోలియో చుక్కలు



**ప్రజాపక్షం/నాగారం :** నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో మేలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆది వారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి,సత్యనారాయణ కాల నీలు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు పల్స్ పోలియో కార్య క్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేసి పోలియో రహిత సమా జాన్ని స్థాపిద్దామని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ మల్లే ష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు కౌకుట్ల అనంత్‌రెడ్డి,మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, అన్నం రాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 18న తాండూరు బంద్

బిసి సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/తాండూరు :** స్థానిక సంస్థల్లో 42శాతం బిసి రిజర్వేషన్లపై హై కోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18న చేపట్టిన రాష్ట్ర బంద్ కార్యక్రమంలో భాగంగా తాండూరు బంద్‌కు పిలుపునిచ్చినట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందు కూరి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షు డు, రాజ్య సభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర బంద్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న తాండూరు బంద్‌కు పిలుపునిచ్చిన ట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పోస్టర్‌ను సైతం ఆవిష్కరించారు. అయితే ఈ నెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అని వార్య కారణాల వల్ల అట్టి కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ బంద్‌లో అందరు స్వచ్ఛందంగా పాల్గొని బంద్‌ను విజయ వంతం చేయాలని కోరారు.

## అట్టహాసంగా వాక్ థాన్

**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు పట్టణంలో మార్వాడి యువమంచ్ ఆధ్వర్యాన అవాక్ థాన్ కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టారు. మార్వాడి యువమంచ్ జాతీయ కార్యక్రమంలో భాగంగా తాండూరు శాఖ ఆధ్వర్యాన ఆదివారం వాక్‌థాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. తాండూరు మంచ్ వ్యవస్థాప కులు విజయ ప్రకాష్ సార్డా జెండా ఊపి నడకను ప్రారంభించారు. ఈ నడ క తాండూరు పట్టణలోని పలు వీదుగా ర్యాలీ చేపట్టారు. మార్వాడి పెద్దలు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మార్వాడి యువమంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్ సార్డా మాట్లాడుతూ నడకతో మంచి ఆరోగ్యాన్ని సంపాదించుకోవచ్చునని అన్నారు. ప్రతి ఒక్కరు ఉదయం నడకను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో మంచ్ అధ్యక్షులు రోహిత్ అగ్రవాల్, మాజీ అధ్యక్షులు సూర్యప్రకా ష్‌సోమాని, కార్యక్రమ చైర్మన్‌లు దీపక్, పర్తానీ, రాకేష్‌బూబ్,, మధుసోని, ముఖేష్ సోమాని, కిషన్ రాఠి, రోహిత్ సోని, నిహార్ సోమాని, లక్ష్మి నారా యణబూబ్ తిదితరులు పాల్గొన్నారు.

## దేవాలయంలో చోరీ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవా లయంలో చోరీ జరిగింది. మల్లాపూర్ డివిజన్ గోకుల్‌నగర్‌లోని మాత జగ జ్జనని ముగ్గురు అమ్మల ఆలయ పూజారి శివరామప్రసాద్ అందించిన ఫిర్యాదు మేరకు గత శనివారం సాయంత్రం పూజల అనంతరం యథావి ధిగా గుడికి తాళాలు వేసి తన నివాసానికి వెళ్లాడు. ఆదివారం ఉదయం గుడికి వచ్చి చూడగా తాళాలు విరిగి పోయినట్లు గమనించి లోపలికి వెళ్లి చూడగా అమ్మవారికి చెందిన 5 గ్రాములకు పైగా ఉండే మంగళ సూత్రాలు, ముక్కు పోగు, ఒక గొలుసు చోరీకి గురైనట్లు గమనించి అందించిన ఫిర్యా దుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# సత్తా చాటిన సైబర్ క్రైమ్ పోలీసులు

● నెల రోజుల్లో 222 ఎఫ్ఐఆర్‌లు ● 8 రాష్ట్రాల నుండి 59 మంది అరెస్టు ● రూ.86.64 కోట్లు రికవరీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ క్రైమ్ కేసులలో హైద రాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సత్తా చాటారు. సెప్టెం బర్ మాసంలో నమోదైన 222 కేసుల్లో 59 మంది నింది తులను ఎనిమిది రాష్ట్రాలో దాడులు చేసి అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.86,64,827 రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. నమోదైన కేసులలో పెట్టుబడి మోసాలు 28, డిజిటల్ అరెస్ట్ 6, పార్ట్‌టైమ్ ఇన్వెస్ట్‌మెంట్ 4, మ్యా ట్రిమోనియల్ మోసం 2, క్రెడిట్ కార్డ్ మోసం 4, సిని మా పైరసీ3, ఉద్యోగ మోసం1, ట్రేడింగ్ మోసం 1, సోషల్ మీడియా సంబంధిత 4, సోషల్ మీడియా చిట్కా లైన్ 1, అనధికార లావాదేవీలు 3, ఇతర కేసులు 2 ఉన్నాయి. ఇక పట్టుబడిన నిందితులకు నేర చరిత్ర ఘనంగానే ఉంది. వీళ్ల ఆంధ్రప్రదేశ్ 09, అస్సాం 02, బీహార్ 04, ఢిల్లీ 12, గుజరాత్ 15, హర్యానా 04, హిమాచల్ ప్రదేశ్ 02, జమ్మూ కాశ్మీర్ 02, జార్ఖండ 03, కర్ణాటక 38, కేరళ 06, మధ్యప్రదేశ్ 03, మహారాష్ట్ర 53, మేఘాలయ 01, ఒడిశా 02, పంజాబ్ 02, రాజ స్థాన్ 04, తమిళనాడు 07, ఉత్తర ప్రదేశ్ 09, ఉత్తరాఖండ 02, పశ్చిమ బెంగాల్ 03, తెలంగాణ 74 కేసులలో నిందితులుగా ఉన్నారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల విచారణలో ఈ నిందితులు భారత దేశం అంతటా మొత్తం 257 కేసులలో ప్రమేయం ఉన్నట్లు తేలింది. వీటిలో తెలంగాణలో 74 కేసులు ఉన్నాయి. అరెస్టు చేసిన నిందితుల నుంచి 48 మొబైల్ ఫోన్లు, 9 చెక్కు పుస్తకాలు, 8 పాస్ బుక్‌లు, 23 ఎటిఎం డెబిట్ కార్డులు, 4 ల్యాప్‌టాప్‌లు, 21 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఏఏ కేసు లలో ఎంతెంత రికవరీ చేశారనే వివరా లను ఒకసారి పరిశీలిస్తే ఇలా ఉన్నాయి. పెట్టుబడి మోసం కేసులో రూ.58,47,595, ఒటిపి మోసం రూ. 5,21,150, అనుకరణ మోసం రూ. 1,13,000, ఎపికె మోసం రూ.50,000, ట్రేడింగ్ మోసం రూ. 12,43,111, క్రెడిట్ కార్డ్ మోసం రూ. 2,58,635డిజిటల్ అరెస్ట్ రూ. 3,34,065, ఉద్యో గ మోసం రూ. 1,78,500, ఎన్‌సిఆర్‌పి రూ. 1,18, 771 మొత్తం రూ. 86,64,827 రికవరీ చేయడం రికా ర్డు సృష్టించారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు.

**ముందస్తు జాగ్రత్తే మేలు: డిసిపి డి.కవిత**

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. సెల్‌ఫోన్‌కు వచ్చే ఎలాంటి ఒటిపిలను ఇతరులతో పంచుకోవద్దు. తమ వ్యక్తిగత వివరాలను కూడా వెల్లడించకూడదు. ఫలానా బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని వివరాలు చెప్పాలని కూడా నిందితులు ఫోన్‌లు చేస్తున్నారని అలాంటి వాటికి సమాధానం చెప్పకూడదు. ఇక ఫేక్ యాప్స్ లింక్స్ కూడా ఓపెన్ చేయకూడదు.

## కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ షురూ

ఏఐసిసి పరిశీలకులు అంజలి నింబాల్కలర్ పర్యటన



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** అధికార కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్ష (డిసిసి ) పదవికి అర్హులను నియామక ప్రక్రియ చురుకుగా కొనసాగుతోంది. దీనిలోని భాగంగా ప్రత్యేకంగా నియమించిన ఏఐసిసి పరిశీలకులు అంజలి నిం బాల్కలర్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఆశావహుల నుండి ధరఖాస్తులు తీసుకొని ఒకరి కంటె ఎక్కువ గా ఉంటే వారిపై నియోజకవర్గాల వారీగా సమా వేశాలు నిర్వహించి అభిప్రాయ సేకరణ ద్వారా ముగ్గురి జాబితాను తయారు చేసి తుది నిర్ణయం కోసం ఏఐసిసికి పంపిస్తారు. జిల్లాలో ఎలాగైనా ఈ పదవిని దక్కించుకొనేందుకు జిల్లాలోని ప్ర ముఖ సీనియర్ నేతలైన ప్రస్తుత డిసిసి అధ్యక్షు డు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ పార్టీ ఇన్ చార్జి వజ్రేష్ యాదవ్, ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన నక్క ప్రభాకరరెడ్డిలతో పాటు మరో ఇద్దరు తీవ్రం గా యత్నిస్తున్నట్లు సమాచారం. ఆశావహులం తా పిసిసి నేతలు, మంత్రులతో తమకున్న సన్ని హిత సంబంధాలతో ఎలాగైనా డిసిసి అధ్యక్ష పద వని పొందేందుకు పావులు కదుపుతున్నారు. రా ష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ కాంగ్రెస్ పార్టిని బలో పేతం చేయటం ద్వారా రానున్న అన్ని ఎన్నికల్లో నూ విజయ ఢంకా మోగించాలన్న జాతీయ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. దీని లోని భాగంగా ప్రతి జిల్లాకు ఏఐసిసి ప్రత్యేకంగా నియమించిన పరిశీలకులు ఆయా జిల్లాలో ప ర్యటిచంటం ద్వారా ఆశావహుల నుండి ఈ నెల 19 వరకు ధరఖాస్తులను తీసుకోనున్నారు., ధర ఖాస్తులు చేసుకొన్న వారిలో ముగ్గురిని ఎంపిక చేసి ఏఐసిసికి పంపేందుకు జిల్లాలోని అన్ని ని యోజకవర్గాల్లో బ్లాక్‌ల వారీగా సమావేశాలు ని ర్వహించి అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. శని వారం నుండే ఏఐసిసి మేడ్చల్ జిల్లా పరిశీలకులు అంజలి నింబల్కర్ సోమవారం అంతాయిపల్లి లోని ఎస్ఆన్ఆర్ కన్వెన్షన్ హాలులో కాంగ్రెస్ నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు.

## కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్యకార్యాచరణ కమిటీ ఎన్నిక

కొడంగల్ అభివృద్ధిని తరలించొద్దు



**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్న మెడికల్ కాలేజ్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఇక్కడి నుంచి తరలించడంపై కొడంగల్ వాసులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం పట్ట ణంలోని రెడ్డి బసిరెడ్డి పంక్షన్ హాల్‌లో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి న అనంతరం పలు కీలక అంశాలపై చర్చించి కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్యకార్యాచరణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా వ్యాపార వేత్త లక్ష్మి నారాయణగుప్తా, కోకన్వీనర్‌గా సిపిఐ నియోజకవర్గ నా యకులు గంటి సురేష్‌కుమార్, బిఆర్ఎస్ నాయకులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, టిడిపి నాయకులు శాంత్‌కుమార్, అంబేద్కర్ తాలుక సంఘం అధ్యక్షుడు రమేష్ బాబు, ముస్లీం మైనార్టీ నాయకుడు ఎస్ఎం గౌసన్, నవతెలంగాణ రిపోర్టర్ వెంకట్‌రామ్‌రెడ్డి, అనిల్‌కుమార్, అరుణ్‌కుమార్, పవన్ లహోటిలతో పాటు పలువురితో కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవి భాద్యతలు స్వీకరిం చి కొడంగల్‌కు నిధుల వరాల జల్లులు కురిపించి ప్రజలను మోప్పించేందుకు కొడంగల్‌కు మెడికల్ కాలేజ్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురకుల పాఠ శాలలు, స్కిల్ యూనివర్సిటి వంటి అనేక రకాల అభివృద్ధి పనులు తీసుకువ చ్చామని ప్రగల్భాలు పలికి ప్రజలను నమ్మించడం జరిగిందన్నారు. ఇందులో బాగంగానే తీరా రైతుల నుంచి బలవంతంగా భూ సేకరణ చేసి నష్టపరిహారం అందించి పనులు ప్రారంబించి తిరిగి అట్టి అభివృద్ధి పనులను నిలిపివేసి వేరే ప్రాంతాలకు తరలించే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. కొడంగల్ లో జరుగుతున్న అభివృద్ధి పనులు యధావిధిగా జరగాలని మెడికల్ కాలేజ్, సమీ కృత గురుకుల పాఠశాలలను రేవంత్‌రెడ్డి తరలించే కుట్రను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా కొడంగల్ ప్రజలు తిరుగుబాటు చేయకతప్పదని హెచ్చరించారు. సమావేశంలో నిఖిల్, అమీద్, పవన్, ఆరీఫ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పోలియో మహమ్మారిని అంతం చేయటమే లక్ష్యం

డిఎంహెచ్ఒ డా.ఉమాగౌరి వాడవాడలా పోలియో చుక్కల పంపిణీ





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ మ ల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆది వారం పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎం హెచ్ఒ) ఉమాగౌరి పర్యవేక్షణలో మున్సిపల్ కార్యాలయ అధికార్లు, సిబ్బంది. జిల్లా ఇమ్యూని జేషన్ సిబ్బంది. పిహెచ్‌సి సిబ్బంది. స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ విద్యార్థులు, పారా మెడికల్ సి బ్బంది, అంగన్వాడి, ఆశా వర్కర్లు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకొ న్నారు. జిల్లాలో 125 బూతులు, 31 మొబైల్ బృందాల ద్వారా ఏర్పాట్లు చేసారు. మైగ్రెంట్ జ నాభాకు చెందిన పిల్లలు,హైరిస్క్ ప్రాంతాల్లో ఉన్న పిల్లలకు గాను పోలియో చుక్కలు వేసేందు కు మొబైల్ బృందాలు అక్కడికి వెళ్లి పోలియో చు క్కలు చేస్తున్నారని డిఎంహెచ్ఒ తెలిపారు. సోమ వారం నుండి బుధవారం వరకు మూడు రోజుల పాటు ఇంటింటికి వెళ్లి ఇళ్లలో ఉండే చిన్నారులకు అక్కడికక్కడే పోలియో చుక్కలు వేస్తారన్నారు. జిల్లాను పోలియో రహిత జిల్లాగా చేయటమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. జిల్లా వైద్యాచోగ్య శా ఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో వైద్యు లు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొనగా ఆ యా ప్రాంత ప్రజాప్రతినిధులు ప్రారంభించి పోలియో చుక్కలను పిల్లలందరికి వేయాలని సూ చించారు. ఉప్పల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జా తీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభిం చి ఐదేళ్ల లోపు వయస్సన్న ప్రతి చిన్నారికి విధిగా పోలియో చుక్కలు వేయించి పోలియో వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యలలతో పోలి యోను పూర్తిగా నిర్మూలించటంలో బాధ్యతగా ఉ ండాలన్నారు. ఉప్పల్ భగాయత్ సంక్షేమ సం ఘం ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాలులో, ఓల్డ్ రా మంతాపూర్, శారదానగర్ కమిటి హాలు, అంగన్ వాడి కేంద్రాల్లో స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతి చిన్నారి ఆరో గ్యంతో పాటు సమాజ భవిష్యత్తు కోసం తప్పనిస రిగా ఐదేళ్ల లోపున్న వయసున్న చిన్నారులందరికి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైష్ణవి తదితరులు పాల్గొ న్నారు. మల్లాపూర్ డివిజన్‌లోని అంబేద్కర్‌భవన్ లో డాక్టర్ ధరణిరెడ్డి వెంకటమ్మ, సువర్ణ, వాణి, రమాదేవి, వాసుదేవ్, తదితరులతో స్థానిక కార్పొ రేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## 'పటేల్ గెజిట్ సాధనే లక్ష్యంగా ఉద్యమిస్తాం'



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** త్వరలో మున్నూరుకాపుల బాలబాలిక వసతి గృహం కల్పనకు, పటేల్ గెజిట్ సాధనే లక్ష్యంగా ఉద్యమిస్తామని మున్నూ రుకాపు పటేల్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీరటి రాంప్రసా ద్ పటేల్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ము న్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మ ణ్ పటేల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మున్నూరుకాపులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదన్నారు. కేబినెట్‌లో మున్నూరుకాపులకు అవకాశం ఇవ్వకపోవ డం బాధాకరమన్నారు. 25శాతంపైగా ఉన్న మున్నూరుకాపులకు కార్పొరేష న్ ఏర్పాటుచేసి, ఏడాదికి రూ.1000 కోట్ల బడ్జెట్ విడుదల చేయాలని డిమాం డ్‌చేశారు. ఇకనైనా ప్రభుత్వం మున్నూరుకాపులపై నిర్లక్ష్య వైఖరి మారకొంటే సిఎం, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సం ఘం నేతలు శ్రీపతి సురేశ్‌కుమార్ పటేల్, శివ, అయిత ప్రశాంత్, ఆకుల వెంకటేశ్, సోమశెట్టి రాజేశ్, తోట సాయి, పి.అరుణ్‌కుమార్, దాదె వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా రైళ్లు రద్దు..

రైలు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే అలెర్ట్..



**హైదరాబాద్:** రైలు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే అలెర్ట్ జారీ చేసింది. వారం రోజుల పాటు 32 రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అదే సమయంలో పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతో పాటు రీషె డ్యూల్ చేసినట్లు తెలిపారు. ఈ వచ్చే శనివారం వరకు అమలులో ఉంటా యని చెప్పారు. డోర్నకల్‌–పాపటపల్లి మార్గంలో మూడో లైన్ మరమ్మతులు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఆయా రైలు సర్వీసులపై ప్రభావం పడనుం దని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. విశాఖపట్నంన్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్, స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్‌గుంటూరు ఇంటర్‌సిటీ, పూరిఓకా ద్వారకా ఎక్స్‌ప్రెస్, డోర్నకల్‌కాజీపేట, విజయవాడడోర్నకల్ మధ్య నడిచే మెమో ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు చెప్పింది. అలాగే, పలు ప్రధాన రైళ్లను అధికారులు రీషెడ్యూల్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆదిలా బాద్‌తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల13, 16, 17 తేదీల్లో గంటన్నర ఆల స్యంగా బయలుదేరుతుందని చెప్పారు. విశాఖపట్నంసికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 15, 16, 18 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా వెళ్తుందని అధికారులు తెలిపారు. సికింద్రాబాద్‌గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 14 నుంచి 18 వరకు కాజీపేటగుంటూరు మధ్య పాక్షికంగా రద్దు చేశామని.. ఈ రైలు కేవలం సికింద్రాబాద్‌కాజీపేట మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తుందని అధికారులు వివరించారు.

## 'బంతి' సాగు సులభం... ఆదాయం ఘనం

శుభాకార్యాల్లో తనదైన స్థానం, హైదరాబాద్ వంటి పట్టణాలకు తరలింపు



**ప్రజాపక్షం/వికారాబాద్ :** తక్కువ పెట్టుబడి అధిక లాభాలు పంచే బంతి సాగు వైపు రైతులు మొగ్గు చూపు తున్నారు. పెద్దగా చీడపీడల బెడత లేకపోవడం తక్కువ వ్యవధిలో దిగుబడి వస్తుండటంలో అసక్తి పెరుగుతు న్నది. వికారాబాద్ జిల్లాలో దాదాపు 100 ఎకరాలకు పైగా బంతి సాగువుతోంది కొందరు రైతులు ప్రధాన పంటగా బంతిని సాగు చేస్తుంటే ఇంకొందరు అంతర పంటగా బంతిని సాగు చేస్తున్నారు. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లకు ఉత్సవాలు, శుభకార్యాల తరుణంలో బంతి పులకు బాగా డిమాండ్ ఉంటుంది. సెప్టెంబర్,ఆక్టోబర్ , నవంబర్‌లో వచ్చే పండుగలు, శుభకార్యాలకు కోత వచ్చేలా రైతులు ప్రణాలికగా బంతిని సాగు చేస్తారు. వికారాబాద్ జిల్లాలో కోట్‌పల్లి , పూడుర్ ,మోమిన్ పేట్, నవాబ్‌పేట్, మర్పల్లి, తాండూర్‌లో కొన్ని మండ లలో కూడా సాగు చేస్తున్నారు. బంతికి హైదరాబాద్ లోనే మార్కెటింగ్ సదుపాయం ఉంది. బడా వ్యాపారు లు బంతి సాగు చేసిన రైతులను ఫోన్ ద్వారా సంప్రది స్తారు. పూల తోటల నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చే స్తారు. రైతులు సాధారణంగా దసరా, దీపావళి పండు గలు ఫోకస్‌గా బంతి సాగుచేస్తారు. దసరా తరుణంలో ఒకసారి, దీపావళికి మరోసారి. పూలుకోసి విక్రయిం చేలా ప్రణాళిక చేస్తారు. బతుకమ్మ దసరా పండుగలు శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ధర కూడా అశించినట్లు ఉండటంతో ఈ సారి లాభాలు భాగున్నా యని రైతులు పేర్కొంటున్నారు. ఎకరానికి అన్ని ఖర్చులు పోగా రెండు లక్షల వరకు ఆదాయం సమకు రుతుందంటున్నారు. బంతి ఎకరానిక ఏడు టన్నుల దిగుబడి వస్తుంది. పత్తి మాదిరిగా తెగుళ్ల బెడత ఉండదు తక్కువ వ్యవధిలో లాభాలు వస్తుండటంతో దాదాపు దశాబ్దాల నుంచి జిల్లా రైతంగం ఇటువైపు మొగ్గుతున్నారు. ఎకరం బంతి సాగుకు రూ.50 వేల దాకా పెట్టుబడి అవుతుంది. ప్రస్తుత మార్కెట్ ధరలు పరిశీలిస్తు హోల్‌సేల్‌గా కిలో బంతి పూలు రూ. 50 నుండి 80దాక రిటైల్‌లో తోట వద్ద రోడ్డు పక్కన రూ. 75 నుంచి 150 వరకు అటు ఇటుగా ధరలు పలుకు తున్నాయి. ఎకరం సాగు ద్వారా సగటు రూ.4లక్షల నుంచి రూ.6.లక్షల దాకా అదాయం సమకూరుతుంద ని చెబుతున్నారు. ఉద్యాన రైతులకు ప్రభుత్వం ఎకరా నికి రూ.8వేల వరకు ప్రోత్సహం అందిస్తుంది. అని ఉద్యాన వాన జిల్లా అధికారి సత్తర్ తెలిపారు.

క్రీడ

# హేలీ విధ్వంసం

## భారత్‌కు వరుసగా రెండో ఓటమి




మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భారత జట్టుకు మరోషాక్. విశాఖపట్టణంలో వరుసగా రెండో ఓటమి ఎదురైంది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన పోరులో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓపెనర్ల మెరుపులతో టీమిండియా భారీ స్కోర్ చేసినా.. ఎలీసా హెలీ(142) సెంచరీతో చెలరేగి లక్ష్యాన్ని కరిగించింది. ఆమెకు ఎలీసా పెర్రీ(47 నాటౌట్), గార్డ్‌నర్ (45)లు తోడవ్వా ఆస్ట్రేలియా వన్డే చరిత్రలో అత్యధిక పరుగుల ఛేదనతో ఆసీస్ జట్టు రికార్డు నెలకొల్పింది. స్నేహ్ రానా ఓవర్లలో పెర్రీ సిక్సర్‌తో కంగారూ టీమ్‌కు చిరస్మరణీయ విక్టరీని అందించింది. సొంతగడ్డపై జరుగుతన్న వరల్డ్ కప్‌లో టీమిండియాకు మరో భంగపాటు. దక్షిణాఫ్రికా చేతిలో చేజారిన ఓటమిని మరువక ముందే ఆస్ట్రేలియా దెబ్బకు మరో పరాజయం ఎదురైంది. వన్డేల్లో భారీ ఛేదనకు దిగిన ఆసీస్‌కు కెప్టెన్ ఎలీసా హేలీ (142) శతకంతో గట్టి పునాది వేసింది. పవర్ ప్లే తర్వాత డేంజరస్ ఓపెనర్ ఫొబె లిచ్‌ఫీల్ (40)ను ఔట్ చేసిన శ్రీచరణి ఈసారి అనాబెల్ సథర్‌లాండ్‌ను క్లీన్ బౌల్డ్ చేసింది. దాంతో.. వరుస ఓవర్లలో రెండో వికెట్ కోల్పోయింది. అంతకుముందు దీప్తి శర్మ ఓవర్లో మిడాన్ దిశగా షాట్ ఆడిన బేత్ మూనీ(4)ని డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపింది జెమీమా. బంతిని గమనించిన జెమీమా ఎడమవైపు డైవ్ చేస్తూ రెండుచేతుల్తో క్యాచ్ అందుకుంది. దాంతో, 68 వద్ద రెండో వికెట్ కోల్పోయింది. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే శ్రీచరణి వికెట్ తీయడంతో ఆసీస్ ఒత్తిడిలో పడింది. వికెట్లు పడుతున్నా హేలీ మాత్రం జోరు తగ్గించలేదు. సెంచరీ తర్వాత మరింత దంచేసిన ఆమె 38వ ఓవర్ ఐదో బంతికి కవర్స్‌లో షాట్ ఆడింది. అక్కడే కాచుకొని ఉన్న స్నేహ్ రానా ముందుకు డైవ్ చేస్తూ ఒంటిచేత్తో ఒడుపుగా క్యాచ్ అందుకుంది. రీప్లేలోనూ ఫేర్ క్యాచ్ అని తేలడంతో ఆసీస్ కెప్టెన్ నిరాశగా పెవిలియను చేరింది. కీలక వికెట్ తీసిన చరణి.. 96 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యాన్ని ముగించింది. 39 ఓవర్లకు కంగారూ టీమ్ స్కోర్ 265–4. ఇంకా విజయానికి 65 రన్స్ కావాలంతే. తహ్లియా మెక్‌గ్రాత్‌ను దీప్తి ఎల్బీగా ఔట్ చేయగా టీమిండియా రేసులోకి వచ్చింది. గార్డ్‌నర్‌ను అమన్‌జోత్ బౌల్డ్ చేయగా ఆరో వికెట్ పడడంతో సమీకరణం 30 బంతుల్లో 35కు చేరింది. కానీ, ఎలీసా పెర్రీ(47 నాటౌట్).. కిమ్ గార్త్ (14)లు క్రాంతి వేసిన 47వ ఓవర్లో చెరొక ఫోర్ బాదారు. పెర్రీ సిక్సర్‌తో జట్టుకు మూడు వికెట్ల విజయాన్ని అందించింది. దాంతో.. టీమిండియాకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది.

### మంధాన, ప్రతీకా ఫిఫ్టీ

మహిళల వన్డే వరల్డ్ కప్‌లో తొలి ఓటమి నుంచి తేరుకున్న భారత జట్టు భారీ స్కోర్ చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (80), ప్రతీకా రావల్ (75) దంచికొట్టడంతో ఆస్ట్రేలియాకు సవాల్ విసిరే లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి వికెట్‌కు వీరిద్దరూ 155 రన్స్ జోడించి బలమైన పునాది వేశారు. ఆ తర్వాత జెమీమా రోడ్రిగ్స్ (33), రీచా ఘోష్ (32)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో స్కోర్ 300 దాటించారు. అప్పటికి చేతిలో ఆరు వికెట్లు ఉండడంతో స్కోర్ 350 దాటడం ఖాయమనిపించింది. కానీ, టెయిలెండర్లు అనవసర షాట్లకు యత్నించి చకచకా పెవిలియన్ చేరారు. 49వ ఓవర్లో క్రాంతి గౌడ్ వికెట్ తీసిన సథర్‌లాండ్ ఆ తర్వాతి బంతికే శ్రీచరణిని క్లీన్ బౌల్డ్ చేయడంతో 330 వద్ద టీమిండియా ఇన్నింగ్స్ ముగిసింది.

# స్మృతి సంచలనం

ఒకే ఏడాదిలో వెయ్యి పరుగులు..

తొలి బ్యాటర్‌గా చరిత్రకెక్కిన మంధాన..



భారత ఓపెనర్ స్మృతి మంధాన రికార్డుల వెల్లువ కొనసాగుతోంది. భీకర ఫామ్‌లో ఉన్న ఈ లెఫ్ట్ హ్యాండర్ వరల్డ్ కప్‌లో అర్ధ శతకంతో మరో మైలురాయిని అధిగమించింది. ఈ ఏడాది వన్డేల్లో వెయ్యి పరుగులు పూర్తి చేసుకుంది విధ్వంసక ఓపెనర్. దాంతో, మహిళా క్రికెట్ చరిత్రలో ఒక క్యాలండర్ ఇయర్‌లో ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా కొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ ఏడాది వన్డేల్లో వెయ్యి పరుగులతో ఆస్ట్రేలియా దిగ్గజం బెలిండా క్లార్క్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును బద్ధలు కొట్టింది బ్యాటింగ్ క్వీన్. ఆసీస్ వెటరన్ అయిన క్లార్క్ 1997లో 970 రన్స్‌తో చరిత్ర సృష్టించింది. అప్పటినుంచి.. దాదాపు 27 ఏళ్లుగా




చెక్కు చెదరని రికార్డును మంధాన బ్రేక్ చేసింది. మొత్తంగా 18 ఇన్నింగ్స్‌ల్లో మంధాన 59.00 సగటుతో 1,062 పరుగులు సాధించింది.

### ఆస్ట్రేలియాపై రెండు సెంచరీలతో

ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్న మంధాన పరుగుల వరద పారిస్తోంది. వరల్డ్ కప్ ముందే ఆస్ట్రేలియాపై రెండు సెంచరీలతో కదం తొక్కిన ఈ డాషింగ్ బ్యాటర్ మెగా టోర్నీ తొలి రెండు మ్యాచుల్లో నిరాశపరిచింది. కానీ, వైజాగ్‌లో ప్రతీకా రావల్‌తో కలిసి ఆసీస్ బౌలర్లను ఉతికేస్తూ జట్టుకు శుభారంభం ఇచ్చిన మంధాన సెంచరీ ముందు ఔటయ్యింది. లేదంటే.. ఈ ఏడాది నాలుగు సెంచరీలతో రెండో స్థానంలో ఉన్న ఆమె తంజిబ్ బ్రిట్స్ రికార్డును సమం చేసేది. హాఫ్ సెంచరీ తర్వాత వెనుదిరిగిన మంధాన వన్డేల్లో 5వేల పరుగుల క్లబ్‌లో చేరింది.

ఆరోగ్యం


ఫోకస్

# కీళ్ల నొప్పులకు మెరుగైన వైద్యం



ఒకసారి మొదలైతే, జీవితాంతం వేధించే కీళ్ల నొప్పులకు మెరుగైన చికిత్స సమీప భవిష్యత్తులో అందుబాటులోకి రానుంది. వైద్య రంగంలోనే విప్లవాత్మక ఆవిష్కరణగా చెప్పుకోదగిన పరిశోధనలో, 'టైనీ డాన్సింగ్ మాలిక్యూల్స్' (నాట్యం చేసే సూక్ష్మ అణువులు)ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇవి మన శరీరంలో కదులుతూ, దెబ్బతిన్న భుజాల, మణికట్టుల, మోకాళ్ల వంటి 'కార్టిలాజ్' ప్రాంతాల్లో ఉండే మృదువైన కందర కవచాన్ని సహజంగా పునరుద్ధరిస్తాయి. సాధారణంగా సంధి నొప్పులు, మోకాళ్ల దెబ్బలు లేదా సంధుల పాడవడం వంటి పరిస్థితులకు శస్త్రచికిత్సలు, ఇంజెక్షన్లు లేదా దీర్ఘకాలిక పునరావాస చికిత్స అవసరమవుతుంది. కానీ, ఈ కొత్తగా తయారైన 'నర్తించే అణువులు' శరీరంలో దెబ్బతిన్న 'కార్టిలాజ్' ప్రాంతాలను స్వయంగా గుర్తించి, చుట్టూ ఉన్న కణజాలాలను కొత్త కణాల పెరుగుదలకు ప్రేరేపిస్తాయి. దీని వల్ల వృద్ధాప్యం, గాయాలు లేదా వాతం కారణంగా వచ్చే నొప్పులు, చాలా తక్కువ సమయంలోనే, ఎలాంటి అదనపు ఔషధాల అవసరం లేకుండా సహజంగానే తగ్గుతాయి. ఈ డాన్సింగ్ మాలిక్యూల్స్ చాలా సూక్ష్మమైనవి అయినప్పటికీ అత్యంత ఖచ్చితత్వంతో పనిచేస్తాయి. ఇవి శరీరంలోని రక్తప్రవాహంలో సజావుగా సంచరిస్తూ, కణాలతో మమేకమై వాటిని పునరుద్ధరణ స్థితిలోకి నడిపిస్తాయి. ముఖ్యంగా, ఇవి శస్త్రచికిత్సలు, కృత్రిమ ఇంప్లాంట్లు లేదా మందుల అవసరం లేకుండా కణజాలం సహజంగా నూతనంగా పునర్నిర్మించుకునేందుకు సహాయపడతాయి. ప్రారంభ పరిశోధనల్లో వీటి వినియోగం వల్ల త్వరితగతిన మానిక ప్రక్రియ జరిగి, జాయింట్ల పనితీరు కూడా మెరుగుపడినట్లు గమనించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి, ముఖ్యంగా వృద్ధాప్యంతో సంధి నొప్పులు ఎదుర్కొంటున్న వారికి, విశేషంగా ఉపశమనం అందించే అవకాశముంది. ఈ నూతన వైద్య సాంకేతికత వారి జీవితాలకు తిరిగి చురుకుదనం తెచ్చే శక్తి కలిగి ఉంది.

# వెన్నునొప్పికి 'స్టెమ్' చికిత్స



ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని వేధిస్తున్న వెన్నునొప్పికి జపాన్ పరిశోధకుడు హిదెయుకి ఒకానో నేతృత్వంలో, టోక్యో కియో యూనివర్సిటీలో నిర్వహించిన ఒక క్లినికల్ ట్రయల్ పరిష్కారాన్ని కనుగొంది. మూల కణాలు (స్టెమ్ సెల్స్) ద్వారా చేసిన ప్రయోగం విజవంతమైందని అంటున్నారు. ఒక ప్రమాదంలో వెన్నుపూసకు తీవ్రంగా గాయమై, నడవలేని స్థితిలో ఉన్న ఒక వ్యక్తిపై ఈ కొత్త చికిత్సా పద్ధతిని ప్రయోగాత్మకంగా పరీక్షించారు. వైద్య బృందం ప్రత్యేక మూలకణాలను తీసుకొని, వాటిని బాధితుని వెన్నుపూస గాయపడి ఉన్న ప్రాంతంలో జాగ్రత్తగా ఇన్‌జెక్ట్ చేసింది. ఈ మూలకణాలు ఆ పరిసర నాడీకణాలుగా అభివృద్ధి చెందుతూ గాయాన్ని నివృత్తి చేసే మార్గాన్ని ప్రారంభించాయి. కొన్ని వారాల వ్యవధిలోపే రోగిలో కొన్ని కొంత కదలికలు మొదలయ్యాయి. నెలలు గడిచే కొద్దీ అతను ఎవరైనా సాయం చేస్తే నిలబడగలిగే స్థాయికి చేరుకున్నాడు. దీనిని విప్లవాత్మక పరిణామంగా పేర్కోవాలి. ఎందుకంటే, ఇప్పటి వరకు వెన్నుపూస గాయాల వైద్యానికి శాస్త్రీయంగా, ఎటువంటి శాశ్వతమైన పరిష్కారం లేదు. కానీ స్టెమ్ సెల్ చికిత్స ద్వారా మానవ శరీరంలో మూలకణాలను వివిధ నాడీ కణాలుగా ఆకర్షించి, మరణించిన నాడీ మార్గాలను తిరిగి కుదిర్చే ప్రయత్నంగా ఇది నిలిచింది. థెరపీ ప్రారంభమైన తర్వాత అల్పస్థాయిలోనైనా కదలికలు రావడం, కొన్ని నెలల్లో ఒంటి మీద నిలబడగలడమన్నది వైద్యరంగంలో అత్యంత శక్తివంతమైన జీవిత గమనాన్ని సూచిస్తుంది. ప్రస్తుతానికి ఈ చికిత్స ఇప్పటికీ ప్రయోగాత్మక దశలో ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అంగవైకల్యం గలవారికి నూతన ఆశను, స్వీయావలంబనను నింపే మెరుగైన మార్గాన్ని చూపిస్తోంది. మరిన్ని భారీ క్లినికల్ ట్రయల్స్, పరిశోధనలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. మొత్తానికి జపాన్ శాస్త్రవేత్తల పరిశోధన, ఖచ్చితత, నూతనతపై అద్భుత నమ్మకం ప్రతిఫలించింది. ఈ చికిత్సా విధానం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, పక్షవాతానికి కూడా చికిత్స సాధ్యమవుతుంది.

# మైక్రోప్లాస్టిక్ 'చింత' తీర్చింది..



అత్యంత ప్రమాదకరమైన మైక్రోప్లాస్టిక్ వివిధ రకాలుగా మన శరీరంలోకి వెళుతున్నదనేది వాస్తవం. దీని వల్ల ఎన్నో ప్రణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంలో విస్తారంగా కలిసిపోతున్న ఈ మైక్రోప్లాస్టిక్‌ను సమర్థవంతంగా అరికట్టగల సామర్థ్యం చింతపండుకు ఉందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. తాజా నివేదికనలను అనుసరించి, చింతపండులో సహజంగా ఉండే కొన్ని రసాయనాల వల్ల మైక్రో ప్లాస్టిక్ కణాలు పిండిగా మారుతాయి. వాటిని జీర్ణక్రియ ద్వారా బయటకు పంపించగల సామర్థ్యం చింతపండుకు ఉంది. మైక్రో ప్లాస్టిక్‌లు మన ముఖ్యమైన అవయవాలు, కణాలు, రక్తంలో కనిపిస్తున్నాయి. శరీరంలో వాటిని ఎంత తగ్గించుకుంటే ఆరోగ్యానికి అంత మంచిది. దాదాపుగా ప్రతి ఇంట్లోనూ అందుబాటులో ఉండే చింతపండు లేదా చింతకాయతో ఈ సమస్యకు నివారణ సాధ్యమని పరిశోధకులు అంటున్నారు. అయితే, చింతపండును ఎంత మోతాదులో తీసుకోవాలి, సురక్షితంగా ఎలా వాడాలి అనే కోణంలో పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి ఈ పరిశోధన వల్ల మైక్రో ప్లాస్టిక్ సమస్యకు చింతపండుతో విముక్తి సాధ్యమనే ప్రాథమిక అంశం రుజువైంది. తదుపరి పరిశోధనలు జరగాల్సి ఉంది.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

# భగవాన్‌దాస్ స్ఫూర్తితో ముందుకు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ఘనంగా సిపిఐ నేత బిఆర్ వర్ధంతి

నివాళులర్పించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని, మేయర్ సుధారాణి



ప్రజాపక్షం/హనుమకొండ :బిఆర్ భగవాన్‌దాస్ అందించిన స్ఫూర్తితో ముందుకు సాగుతామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ప్రముఖ కార్మిక నేత, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు బిఆర్ భగవాన్ దాస్ 22వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. హన్మకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్‌లో గల భగవాన్ దాస్ విగ్రహానికి మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డితో కలిసి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి మాట్లాడుతూ భగవాన్ దాస్ రాజకీయ వారసులుగా ఆయన చూపిన బాటలో ప్రజల హక్కుల సాధనకు పోరాటాలు నిర్మిస్తామన్నారు. నగరంలో అసంఘటిత రంగ కార్మికుల హక్కులతో పాటు పేదలకు ఇండ్ల స్థలాల కోసం భగవాన్ దాస్ పోరాడారన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం బిఆర్ అని కొనియాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎస్సారెస్పీ ప్రాజెక్టు రావడానికి పోరాడిన మహనీయుడు భగవాన్‌దాస్ అని గుర్తు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కోసం పోచంపాడు ప్రాజెక్టు సాధన కోసం పోరాడారన్నారు. తాను 1987లో రాజకీయాలలోకి వచ్చిన కొత్తలో అండగా, అన్నగా నిలిచి తనకు అనేక సలహాలు, సూచనలు చేశారని గుర్తు చేసుకున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం, ఆజంజాహీ పరిరక్షణకు పోరాడిన ఘనత బిఆర్‌దేనన్నారు. వరంగల్‌లో అసంఘటిత రంగంలో గల ఆటో, హమాలీ, బీడీ, సినిమా వర్కర్స్ కార్మికుల హక్కుల కోసం సంఘాలను ఏర్పాటు చేసిన నిస్వార్థ నాయకులు భగవాన్‌దాస్ అన్నారు. ఆయన స్ఫూర్తితోనే ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కర్ణాకర్, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్.అశోక్ స్టాలిన్, ఏదునూరి వెంకట్రాజం,మునిగాల బిక్షపతి, కొట్టెపాక రవి కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, మాజీ కార్పొరేటర్ స్వామి చరణ్,జోరిక రమేష్, డాక్టర్ బి.రాజ్ సిద్దార్థ, బిఆర్ లెనిన్, ఎస్‌టియూ నాయకులు నేదునూరి శ్రీహరి, సిపిఐ నాయకులు యేషబోయిన శ్రీనివాస్,మాలోతు శంకర్, జితేందర్, సంజయ్, సీనియర్ జర్నలిస్టు నాయకులు కె. అనిల్ గౌడ్, పొగాకుల అశోక్, గోకారపు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాల్సిందే




సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణ కుమారి డిమాండ్

ప్రజాపక్షం/మంచిర్యాల : అంగన్‌వాడీల వేతనాలను 18 వేల రూపాయలకు పెంచుతామన్న ఎన్నికల హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీల టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి కరుణ కుమారి డిమాండ్ చేశారు. మంచిర్యాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కరుణ కుమారి మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పని భారం తగ్గించి, ఖాళీగా ఉన్న సూపన్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలని, గుడ్డు నాణ్యతపై దృష్టి సారించాలని, సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక ...:** అంగన్‌వాడీల టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కళిందర్ అలీఖాన్, అధ్యక్షురాలిగా భూపతిరావు రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.సురేఖ, ఉపాధ్యక్షులుగా ఇందిరా, అపర్ణ, శంకరమ్మ, పద్మావతి, సంధ్య, ప్రధాన కార్యదర్శిగా తోకల సరస్వతి, సహాయ కార్యదర్శులుగా రత్న రాజమణి, బి.శారద, ఐత అరుణ, శైలజ, నేరెళ్ల అరుణ, కోశాధికారిగా వై.కుసుమతో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు జరగక

# కుంటుపడుతున్న అభివృద్ధి

సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్

ప్రజాపక్షం/భూపాలపల్లి : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగక గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని, వెంటనే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ రావి నారాయణరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే కాంగ్రెస్‌కు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్ కోసం సుప్రీంకోర్టుకు వెళ్లడం అనేది కాలయాపన తప్ప మరేం లేదన్నారు. చట్టసవరణ చేసైన బిసి రిజర్వేషన్‌కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో జిల్లాలో రేగొండ, చిట్యాల, మొగుళ్లపల్లి, భూపాలపల్లి మండలాల్లో సిపిఐ పోటీ చేస్తుందన్నారు. ఎంపిటిసి. జెడ్‌పిటిసి, సర్పంచులు అధికస్థానాలు గెలుచుకునే విధంగా ప్రయత్నం ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని పోరాటాలు నిర్వహించే పార్టీలను ప్రజలు ఆదరించాలని ఈ సందర్భంగా రాజ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, క్యాతరాజ్ సతీష్, కోరిమీ సుగుణ, గంగసరపు శ్రీనివాస్, నేరెళ్ల జోసెఫ్, గోలి లావణ్య, మహేశ్, పీక రవికాంత్ పాల్గొన్నారు.




# 42 శాతం రిజర్వేషన్లు పేరుతో కాలయాపన

బిసి బిల్లును కేంద్రంలో బిజెపి ఎందుకు తేల్చలేకపోతున్నారు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ పార్టీ జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచులకు పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ కార్మిక భవన్‌లో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. 73,74 రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని తెలంగాణ ప్రభుత్వం బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు కల్పిస్తామని కాలయాపన చేస్తూ వస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే కాంగ్రెస్ కు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్ కోసం సుప్రీంకోర్టుకు వెళ్లడం అనేది కాలయాపన తప్ప మరేం లేదన్నారు. స్థానిక సంస్థలకు కేంద్రం నుండి రూ.300 కోట్ల గ్రాంట్ రావాలని, అది ఇవ్వక కేంద్రంలో చట్ట సవరణకు పెట్టిన బిల్లును ఆమోదించక పెండింగ్‌లో పెడుతుందని ఆరోపించారు. బిసి లకు 42 శాతం రిజర్వేషన్ ఉండాల్సిందే అని చెబుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ రిజర్వేషన్ బిల్లును కేంద్రంలో ఎందు కు తేల్చలేక పోతురన్నారన్నారు. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే బిసి రిజర్వేషన్ బిల్లును వెంటనే తేల్చాలన్నారు. అసెంబ్లీలోతీర్మానం చేసి గవర్నర్‌కు బిల్లును పంపితే కేంద్రం ఎందుకు అమలు చేయక నాటకాలు ఆడుతుందని మండిపడ్డారు. నరేంద్ర మోదీ బిసి అని చెబుతూ బిసిలకు ఏమి చేశాడో చెప్పాలన్నారు. రాష్ట్రంలో బిజెపి నాయకులు 42 శాతం ఉండాలని అంటూ కేంద్రంలో అమలు చేయకపోవడం వెనుకాల ఉన్న నాటకం ఏమిటన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక సుమారు రెండు సంవత్సరాలు గడుస్తుందని, స్పెషల్ ఆఫీసర్ల పరిపాలన అరకొరగా సాగుతూ ఉంటే జరగాల్సిన అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాజ్యాంగంలో 50 శాతం రిజర్వేషన్ మించకూడదని ఉందని హైకోర్టు చెబితే, రేవంత్‌రెడ్డి తమిళనాడులో అమలులో ఉందని అంటున్నారని, రిజర్వేషన్లు ఖరారై షెడ్యూలు విడుదల అయిన తరువాత అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తే బిసిలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కుల జనగణన చేపడితే కేంద్రంలో చేపట్టలేక పోవడానికి ఆంత ర్యం ఏందన్నారు. చండీగర్‌లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభలో కేంద్రంలో కులగనన చేపట్టాలని డిమాండ్ చేసిందన్నారు. కేంద్రం ఆర్థికంగా బలపడుతుందని పత్రిక కథనాలు వస్తూ ఉంటే దేశంలో పేదవాడు పేదవాని లాగానే ఉంటున్నాడని, ఆదాని, అంబానికి లక్షల కోట్లు ఏ విధంగా వచ్చాయన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు మూడు నెలల నుంచి జీతాలు రానీ దుస్థితి దేశంలో ఉన్నప్పుడు ధనిక దేశం ఏ విధంగా అవుతుందన్నారు. కొద్ది మంది చేతుల్లోకి సంపద వెళుతుందని సంపదను గుప్పి ట్లో పెట్టుకుని పేదరికం పెంచి పోషిస్తున్నారన్నా రు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## కమలాపూర్ పేపర్ మిల్లు

# పునరుద్ధరణ ఎప్పుడు..?

ఎఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్

ప్రజాపక్షం/ములుగు/మంగపేట : కమలాపూర్ పేపర్ మిల్లును ఎప్పుడు పునరుద్ధరిస్తారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం ఎఐటియుసి మంగపేట మండల మహాసభ గడ్డం భారతి అధ్యక్షతన కమలా జంపాల రవీందర్ ఎఐటియుసి జెండా ఎగుర వేశారు. అనంతరం మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మంగపేట మండలంలో గల ఏకైక పరిశ్రమ మూతపడి పదమూడు సంవత్సరాలు దాటినా పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన జిల్లా, మండల నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాత కంపెనీని టేకోవర్ చేసిన విఎస్‌టి యాజమాన్యం ఎక్కడా అని నిలదీశారు. ఈ పాంతం ప్రజలు, ప్రజాప్రతినిధులు కమలాపూర్ పేపర్ మిల్లును పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ నాయకులు బండి జయమ్మ, మద్దిబోయిన భారతి, ఎస్‌కే షఫియా, గడ్డం భారతి, ఆలం హేమ, ఈసాల రమాదేవి, బల్లెం రాములు, కొడాలి తులసి, కె శ్రీదేవి, వాసం నాగేంద్ర, తాలూక వెంకటనర్సమ్మ, విజయలక్ష్మి, కోరం పద్మ, అమీన, పాగ పద్మ, ఖైరున్, బుచ్చమ్మ, అఖిల, శ్రీలత, రేష నానమ్మ, తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/అర్వపల్లి :** హెల్త్‌ఫై హాస్పటల్ సూర్యాపేట వారి 4వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత ఆరోగ్య సేవలు ఆదివారం జాజిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పటల్ యజమాన్యం మతకాల చలపతిరావు మాట్లాడుతూ హాస్పటల్‌లో అనేక క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించి విజయవంతం చేయడం జరిగిందన్నారు. పేద ప్రజలకు 24 గంటలు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులతోపాటు వెన్నుపూసనొప్పి, నరముల బలహీనత, కిడ్నీకి సంబంధించిన వ్యాధులు, షుగర్, బిపి, ఈసిజి టెస్టుతోపాటు బాడీ పెయిన్స్‌కి సంబంధించిన డాక్టర్స్ అందుబాటులో ఉన్నారని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీతోపాటు అన్ని రకముల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పోలెబోయిన కిరణ్, వల్లాల రమేష్, గట్టిగొర్ల లింగమల్లు, బట్టమేకల లింగస్వామి పాల్గొన్నారు.




## తహసీల్దార్ కార్యాలయం ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల తహశీల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయింది జూలై నెలలో 14 ఏళ్లు గడిచిన ప్రహరీ గోడ నోచుకోని తహశీల్దార్ కార్యాలయం, అనే శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించిన ప్రభుత్వ అధికారులు తహశీల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేశారు. దాంతో కార్యాలయానికి అందమైన రూపురేఖలను తీర్చిదిద్దారు ప్రభుత్వ కార్యాలయం అంటే ఇలా ఉండాలి అనే విధంగా అధికారులు స్పందనను చూసి పలువురు అభినందిస్తున్నారు.ప్రభుత్వ కార్యాలయం అంటే ప్రజలందరికీ కోరికలు తీర్చే దేవాలయం అని అక్కడికి కార్యాలయానికి వెళ్ళిన వెంటనే తమ సమస్యలు పూర్తయితాయని ప్రశాంత వాతావరణం ఉంటే బాగుండు అని ఆశించిన వారి కోరిక ఇప్పటికి నెరవేరింది ఏదేమైనా తహసిల్దార్ కార్యాలయం అందంగా దర్శనమిస్తుంది.

## యథావిధిగా ప్రజావాణి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎంపిటిసి, జెడ్పిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా అమలులోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాష్ట్ర హై కోర్ట్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిలిపివేసినందున ఈనెల 13 (సోమవారం) ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.అందువల్ల సమస్యల పరిస్కారం నిమిత్తం ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించదల్చుకున్న వారు సోమవారం వారి దరఖాస్తులను నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సమర్పించవచ్చని ఆమె స్పష్టం చేశారు.జిల్లా ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## డిసిసి పదవి 'గుమ్మల'కే ఇవ్వాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** డిసిసి అధ్యక్ష పీఠాన్ని గుమ్ముల మోహన్ రెడ్డికే ఇవ్వాలని పార్టీ శ్రేణులు ముకుమ్మడిగా ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రటరీ బిశ్వరంజన్ మహంతికి వినతి పత్రాలు అందజేశారు. ఆదివారం బ్లాక్ కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ నాయకులతో హ్మాణ్యం ఇంద్రకరణ్ రెడ్డిలు ముఖాముఖి అభిప్రాయ సేకరణతో పాటు వ్యక్తిగతంగా అభిప్రాయం తీసుకున్నారు.అభిప్రాయ సేకరణకు వచ్చిన నాయకులు మొదటి పేరుతో పాటు మరికొంతమంది పేర్లు చెప్పాలని సూచించగా పార్టీ శ్రేణులు మరో పేరు చెప్పడానికి ఇష్టపడలేదు.గుమ్ముల మోహన్ రెడ్డితో పాటు సెకండ్ ఆప్షన్, థర్డ్ ఆప్షన్ గా పేర్లు చెప్పాలని అబ్జర్వర్లు సూచించినప్పటికీ ప్రతి ఒక్కరూ మరో ఆప్షన్ లేదని గుమ్ముల మోహన్ రెడ్డికే ఇవ్వాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ విధేయుడుగా, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటున్నాడని పార్టీ శ్రేణులు తెలిపారు.అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లంతా డిసిసి పదవి గుమ్ములకే ఇవ్వాలని అబ్జర్వర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ఆర్టీఏ డైరెక్టర్ కుసుకుంట్ల రాజిరెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప, మాజీ కౌన్సిలర్లు ఖయ్యూం బేగ్,ఇబ్రహీం పాల్గొన్నారు.

## రెండు రాష్ట్రాల మధ్య వివాదానికి కేంద్రం కుట్ర

బనకచర్లకు సహకరించాలని కేంద్రం లేఖ పట్ల ఖండన

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రెండు రాష్ట్రాల మధ్య వివాదాన్ని సృష్టించి రాజకీయంగా మోడి ప్రభుత్వం లబ్ధి పొందాలని చూస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని బృందావన్‌గార్డెన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్రా భాయ్ సంతాప సభలో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్, సీనియర్ నాయకులు డీజే నర్సింగరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం లేఖ రాయడం పట్ల తీవ్రంగా ఖండించారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచి బనకచర్ల నిర్మించడం వల్ల తెలంగాణాకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్, బిల్లు, జీవో రద్దుకు ప్రయత్నించిందని అన్నారు. బీసీ బిల్లుకు అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, దీని కోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. హన్మకొండలో నకిలి రైతులు భూమి లేకుండా ధాన్యం అమ్మకపోయిన ప్రభుత్వ సొమ్ము రూ.1.869కోట్లు కాజేశారని, ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, కందాల ప్రమీల, సయ్యద్‌హాసం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం

రజాకార్ల చేతిలో అమరులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసిన వి. హనుమంతరావు



**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం) :** 1948 సంవత్సరంలో రజాకార్ల కాల్పుల్లో అసువులు బాసిన పదిమంది అమరవీరుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని ఉమ్మడి రాష్ట్ర పిసిసి మాజీ అధ్యక్షులు,మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు అన్నారు.1948 సంవత్సరంలో జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో జాతీయ జెండాను ఎగరవేశారనే నెపంతో పదిమంది విద్యార్థులను రజాకార్లు కాల్చి చంపారు. వల్లాల అమరవీరుల చరిత్రను తెలుసుకున్న హనుమంతరావు ఆయన సొంత ఖర్చులతో అమరవీరుల స్మారకార్థం స్థూపాన్ని నిర్మించి గత నెలలో స్తూప ఆవిష్కరణ సభ నిర్వహించిన విషయం విధితమే. ఆ సభ సందర్భంగా మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ జానారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పదిమంది అమరవీరుల కుటుంబాలకు తల 50 వేల రూపాయల చొప్పున పంపించిన 5 లక్షల రూపాయలను ఆదివారం గ్రామంలో అమరవీరుల కుటుంబాలకు అందించారు.ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ భవిష్యత్తులో అమరవీరుల కుటుంబాలకు అన్ని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ వల్లాల అమరవీరుల గుర్తుకు చిహ్నంగా అత్యున్నతమైన సదుపాయాలతో గవర్నమెంట్ పాఠశాలను మంజూరు చేయించేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ శంకర్ నాయక్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్,మాజీ శాసనసభ్యులు గోనె ప్రకాశరావు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కందాల సమరం రెడ్డి,వల్లాల మాజీ సర్పంచులు ఎస్కె ఇంతియాజ్,భూపతి వెంకన్న,దండ అశోక్, నరిగే నర్సింహా,మాధగోని రామలింగయ్య,నోముల జనార్ధన్, వేముల గోపీనాథ్,బోడ అరుణ్ కుమార్,గుండ్ల పల్లి సైదులు, నోముల రవి,గుండ్లపల్లి శంకర్,గుండ్ల పల్లి నాగరాజు,కుర్ర లింగయ్య పాల్గొన్నారు.

# సిజెఐపై దాడి హేయమైన చర్య : గన్నా



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్ గవాయ్ పైన ఓ మతోన్మాద న్యాయవాది బూటు విసిరే ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ సనాతన ధర్మం పేరిట ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరివేసే ప్రయత్నం న్యాయవ్యవస్థ తమకు తాను అనుకూలంగా వ్యవహరించాలని బెదిరింపు ధోరణి అరాచకత్వానికి నిదర్శమన్నారు. ఇది కేవలం న్యాయవాది చేసిన దాడిగానే చూడవద్దని గత కొన్నేండ్లుగా దేశంలో మతం, మితవాదం శక్తుల ఆదిపత్య వైఖరి చివరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడికి దారి తీయడం ప్రజాస్వామ్య విలువను పతనానికి పరాకార్షమన్నారు. రాజ్యాంగాన్ని నిలబెట్ట డానికి సామాజిక అడ్డంకులను బద్దలు కొట్టిన వ్యక్తిని బెదిరించటానికి, అవమానించటానికి జరిగిన ప్రయత్నమే ఈ దాడియత్నం సంఘటన ప్రతిబింబిస్తుందన్నారు. గత శతాబ్దంలో దేశంలో మతోన్మాదం, మతతత్వం మన సమాజాన్ని ఎలా ముంచెత్తేస్తున్న అనేది ఇలాంటి బుద్ధిహీనమైన చర్య చూపిస్తుందని గన్న చంద్రశేఖర్ వెల్లడించారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరపున మేము ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని మన న్యాయ వ్యవస్థకు సురక్షితం భద్రత ప్రధానమైనది అన్నారు. కుల మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నీ సామాజిక న్యాయం కోరే దోపిడి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాట శక్తులన్నీ ఐక్యంగా నిలబడి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవా డ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మండ వ వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అంతరాలు లేని విద్య అందించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సమాజంలో సమూల మార్పు వచ్చేదాకా విద్యారంగంలో అసమానతలు,అంతరాలు లేని విద్యా సమాజాన్ని నిర్మించుకోవాలని టిపిఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ శాసనమండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు.ఆదివారం పట్టణంలోని యుటిఎఫ్ భవనంలో తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్యలో అంతరాలు తొలగిపోయేదెట్లా అనే అంశంపై జిల్లా అధ్యక్షులు పాల్వాయి అంజిరెడ్డి అధ్యక్షతన కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడుతూ సమాజంలో అసమానతలు లేని విద్యను అందించేందుకు కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసి ప్రజలను ఆలోచింపజేయాలనే ఉద్దేశంతో ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కవులు సమాజ నిర్దేశకులని వారి ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఆరు దశాబ్దాల క్రితం కొఠారి కమిషన్ చెప్పిన కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెడితేనే విద్యారంగంలోని అసమానతలు రూపుమాపబడతాయని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధే శ్యామ్ మాట్లాడుతూ సమాజంలో అనేక అంతరాలు ఉన్నప్పటికీ,విద్యారంగంలో ఈ అసమానతలు ఉండటం వల్ల విలువలు పతనమ వుతున్నాయని వాటిని కాపాడుకుంటూనే సమాన విద్య కోసం కవులు,రచయితలు తమ రచనలతో సామాజిక చైతన్యం తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు డాక్టర్ సాగర్ల సత్తయ్య , మాజీ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, బైరెడ్డి కృష్ణారెడ్డి,డాక్టర్ పగడాల నాగేందర్,మునాసు వెంకట్,పెరుమాళ్ళ ఆనంద్,భూతం ముత్యాలు, శ్యాంసుందర్,పగిడిపాటి నరసింహ,లింగమూర్తి, భీష్మా చారి, బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆలేరులో పడకేసిన పారిశుద్ధ్యం

పారిశుద్ధ్య పనులు చేయించడంలో మున్సిపల్ అధికారులు విఫలం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేయించడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. దీనివల్ల ప్రజలు విష జ్వరాలతో విలవిల లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురికి కాలువల నుండి వేదజల్లే దుర్గంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారని అన్నారు. అలాగే పట్టణంలో వెంటనే శానిటేషన్ పనులు ప్రారంభించి మురుగు కాలువలు శుభ్రం చేయాలన్నారు. లేనియెడల సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, అక్రమ నిర్మాణాల కట్టడాల నివారణలో కమిషనర్ ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ పథకం కింద పంపిణి చేసిన ఇళ్లలో మురికి కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని శాశ్వత పరిష్కారం కోసం వెంటనే మురికి కాలువ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు, అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బొడ్డు ఆంజనేయులు, ఎండి అభి, గిరిరాజు అంజయ్య, ఎండి జాంగిర్, కందుల మధు, సిపిఐ టౌన్ కార్యదర్శి గొట్టిపావుల శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మర్ల హక్కులు సాధించుకుందాం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** నేటి ఆధునిక సమాజంలో కుమ్మరులు అన్ని రంగాల్లో అన్ని విధాలుగా ఐక్యమత్యంతో హక్కులు సాధించుకుందామని కుమ్మరసంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు దేవరుప్పుల మల్లేష్,ఆలేరు నియోజకవర్గ కన్వీనర్ జివిలికపల్లి ఆంజనేయులు అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలో కుమ్మర సంఘం మండల ప్రధాన కార్యదర్శి నాగాయపల్లి శివరాములు, కోశాధికారి జాగిళ్లపురం సత్తయ్య, ప్రచార కార్యదర్శి కొలనుపాక కొండల్, మీడియా కోఆర్డినేటర్ జివిలికపల్లి మహేష్ ఆధ్వర్యంలో కుమ్మర సంఘం గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ కమిటీలో తుర్కపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జివిలికపల్లి రాములు, ఉపాధ్యక్షులుగా జివిలికపల్లి బాలరాజు, గంగాదరి నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా జివిలికపల్లి భాస్కర్, సహాయ కార్యదర్శిగా జీవిలికపల్లి గోపాల్, ప్రచార కార్యదర్శిగా జీవిలికపల్లి రాజు, కోశాధికారిగా జివిలికపల్లి మహేష్, గౌరవ అధ్యక్షులు జివిలికపల్లి శ్రీనివాస్, బాల నరసయ్య, గంగాధరి నరసింహులు, గౌరవ సలహాదారులు జివిలికపల్లి సత్తయ్య, జివిలికపల్లి బాల నర్సయ్య, జివిలికపల్లి రాములు, జివిలికపల్లి నర్సింలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జివిలికపల్లి నాగరాజు, శ్రవణ్, వినయ్, చంద్రకాంత్, శివ, మణికంఠ, రాము తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నిరుపేదలకు ప్రభుత్వం ఇండ్లు, ఇండ్ల స్థలాలు అందించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీలో ఆయన పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. తాళ్లగడ్డలో డ్రైనేజీ, రోడ్లు నిర్మించి, వీదిదీపాలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. తాళ్లగడ్డలోని మల్లెతోట ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించుకొని నిరుపేదలకు అమ్మారని, ఇట్టి భూమిని అని ఇప్పుడు ప్రభుత్వం, అధికారులు పేదలను ఖాళీ చేయించాలని చూస్తుండడం సరికాదన్నారు. పేదల పక్షాన నిలబడి వారికి పట్టాలు వచ్చేంతవరకు పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, కోడిరెక్క మల్లయ్య, అరుణ, కరీం, జహంగీర్, రామారావు, వెంకటేశ్వర్లు, వీరేందర్ పాల్గొన్నారు.



## సర్వోత్తమ్‌రెడ్డికి పార్టీ పగ్గాలు ఇవ్వాలి

సిఎం చేతిలో చెయ్యి వేయించి చెప్పిన విహెచ్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట నియోజక వర్గ పార్టీ పగ్గాలు దివంగత నేత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డికి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలో నిర్వహించిన దామోదర్ రెడ్డి సంతాప సభకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్వోత్తమ్‌రెడ్డిని ఓదార్చి అక్కడికి హాజరైన కాంగ్రెస్ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. పార్టీ కోసం నాలుగు దశాబ్దాలుగా రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుటుంబం సర్వోం కోల్పోయి కమ్యూనిస్టు గడ్డపై మూడు రంగుల జెండాను రెపరెపలాడించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నాయకుడు కాదని... యావత్ తెలంగాణ రాష్ట్రానికి మహానాయకుడని చెప్పారు. సర్వోత్తమ్ రెడ్డికి సూర్యాపేట నియోజక వర్గ పార్టీ ఇంచార్జి బాధ్యతలను అప్పగించడం వల్లే ఆయనకు నిజమైన నివాళులర్పించిన వారమవుతామని స్పష్టం చేశారు. ఇదే డిమాండ్ పార్టీ శ్రేణుల నుండి వస్తుందని చెప్పారు. ఆయన ప్రసంగిస్తున్నప్పుడు వేదికపై సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. అక్కడే ఉన్న దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డిని సిఎం వద్దకు తీసుకవెళ్ళి ఆయన చేతిలో చెయ్యి వేయించి పట్టుకున్నారు. ఈ బంధం ఇలాగే కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ దృశ్యాన్ని చూసిన దామన్న అభిమానులు కేరింతలు కొట్టారు.

## సాగర్‌లో పర్యాటకుల సందడి



**ప్రజాపక్షం/నందికొండ:** సాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరెందుకు ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో శుక్రవారం పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్ అందాలను తిలకించడానికి వచ్చారు. అందులో సాగర్ ప్రాజెక్టు గేట్లు తెరిచి ఉంచడంతో విద్యార్థులు పర్యాటకులు తరలి క్రస్ట్ గేట్ల ద్వారా జాలు వారుతున్న కృష్ణమ్మ అందాలను తిలకించారు. ఆ తరువాత లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడినుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల జలపాతం, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. తెలంగాణ పర్యాటకశాఖ ఆదివారం నాగార్జున కొండకు లాంచీలను రెండు ట్రిప్పులు నడపగా ఇంకా పర్యాటకుల రద్దీ తగ్గకపోవడంతో పర్యాటకుల అభ్యర్థన మేరకు రిజర్వాయర్ లో ఒక జాలి ట్రిప్పు నడిపారు.

## నిరుపేదలకు అండ జనయేత్రి జెండా



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నిరుపేదలకు అండగా జనయేత్రి ఎజెండా ఎల్లవేళలా ముందుంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు, వైద్యులు, సామాజికవేత్త మునీర్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నల్లగొండ పట్టణం పెద్దబండ ప్రాంతానికి చెందిన జక్కల మల్లేష్ కుటుంబానికి జనయేత్రి ఫౌండేషన వ్యవస్థాపకులు డాక్టర్ మునీర్ అహ్మద్‌షరీఫ్ ఆదివారం 25కిలోల బియ్యం, రూ.10వేల నగదు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనయేత్రి ఫౌండేషన్ నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎండి.సలీం, గాదె నరసింహా, జాజాల కృష్ణ, పోగుల సందీప్, కోట సైదులు, అవురెండ్ల సందీప్, అమీర్‌అలీ, జక్కుల పృధ్వీ, బొజ్జ సైదులు, పాక పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1989/90 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం వలెల ప్రతాపరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలను చిన్నతంలోనే ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటి ప్రభుత్వ దవాఖానాలో పండ్లు పంపిణి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నకిరేకంటి మొగిలయ్య, రామిరి రమేష్, పాల్వంచ హరికిషన్, ఆకారపు నర్సింమా, గోదాసు రమేష్, ఆనంద్, పొట్లపల్లి శ్రీధర్, బావండ్లపల్లి సత్యం, తిరుగుడు కృష్ణ, ముజీబ్, పాతూరి కృష్ణారావు, తిరుగుడు కృష్ణ, భారీ, శ్రీను, మోయిన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : అనుమానస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా గుడిపల్లి గ్రామశివారులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం గ్రామానికి చెందిన రాముయాదవ్(30) మానస భార్య భర్తలు. రాము ప్లంబర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొద్దిరోజులక్రితం వారి ఇంట్లో బంగారం చోరీకి గురైంది. పెద్దముద్దునూరు గ్రామంలో సురేష్ అనే వ్యక్తి బంగారం కనిపెడతాడని తెలిసి అతని వద్దకు వెళ్లారు. ఈక్రమంలో భార్య మానసతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. గత మూడురోజులక్రితం గుడిపల్లి గ్రామంలో తమ బంధువుల పెళ్లికి వెళ్లిన రాముయాదవ్ ఆదివారం అర్ధరాత్రి రోడ్డుపక్కన ద్విచక్రవాహనంతో విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు గమనించి గ్రామస్తులకు తెలపడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రోడ్డుప్రమాదం వల్లే మృతి చెందినట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. కుటుంబసభ్యులు భార్యపై అనుమానం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పోలీసులు సురేష్‌తోపాటు భార్య మానసని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రజాపక్షం/కృష్ణ : కృష్ణ మండలం గూడెబాల్లూరు గ్రామ శివారులోని టైరోడ్డు వద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కర్ణాటకకు చెందిన జనార్ధన్ హిందూపూర్ నుంచి తిరిగి కర్ణాటక వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## అర్ధరాత్రి ఎస్‌పి వాహన తనిఖీలు

### అనుమానాస్పద వ్యక్తుల ఆరా

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ పట్టణంలో అర్ధరాత్రి జిల్లా పోలీసు అధికారి డి.జానకి స్వయంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు రూరల్ సీఐ గాంధీ నాయక్ పాల్గొని ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్ల వద్ద అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలను కాపాడడమే మా ముఖ్య ధ్యేయం ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై కఠినంగా చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా రాత్రివేళల్లో పోలీసులు పహారా బలపరిచారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి, అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే డయల్ 100 ద్వారా సమాచారం ఇవ్వాలని కోరుతున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ గాంధీ నాయక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

### ఏఎస్ఐ ఆంజనేయులు

ప్రజాపక్షం/ నారాయణపేట్ : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఆదివారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రం సింగారం చౌరస్తాలో నారాయణపేట పోలీసులు ఏఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించి సరియైన పత్రాలు లేని వాహనాలకు 36 కేసులకు గాను 18,500/ రూపాయల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించడం వల్ల ప్రమాదాల తగ్గుతాయని , రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు సరైన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్, సిట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. మితీమీరిన వేగంతో వాహనాలను నడపరాదు అని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదు, వాహనాలకు సంబంధించిన ఆర్సి, లైసెన్స్ ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించి పోలీసు వారికి సహకరించాలని తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100కి సమాచారం ఇవ్వాలని కోరారు.

## బాలానగర్ టౌన్‌లో కార్డన్ సెర్చ్



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు అధికారి డి.జానకి ఉత్తర్వుల మేరకు, డీఎస్పీ రమణారెడ్డి పర్యవేక్షణలో ఆదివారం ఉదయం బాలానగర్ టౌన్‌లో కార్డన్ మరియు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించబడింది. ఈ తనిఖీలు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలలో భాగంగా, ప్రజల్లో భద్రతా నమ్మకాన్ని పెంపొందించడం, అనుమానాస్పద వాహనాలు మరియు వ్యక్తులను గుర్తించి నేరాలను అరికట్టడం లక్ష్యంగా చేపట్టబడ్డాయి.సరైన పత్రాలు లేని 30 మోటార్ బైకులు స్వాధీనం చేసుకున్నారు. 06 ఆటో రీక్షా అనుమానాస్పదంగా ఉండడంతో ధృవీకరణ కోసం నిలిపివేశారు. కాలనీలలో నివసిస్తున్న అనుమానాస్పద వ్యక్తుల వివరాలను ధృవీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల రూరల్ సిఐ నాగార్జున గౌడ్, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, బాలానగర్ ఎస్ఐ లెనిన్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రజాపక్షం/దామరగిద్ద : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987–88లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 37 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో కలుసుకున్నారు. కార్యక్రమానికి విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ, సరస్వతి మాత చిత్రపటాలకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఒకరినొకరు తమ జీవిత అనుభవాలు. పాఠశాల స్థాయి నాటి జ్ఞాపకాలను వేదిక నుంచి పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గురువులు మాట్లాడుతూ తమ పిల్లలను సంస్కృతి సంప్రదాయాలను నేర్పించాలన్నారు. ఎన్ని అవరోధాలు వచ్చినా చదువు విషయంలో ఎవరు కూడా వెనకడుగు వేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ నరసింహులు గౌడ్, జనార్దన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, బి.వెంకటేశ్వర్లు, కే.మొగులప్ప, కె.శ్రీనివాస్, కే.సాయిరెడ్డి, కె.నర్సప్ప, కృష్ణయ్య గౌడ్, శంభులింగం దామరగిద్ద జడ్.పి. హెచ్.ఎస్ జీహెచ్ఎం సురేష్‌తో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎంబిబిఎస్ సాధించిన విద్యార్థులకు సన్మానం...**

1987–88లో పదో తరగతి పూర్తి చేసుకున్న దామరగిద్ద జడ్.పి.హెచ్.ఎస్ పూర్వ విద్యార్థుల పిల్లలు మీనాక్షి, విజయలక్ష్మి, పద్మ అను ఎంబిబిఎస్ సీట్లు సాధించడంతో కార్యక్రమంలో భాగంగా శాలువాతో ఘనంగా సత్కరించారు.

# దళితులపై దాడికి బిజెపి పాలనే కారణం

### ఎంపి మల్లు రవి



ప్రజాపక్షం/కల్వకుర్తి : దళితులపై దాడికి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వమే కారణమని, దళితులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని రాజ్యాంగం కల్పించిన హక్కులను పోరాటాలతోనే సాధించుకోవచ్చని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హర్యానా రాష్ట్రంలో ఐపిఎస్ సూసైడ్‌కు ఆరాష్ట్ర డిజిపి ఉన్నతాధికారులు అని మూడు పేజీల సూసైడ్‌నోటుతో అతని భార్య ఫిర్యాదుచేసిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బిజెపి పాలనకు నిదర్శనమని, ఒక ఐపిఎస్ అధికారికే కుల అసమానతలు హేళనలుచూస్తుంటే సామాన్యస్థాయిలో ఉన్న దళితుల పరిస్థితి ఎలా ఉందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రిజర్వేషన్లతో దళితులు ఉద్యోగాలు సాధిస్తే అంటరానితనంగా కులం పేరు పెట్టి హేళన చేయడం దారుణమన్నారు. 75ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులు మైనార్టీలు బిసిలు ఆనందంగా ఉన్నారని, బీహార్ రాష్ట్రంలో దళితులపై దాడి జరిగితే ఇందిరాగాంధీ ఏనుగుపై వెళ్లి బాధితులను పరామర్శించారని ఆయన గుర్తుచేశారు. దళితులు ఉన్నతస్థాయిలలో ఉద్యోగాలు సాధిస్తే బిజెపి ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుందని అలాంటి ప్రభుత్వాలకు ప్రజలు సరైన సమయంలో బుద్ధిచెబుతారని అన్నారు. రానున్నకాలంలో దళితులపై దాడిజరిగిన వెంటనే ఫిర్యాదుచేసేందుకు సంస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్‌సి కమీషన్‌కు పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటికేసులను రిజెక్టు చేయాలని ఆదేశించడం దారుణమన్నారు. ఈవిషయాలపై పార్లమెంటు సమావేశాలలో ప్రస్తావిస్తానన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీకౌన్సిలర్ బాలునాయక్, మైనార్టీ నాయకులు రేష్మ, కాంగ్రెస్‌నాయకులు పాండురంగారెడ్డి, రాంపర్వతాలు, భాస్కర్, వెంకటేష్ ఉన్నారు.

# నడకతో సంపూర్ణ ఆరోగ్యం



### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: నడకతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఆర్థరైటీస్ డే సందర్భంగా ఎస్వీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వాకథాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి వాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత దైనందిన జీవితంలో ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపిస్తూ అనేక మంది అనారోగ్యానికి లోనవుతున్నారని, ఆరోగ్యంగా ఉంటేనే మనిషి, జీవితం సజావుగా సాగుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకుని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ప్రజల్లో ఆరోగ్యం పైన అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం ఎస్వీఎస్ ఆసుపత్రి మరియు మెడికల్ కళాశాల అధ్వర్యంలో వాకథాన్ నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. ప్రతి ఒక్కరికి నడక ఎంతో ముఖ్యమన్నారు. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలంటే ప్రతిరోజు వాకింగ్, వ్యాయామం అవసరమన్నారు. ఆర్థోపెడిక్‌కు సంబంధించి ఎస్వీఎస్ ఆసుపత్రిలో సురక్షితమైన ఆధునాతన ఎక్విప్మెంట్స్ తో అన్ని రకాల శాస్త్రం చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనే బెస్ట్ ఆసుపత్రిగా ఎస్వీఎస్ ఆసుపత్రి అని ఆయన చెప్పారు. అనంతరం పద్మావతి కాలనీ కృష్ణ టెంపుల్ కమాన్ నుంచి ఏనుగొండ వరకు వాకథాన్ లో ఆయన విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డా.కెజె రెడ్డి, డా.కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, కర్నాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోండి

### ఎఐసిసి పరిశీలకుడు నారాయణ స్వామి




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: జిల్లా కాంగ్రెస్ పార్టీ (డిసిసి) కొత్త అధ్యక్షుడి ఎంపిక కోసం అభిప్రాయాలు సేకరించేందుకు మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చామని ఆసక్తి గల వారు ఎవరైనా డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోవచ్చని ఎఐసిసి పరిశీలకుడు ఎమ్మెల్సీ నారాయణ స్వామి తెలిపారు. సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు , దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డితో కలిసి పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మూడురోజుల పాటు అందుబాటులో ఉంటానని నియోజకవర్గాల వారిగా, బ్లాక్ వారిగా నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి ఈ నెల 22న ఎఐసిసి కి నివేదిక అందిస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 20వ తేది వరకు ఇవ్వాలని ఆయన సూచించారు. దరఖాస్తులను ప్రతి జిల్లా నుంచి 6 మంది పేర్లను ఎఐసిసికి పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి అబ్జర్వర్స్‌గణేష్, బెట్టు సాయి, ఉజ్మ షకీర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, టిపిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, జహీర్, అక్తర్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణ సుధాకర్‌రెడ్డి, జీవన్ రెడ్డి, వినోద్‌కుమార్, మారేపల్లి సురేందర్ రెడ్డి, ఎన్‌పి వెంకటేశ్, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వసంత, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, నాయకులు సిజె బెనహర్, ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబా, ఐఎన్టీయుసి రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నిరూపిస్తే రాజకీయ సన్యాసానికి సిద్ధమా?

### మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్



ప్రజాపక్షం/కల్వకుర్తి : కల్వకుర్తి మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ పరిధిలో టిఆర్ఎస్ నాయకులు చేసిన అవినీతిని నిరూపిస్తే రాజకీయ సన్యాసానికి సిద్ధమా, మాహయాంలో అవినీతి నిరూపిస్తే రాజకీయ సన్యాసానికి మేము సిద్ధమని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ సవాల్ చేశారు. ఆదివారం కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి శివారులో కల్వకుర్తి శివారులో గల 57/ఎ/2 సర్వేనెంబర్లు 2010 సంవత్సరంలో 51ప్లాట్లను ఏర్పాటు చేశారని అందులో 46ప్లాట్లు విక్రయించడం జరిగిందని గ్రామపంచాయతీకి కేటాయించిన 5ప్లాట్లకు 2020 సంవత్సరంలో ఎల్ఆర్ఎస్ చెల్లించి చీరరాములు కుమార్తె చీర లావణ్యకు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తులు టిఆర్ఎస్ పార్టీకి సంబంధించినవారిని ఇలాంటి అక్రమాలు జరుగుతుంటే మున్సిపల్ కమీషనర్, చైర్మన్, మాజీచైర్మన్ వైస్ చైర్మన్లు కలిసి చేయడం దారుణమన్నారు. వారం రోజుల క్రితం కాంగ్రెస్‌పార్టీ నాయకులపై ఆరోపణలుచేయడం దొంగే దొంగ అరిచినట్లు ఉందని ఆయన విమర్శించారు. 46సర్వేనెంబర్లు 28వ ప్లాట్‌నెంబర్ 2011 సంవత్సరంలో వికలాంగుల సంఘానికి కేటాయించడం జరిగిందని అట్టి 180గజాల స్థలాన్ని రూ.9లక్షలకు 2023 అక్టోబర్‌లో గిరిధర్‌గౌడ్‌కు ఖలీల్ విక్రయించాడని మీరుకూడా టిఆర్ఎస్ పార్టీ నాయకులేనని అన్నారు. కల్వకుర్తి పాలమూరు చౌరస్తాలో నిర్మించిన వైఆర్ఆర్ కాంప్లెక్స్ 2014లో అనుమతికోసం దరఖాస్తు చేసుకోగా 2015లో అనుమతిరాగా 2018లో కాంప్లెక్స్ పూర్తికావడం జరిగిందని అట్టి కాంప్లెక్స్‌కు ఇప్పటివరకు ట్యాక్స్ చెల్లించలేదని మున్సిపల్ అధికారులు పలుమార్లు వెళ్లిన ఎమ్మెల్యే అండదండలతో అధికారులను భయభ్రాంతులకు గురిచేశారని ఆయన ఆరోపించారు. నాగర్‌కర్నూల్ రోడ్డుపై వైఆర్ఆర్ కాంప్లెక్స్‌గేట్ కబ్జాచేసి నిర్మించుకున్నారని ఆయన గుర్తుచేశారు. 29సర్వేనెంబర్లు ఒప్పంద ఉద్యోగి శ్రీధర్‌రావు రూ.69లక్షలు అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వచ్చిన అనంతరం ఒత్తిడి తీసుకురాగా మొదటగా రూ.26లక్షలు తర్వాత రూ.43లక్షలు రికవరీ చేయడం జరిగిందన్నారు. రూ.2 కోట్ల నిధులతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి చేసి పేదలకు అందించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మాజీసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఎస్సి ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లెల రాములు, కాంగ్రెస్ నాయకులు షాజ్‌వాజ్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, ఎజాజ్, హనుమనాయక్, శ్రీనివాసులు, రాంరెడ్డి, బాలునాయక్, పాండురంగారెడ్డి, భాస్కర్, వెంకటేష్,, రేష్మ ఉన్నారు.

# నిద్రపోతున్న నిఘా నేత్రాలు



ప్రజాపక్షం/వీపనగండ్ల : ఒక సీసీ కెమెరా వంద పోలీసులతో సమానమని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకున్న సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన వారిని పట్టుకోవచ్చనే ఉద్దేశ్యంతో వీపనగండ్లలో ప్రజల సహకారంతో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పర్యవేక్షణ లేక పనికిరాకుండా పోయాయి మండల కేంద్రమైన వీపనగండ్లలో నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి ఎస్సై వహీద్ అలీ బేగ్ సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించి విరాళాలను సేకరించి గ్రామంలోని ప్రధాన చౌరస్తాల వద్ద బస్టాండ్, పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో దొంగలు సీసీ కెమెరాల కంటపడకుండా ఇండ్లలో దూరి చోరీలకు పాల్పడి విలువైన వస్తువులను డబ్బులను తీసుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. గత సంవత్సరం మండల కేంద్రంలోని ఒక వ్యక్తి ఇంట్లో పట్టపగలే దొంగలు చొరబడి విలువైన బంగారు, వెండి వస్తువులతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. గ్రామాలలో సీసీ కెమెరాలు ఉన్న చోరీకి పాల్పడిన వ్యక్తుల ఆనవాళ్లు ఎక్కడ కూడా కనపడకుండా జాగ్రత్తపడి తప్పించుకుంటున్నారంటే సీసీ కెమెరాలు పని తీరు ఏ విధంగా ఉందోనని ప్రజలు అనుకుంటున్నారు. మండల కేంద్రమైన వీపనగండ్లలో లక్షల రూపాయలు ఖర్చు చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన కొన్ని రోజులకే పనికిరాకుండా పోయాయి, గ్రామాల్లోని పలుచోట్ల విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనికిరాకుండా దిష్టిబొమ్మల దర్శనమిస్తున్నాయి తప్ప వాటిని రిపేర్ చేయించడం లేదా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయటానికి పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రజలు ముందుకు రావటం లేదు. గ్రామాల్లో చోరీలు అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నాణ్యమైన సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులకు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సీసీ కెమెరాలు ఏర్పాటు ఆవశ్యకత గురించి ఇప్పటికే గ్రామంలోని రైతు కమిటీ, యువజన సంఘాలు, హమాలి, భవన కార్మికులకు, రాజకీయ నాయకులకు అవగాహన కల్పించడం జరిగిందని, సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరడం జరిగిందని ఎస్సై కే.రాణి తెలిపారు.



## వసతి గృహం తనిఖీ చేసిన రెవెన్యూ అదనపు కలెక్టర్

ప్రజాపక్షం/జడ్చర్ల : రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో షెడ్యూల్డ్ తెగలు బాలుర కళాశాల వసతి గృహం షెడ్యూల్డ్ తెగలు బాలుర కళాశాల వసతి గృహం, వెంకటేశ్వర కాలనీలో ఉన్న షెడ్యూల్డ్ కులాలు బాలుర వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. వసతి గృహాలు టిఫిన్ చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. టిఫిన్ చట్నీలో నీరు ఎక్కువ వేసి పలుచగా చేయడంతో హాస్టల్ వార్డెన్‌కు మెమో జారీ చేయాలని షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారిణిని ఆదేశించారు.

**జడ్చర్లలో బాలికల మినీ గురుకులం తనిఖీ**

జడ్చర్లలో బాలికల మినీ గురుకులంను రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రతిరోజు ఉపయోగించే నిత్యావసర సరుకులను, కూరగాయలు, వంటగదిని పరిశీలించారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ : కల్వకుర్తి మండలపరిధిలోని వెంకటాపూర్ గ్రామం సంగాయపేట లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. ఈవిషయాన్ని వెంకటాపూర్ గ్రామ బిఆర్ఎస్‌పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ అధ్యక్షుడు యాదయ్య, పోతుగంటి నరేందర్, నిరంజన్, పాండు, బాలరాజు, కృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

## గవాయ్‌పై దాడికి నిరసన



ప్రజాపక్షం/అమరచింత : భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం అమరచింత మండల కేంద్రంలోని బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర డిహెచ్పిస్, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్‌లు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి ఏ. రవీందర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఏ. భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి. కుతుబ్ లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పై ఆర్ఎస్ఎస్, సంఘ పరివార్ శక్తులు పథకం ప్రకారం దాడి జరిపించారని ఆరోపించారు. ప్రధాన న్యాయమూర్తి దళితుడైనందువల్లే ఈ దాడికి ఒడిగట్టారని, ఆ స్థాయిలో వేరే ఎవరైనా ఉంటే ఇలా జరిగేదేనా అని వారు ప్రశ్నించారు. మధ్యప్రదేశ్‌లో సెప్టెంబర్ 16న జరిగిన సంఘటనను సాకుగా తీసుకుని ఖజురహూ ఆలయంలో ఉన్న ఏడడుగుల విష్ణుమూర్తి విగ్రహానికి తలను పెట్టాలని జాతీయ పురావస్తు శాఖకు మతున్మాదులు విన్నవించగా ఆ శాఖ అధికారులు ధిక్కరించారు. సుప్రీంకోర్టులో ఇదే విషయమై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయయూర్తి బి.ఆర్ గవాయి అసహానానికి లోనై విష్ణుమూర్తినే ప్రార్థించాడనీ తెలపడంతో ఆశక్తులు కుట్రలు చేసి న్యాయమూర్తిపై దాడి జరిపిన లాయర్ రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రధాన న్యాయమూర్తికి రక్షణ కల్పించలేని స్థితిలో ఉన్న న్యాయవ్యవస్థ ఉండడం నిజంగా బాధకరమని వారు విచారం వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటి ఉన్నత లక్ష్యాలు ఎలా సాధిస్తామని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యవాదులు, సామాజికవేత్తలు , రాజకీయ పార్టీల నాయకులు న్యాయమూర్తి పై జరిగిన దాడిని ఖండిచాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎస్.శ్యాంసుందర్, సాలు, ఏసన్న పాల్గొన్నారు.

## అందరి ఆమోదంతో డిసిసి అధ్యక్షుడి నియామకం




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : జిల్లాకాంగ్రెస్ కమిటీ(డిసిసి) అధ్యక్షుల ఎంపిక కోసం నివేదికను ఏఐసిసికి అందించి తుదినిర్ణయం ఏఐసిసి అధ్యక్షులు ఎన్నుకుంటారని డిసిసి ఎన్నికల అబ్జర్వర్, పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వేలు నారాయణస్వామి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో ప్రస్తుత డిసిసి అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆమోదంమేరకు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడే అభ్యర్థులను అందరి ఆమోదంతో డిసిసి అధ్యక్షునిగా నియమిస్తామని అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల డిసిసి అధ్యక్షుల ఎన్నికలకోసం ఏఐసిసి తనను అబ్జర్వర్‌గా పంపడం జరిగిందని అన్నారు. ఈమూడు జిల్లాలకు సంబంధించి ఆశావాహులనుంచి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు యువజన కాంగ్రెస్ , మహిళాకాంగ్రెస్, సేవాదల్‌సభ్యుల అభిప్రాయాలనుకూడా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# రీల్



హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సజ్జనార్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన చిరంజీవి, ఆయన కుమార్తె సుస్మిత

## రవితేజా@76



మాస్ మహారాజా రవి తేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో వస్తున్న 76వ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈసినిమా ప్రతుతం ఫారిన్ షెడ్యూల్ జరుపుకుంటోంది. గత కొన్ని రోజులుగా స్పెయిన్ లోని వాలెన్సియా, సమీప దీవుల్లో లొకేషన్ రికీ పనులు పూర్తి చేశారు. శనివారం నుంచి జెనీవా, ఫ్రాన్స్‌లో కూడా కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. మొత్తం 25 రోజుల ఈ షెడ్యూల్‌లో కీలక టాకీ పార్ట్‌లతో పాటు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీతో రెండు పాటలు చిత్రీకరించబోతున్నారు. ఈ సినిమాకి కంపోజర్ భీమ్స్ సెసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. రవితేజ మాస్ ఎలిమెంట్స్‌తో ఫుల్‌ప్లెడ్జ్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతోంది.ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమాకి సినిమాటోగ్రఫీని ప్రసాద్ మూరెళ్ళ. నేషనల్ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. టైటిల్, ఫస్ట్ లుక్, ఇతర నటీనటుల వివరాలు త్వరలోనే మేకర్స్ తెలియజేయనున్నారు.

## 'కే-ర్యాంప్' ట్రైలర్ విడుదల



సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కే ర్యాంప్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేశ్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'కేర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జైన్స్ నాని మాట్లాడుతూ ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నా. ట్రైలర్ లోని ఎనర్జీకి సినిమా ఏమాత్రం తగ్గదు. నటుడు వీకే నరేష్ మాట్లాడుతూ ఈ దీపావళి నైట్ కె ర్యాంప్ థియేటర్స్‌లో సెలబ్రేట్ చేసుకుందాం. సామజవరగమన సినిమాతో ఈ సంస్థ నన్ను కొత్తగా చూపించింది. ఈ చిత్రంతో మరింత వైవిధ్యమైన పాత్రతో మీ ముందుకు వచ్చే అవకాశం కల్పించింది. కిరణ్ తో కలిసి నటించడాన్ని ఎంజాయ్ చేశాను. ఈ తరంలో టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ జైన్స్ నానితో కె ర్యాంప్ మూవీ చేయడం హ్యాపీగా ఉందన్నారు.
హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ కొత్త స్క్రిప్ట్ చేద్దామనే ఉద్దేశంతో క అనే సినిమాను చేశాను. అయితే 'కేర్యాంప్' ర్యాంప్ మాత్రం మీకోసం నా ఫ్యాన్స్ కోసం చేశాను. అప్పటికి నేను ఒక్క సినిమానే చేసినా నా రెండో చిత్రం ఎస్ఆర్ కల్యాణమండపంను థియేటర్స్‌లో చూసి మీరంతా ఆదరించారు. నా పర్ ఫార్మెన్స్ ను ఎంజాయ్ చేశారు. 'కే ర్యాంప్' మూవీకి కర్త కర్మ క్రియ అన్నీ నానీనే. ఈ సినిమా చేస్తున్నంతసేపూ నా నవ్వు ఇలాగే ఉంది. అంత బాగా నన్ను మా ప్రొడ్యూసర్స్ చూసుకున్నారు అని చెప్పారు.

## 'ఫెయిల్యూర్ బాయ్స్' ఫస్ట్ లుక్ విడుదల



క్రాంతి, అవితేజ్, ప్రదీప్, సుపర్ణ, పవని ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా ఫెయిల్యూర్ బాయ్స్. ఇతర కీలక పాత్రల్లో సుమన్, నాజర్, తనికెళ్ల భరణి నటించారు. ఈ చిత్రాన్ని శ్రీ గురుదక్షిణ మూర్తి ఫిలింస్ బ్యానర్ పై వీవీఎస్ కుమార్, ధన శ్రీనివాస్ జామి, లక్ష్మి వెంకట్ రెడ్డి నిర్మించారు. వెంకట్ రెడ్డి ఉసిరిక దర్శకత్వం వహించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'ఫెయిల్యూర్ బాయ్స్' సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ధన శ్రీనివాస్ జామి మాట్లాడుతూ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా వినోదంతో పాటు మంచి సందేశాన్ని ఇచ్చేలా ఈ చిత్రాన్ని నిర్మించాం. చిత్ర నిర్మాణంలో ఇబ్బందులు ఎదురయ్యాయి అన్నారు. నిర్మాత లక్ష్మి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మంచి యూత్ ఫుల్ ఎంటర్ టైనర్‌గా 'ఫెయిల్యూర్ బాయ్స్' సినిమాను నిర్మించాం అన్నారు.

## నవంబర్ 14న సంతాన ప్రాప్తిరస్తు




టీజర్, లిరికల్ సాంగ్స్ వంటి ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల్లో కావాల్సినంత బజ్ క్రియేట్ చేస్తున్న యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ మూవీ 'సంతాన ప్రాప్తిరస్తు' రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. ఈ సినిమాను నవంబర్ 14న థియేటర్లలో విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. సమాజంలో యూత్ కపుల్స్ ఎదుర్కొంటున్న ఓ సమస్య నేపథ్యంగా కంప్లీట్ ఎంటర్టైన్మెంట్ ప్రధానంగా 'సంతాన ప్రాప్తిరస్తు' తెరకెక్కుతోంది. 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రంలో విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. వెన్నెల కిషోర్ డాక్టర్ భ్రమరం క్యారెక్టర్ లో నవ్వించబోతున్నారు. మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆరట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్న 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రాన్ని దర్శకుడు సంజీవ్ రెడ్డి రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. విక్రాంత్, చాందినీ చౌదరి, వెన్నెల కిషోర్, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్ హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి, జీవన్ కుమార్, సత్య కృష్ణ, తాగుబోతు రమేష్, అభయ్ బేతిగంటి, కిరీటి, అనీల్ గీల, సద్దాం తదితరులు నటిస్తున్నారు.

## 'మిత్ర మండలి' సెన్సార్ పూర్తి.. యు/ఎ సర్టిఫికెట్



ప్రియదర్శి, నిహారిక ఎన్ఎం హీరో హీరోయిన్లుగా విజయేందర్ దర్శకత్వంలో బీవీ వర్క్స్ బ్యానర్ మీద బన్నీ వాస్ సమర్పణలో సప్తాస్వ మీడియా వర్క్స్ మీద కళ్యాణ్ మంతెన, భాను ప్రతాప, డా.విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ఈ మూవీ అక్టోబర్ 16న రిలీజ్ కాబోతోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన సాంగ్స్, టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇక రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న క్రమంలో సెన్సార్ కార్యక్రమాల్ని కూడా చిత్రయూనిట్ పూర్తి చేసుకుంది. 'మిత్ర మండలి' ఆద్యంతం వినోదభరితంగా ఉందని, సమాజంలోని వ్యవస్థల మీద సున్నితంగా విమర్శనాస్త్రాల్ని సంధించారని కొనియాడారు. 'మిత్ర మండలి'ని బడ్డీ కామెడీ యాంగిల్‌లో చూపిస్తూనే మంచి సెటైరికల్ మూవీగా తెరకెక్కించారని అభినందించారు. అన్ని వర్గాల ప్రేక్షకులు చూడాల్సిన చిత్రమని 'యు/ఎ' సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఆద్యంతం అందరినీ ఆకట్టుకునేలా 'మిత్ర మండలి'ని తెరకెక్కించారు. 'మిత్ర మండలి' చిత్రంలో ప్రియదర్శి, నిహారిక ట్రాక్.. విష్ణు ఓయి, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా కామెడీ హైలెట్ కానుందని అర్థం అవుతోంది. ఇక స్పెషల్ అట్రాక్షన్‌గా వెన్నెల కిషోర్, సత్య, వీటీవీ గణేష్ పాత్రలు ఉండబోతోన్నాయి. అందరినీ సర్ ప్రైజ్ చేసేందుకు బ్రహ్మానందం కూడా కనిపించబోతోన్నారు. పాజిటివ్ బజ్ క్రియేట్ చేసిన ఈ మూవీని అక్టోబర్ 16న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.

## సురేశ్ ప్రొడక్షన్స్‌లో ఆనందలహరి సిరీస్

సురేశ్ ప్రొడక్షన్స్ మినీ ప్రజెంట్ చేస్తున్న ఆనంద లహరి తూర్పు, పశ్చిమ గోదావరి నేపథ్యంలో సాగే హార్ట్ టచ్చింగ్ ఫ్యామిలీ రొమాంటిక్ కామెడీ. ప్రేమ, నవ్వులు కలిపిన ఈ సిరీస్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించబోతోంది.ఈ సిరీస్‌ను 13వ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత సాయి వనపల్లి రచన, దర్శకత్వం వహించగా, ప్రవీణ్ ధర్మపురి నిర్మించారు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత సురేశ్ దగ్గుబాటి ఎస్ పీ మినీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సమర్పిస్తున్నారు.యువ దర్శకులు, రచయితలు, టెక్నీషియన్లకు తమ కథలు, ఆలోచనలను అత్యుత్తమ నాణ్యతతో రూపొందించడానికి అవకాశం కల్పించడం సురేశ్ బాబు లక్ష్యం. రామానాయుడు స్టూడియోస్‌లో ఆధునిక సదుపాయాలతో ఈ కలను నిజం చేస్తోంది. ఆనందలహరిలో అభిషేక్ బొడ్డేపల్లి, భ్రమరాంబికా టుటిక ప్రధాన పాత్రల్లో నటించారు, జాయ్ సోలమన్ సంగీతాన్ని అందించారు. ఈ ట్రైలర్ ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. రిఫ్రెషింగ్ టోన్, ప్లజెంట్ విజువల్స్ హ్యూమర్ తో సిరీస్ కోసం అంచనాలను పెంచింది.ఈ దీపావళికి అక్టోబర్ 17న, ఆహాలో విడుదల కానున్న ఆనందలహరితో గోదావరి కుటుంబాల ఆనందాలు, ఎమోషన్స్‌ని మనసారా ఆస్వాదించడానికి సిద్ధంగా ఉండండి.



## అంతరాలు పెరుగుతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

వేశారు. హోం ఫర్ ఏజ్డ్ (వృద్ధాశ్రమం) డైరక్టర్ వి.చెన్నకేశవ రావు సి.ఆర్ ఫౌండేషన్ గురించి వివరించారు. కాగా వివిధ వైద్యసేవల నిమ్మితం ఇటీవల డాక్టర్ రజనీ అందుకున్న అవార్డును ఆమె సిఆర్ ఫౌండేషన్‌కు అంకితం చేశారు. అనంతరం జస్టిస్ నగేష్ భీమపాక మాట్లాడుతూ సమాజానికిఅనేక రకాలుగా సేవలందిచిన వారు వృద్ధాశ్రమంలో ఉన్నారని, వారంతా నడిచేదేవుళ్ల అని అభివర్ణించారు. చంద్ర రాజేశ్వర్ రావు లాంటి మహానీయులు మరణించారనే పదం చాలా చిన్నదన్నారు. సిఆర్ రాసుకున్న లేఖను ఆయన పార్థివదేహం వద్ద పెట్టారని, ఆ లేఖ ఇప్పటికీ తన కళ్ల ముందు కదలాడుతోందని గుర్తుచేసుకున్నారు. కొందరు వివిధ కారణాలతో తమ తల్లిదండ్రులను చుసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని, ప్రస్తుతం మరి కొందరు లగేజీ( తల్లిదండ్రులు) ఉన్నారా? అని అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కురుస్తున్న కాసుల వర్షంలో తడిచి నిరుపేదలుగా మారుతున్నారని చెప్పారు. మార్క్స్ చెప్పినట్టుగా మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారాయన్నారు. ప్రజా సమస్యలపై పరిష్కారానికి చేపట్టే ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినందుకు గాను తన తండ్రి ప్రతి ఏటా కనీసం పది రోజుల పాటు జైలు జీవితాన్ని గడిపేవారని జస్టిస్ నగేష్ భీమపాక గుర్తు చేసుకున్నారు. పది ఎకరాల్లో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి,మరింత సేవలను అందించాలని, ఇందుకు తమ వంతు సహకారం అందిస్తామని ఆయన హామీనిచ్చారు. సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ చంద్ర రాజేశ్వర్ రావు జీవితం ఎంతో మందిని ప్రభావితం చేసిందన్నారు. ప్రతి సమస్యలను సి.ఆర్ లోతుగా ఆలోచించి, ఆ సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు. హిందీపైన పట్టులేకపోయినప్పటికీ దక్షిణాధి రాష్ట్రాలవారితో ఆయన హిందీలో మాట్లాడేవారని గుర్తు చేశారు. ఆనాటి తెలంగాణ ఉద్యమ సమయంలో సిఆర్ విద్యార్థులతో మాట్లాడారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమంలో సలహా కమిటీ సభ్యులు టి.రాజేందర్‌రావు,తమ్మారెడ్డి తాన్యా కుమారి వేదికపై ఆసీనులయ్యారు. సమావేశనంతరం వృద్ధాశ్రమంలో ఉంటున్న వారిని హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ఆప్యాయంగా పలుకరిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

### సి.ఆర్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు : పల్లా

పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఎంబ్రాయిడరీ,కంప్యూట్ లాంటి పలు వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. లైబ్రరీ సెంటర్‌కు ఇటీవల మరణించిన సురవరం సుధాకర్ రెడ్డి పేరు పెట్టామని, ఈ లైబ్రరీని డిజటల్ చేశామని తెలిపారు. దీనిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వైద్య సేవలను కూడా అందిస్తున్నామని పల్లా వెంకటరెడ్డి తెలిపారు.



సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా సిఆర్ ఫౌండేషన్‌కు వచ్చిన మాజీ ఎమ్మెల్యే, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డిని, జాతీయ కార్యదర్శి బాధ్యతలు నుండి తప్పుకున్న ఫౌండేషన్ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషాలను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ ఫౌండేషన్ డైరెక్టర్ చెన్నకేశవ రావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజిని తదితరులు



## ఆర్‌డిఆర్ పేరు

(మొదటి పేజీ తరువాయి)

నామకరణం చేస్తున్నామని ప్రకటించారు. 24 గంటల్లో దీనికి సంబంధించిన జిఓ జారీ చేస్తామని తెలిపారు. నేటి రోజుల్లో ఓ నాయకుడు ఒక్కసారి ప్రజాప్రతినిధి అయితేనే వేల కోట్ల రూపాయలు సంపాదించుకొని వెనకేసుకుంటున్నారని, కానీ పార్టీ కోసం దామోదర్ రెడ్డి తన తల్లిదండ్రులు, అత్తగారి నుండి వారసత్వంగా వచ్చిన తన స్థిర, చరాస్థులను పార్టీ కోసం తెగనమ్మి కార్యకర్తలను కంటికి రెప్పలాగా కాపాడుకున్న మహానాయకుడని కొనియాడారు. ఆదివారం తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలో నిర్వహించిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభకు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన శాసనసభ్యులతో కలిసి హాజరయ్యారు. దీనికి ముందు రాష్ట్ర డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు కుందూరు జానారెడ్డిలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తుంగతుర్తి ప్రాంతం నీరు లేక ఏడారిగా కొద్ది రోజులలో మారిపోతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యాయనం చేసి వెల్లడించిందని చెప్పారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దీనిని దృష్టిలో ఉంచుకొని సాగు, విద్యాభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యత ఇచ్చారని దీనిలో భాగంగానే శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. తాగు, సాగు నీరు లేక ఏడారిగా మారుతున్న తుంగతుర్తి ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకవచ్చేందుకు శాసన సభ్యునిగా, రాష్ట్ర మంత్రిగా దామోదర్ రెడ్డి అనేక పోరాటాలు చేశారని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వంలో గోదావరి జలాల కోసం రక్తతర్పణం చేసి ఆనాటి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేసి శ్రీరాంసాగర్ రెండవ దశ ప్రాజెక్టును సాధించిన ధీశాల అని కొనియాడారు. ప్రాజెక్టు నిర్మాణానికి అరకొర నిధులు కేటాయించి పనులు పూర్తి చేయకపోవడంతో రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధిక నిధులు కేటాయించేలా కృషి చేసి ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి గోదావరి జలాలను కాలువల్లో పారించారని చెప్పారు. ఆయన పుట్టిన ఖమ్మం జిల్లా, ప్రాతినిధ్యం వహించిన తుంగతుర్తి, సూర్యాపేట నియోజక వర్గాలలో రాంరెడ్డి కుటుంబం కడవరకు పార్టీ అభివృద్ధి కోసం పాటుపడిందన్నారు. తాను ప్రాతినిధ్యం వహించిన తుంగతుర్తిని వీడి సూర్యాపేట నియోజక వర్గానికి వెళ్ళినా ఏనాడు తుంగతుర్తి ప్రాంతాన్ని మరువలేదన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవడంతోనే గత అసెంబ్లీ ఎన్నికల్లో జేబులో రూ.50వేలు లేని మందుల సామేల్ 50వేల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు. నాలుగు దశాబ్దాలుగా గాంధీ కుటుంబానికి దామోదర్‌రెడ్డి కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. అందుకే ఎఐసిసి సభ్యురాలు సోనియాగాంధీ, జాతీయ అధ్యక్షులు ఖర్గే, జాతీయ యువ నాయకులు రాహుల్‌గాంధీ దామన్న మరణవార్త విని ఆయన కుమారునికి సంతాపం తెలిపారని అన్నారు. దామోదర్ రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్న విషయాన్ని తనతో చెప్పడం జరిగిందని సిఎం సభలో వెల్లడించారు. రాజకీయపరంగా గాంధీ కుటుంబం దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డికి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. చివరి శ్వాస ఉన్నంత వరకు కాంగ్రెస్ జెండాను వీడని దామోదర్ రెడ్డి కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా ఉండడంతోనే ఈ ప్రాంత ప్రజలు ఆయనను ముద్దుగా టైగర్ దామన్న అని పిలుచుకుంటున్నారని చెప్పారు. డిప్యూటి సిఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు భవనాలు, సినిఫోటోగ్రఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ మంత్రి, సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, అద్దంకి దయాకర్ తదితరులు తమ సంతాప సందేశాన్ని ఇచ్చారు. దామోదర్ రెడ్డితో వారికి ఉన్న అనుబంధాన్ని, పార్టీ కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బాలు నాయక్, వేముల వీరేశం, మట్ట రాఘవమయి, డిప్యూటి స్పీకర్ డాక్టర్ రాంచందర్ నాయక్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ పాల్గొన్నారు.

## దొరే అయినా... ఏనాడూ అలా వ్యవహరించలేదు

### పేదలతో రాంరెడ్డి కుటుంబానికి విడదీయరాని అనుబంధం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/తుంగతుర్తి : పుట్టుక దొరలే అయినా మాజీ మంత్రులు రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి దామోదర్ రెడ్డిలు ఏనాడు దొరతనంతో వ్యవహరించలేదని పేదలతోనే వారి కుటుంబానికి మొదటి నుండి విడదీయరాని అనుబంధం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదర్ రెడ్డి తమ ఖమ్మం జిల్లా బిడ్డనేనని అన్నారు. వారిది కాంగ్రెస్ వాదులైనా మేము కమ్యూనిస్టులమైనా తమ మధ్య అనుబంధం విడదీయరానిదని గుర్తు చేసుకున్నారు. సుజాతనగర్‌లో తన అన్న రాంరెడ్డి వెంకట్‌రెడ్డి కమ్యూనిస్టులపైనే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఒక్కసారి గెలుపొందారని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో వెంకట్‌రెడ్డి, దామోదర్ రెడ్డిలు ఢీకొన్నది కమ్యూనిస్టులతోనేనని అన్నారు. తనకు రాంరెడ్డి కుటుంబంతో వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయని చెప్పిన ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడినా, గెలిచినా నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారు జీవనం సాగించారని తెలిపారు. తన అన్న వెంకట్‌రెడ్డి మరణించగా పాతలింగాలకు తాను వెళ్ళగా ఆ ప్రాంత గిరిజనులతో వారికి ఉన్న సంబంధాలను చూసి ఆశ్చర్యపోయానన్నారు. పుట్టింది దొర పుట్టుక అయినా ఏనాడు వారు దొరల్లా వ్యవహరించకుండా పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డికి మంచి భవిష్యత్తు రాజకీయ భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. వారి పెద్దల ఆశయాలను ముందుకు తీసుకపోవాలని కోరారు.

### గోదావరి జలాల సాధనకై పోరాడిన మహానాయకుడు: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

కరువు ప్రాంతాలైన తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో గోదావరి జలాలను తీసుకవచ్చేందుకు సుదీర్ఘకాలం పోరాడిన మహానాయకుడు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యల కోసం పోరాడిన దామోదర్ రెడ్డి మరణం భాదాకరమన్నారు. 1985లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుండి తుంగతుర్తి నియోజక వర్గంలో శాసనసభ్యునిగా గెలుపొందిన ఆయన ప్రజా నాయకుడిగా అంచెలంచెలుగా ఎదిగారన్నారు. ఐదు పర్యాయాలు శాసనసభ్యుడిగా, రెండు సార్లు మంత్రిగా పనిచేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని అన్నారు. దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డి ఆయన ఆశయ సాధన కోసం ముందుకు సాగాలని కోరారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com